

STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL



GST NO: 36ACPPF9587L2ZM
TELTEL/2013/53323

# సమయుజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 79 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 గురువారం 29 మే 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్




1959 - 2024
దివంగత షఫీఉల్లా ఖాన్
మాజీ మేనేజింగ్ ఎడిటర్

# బిఆర్ఎస్ నేతలు కనిపిస్తే ఎక్కడిక్కడ నిలదీయండి

## విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న బిఆర్ఎస్ ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులకు మోసం

- కెసిఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ ఉద్యోగాలు
- కాంగ్రెస్ వచ్చాక 15 నెలల్లో 55 వేల ఉద్యోగాల భర్తీ
- చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని హితవు
- ఎస్సీ గురుకుల టాపర్లకు బహుమతులు అందించిన రేవంత్



2లో

హైదరాబాద్,మే28(సమయజ్యోతి):

గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుందని, ఉద్యోగాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండపడ్డారు. తమ ఇంట్లో ఉద్యోగాలు వస్తే చాలనే ధోరణిలో నిరుద్యోగులను మోసం చేసిందని అన్నారు. తమ ప్రభుత్వం హయాంలో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. గతంలో కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయని ఆయన వ్యంగ్యంగా అన్నారు. తెలంగాణ వస్తే.. ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ఆశలపై నీళ్లు చల్లారు. మాజీ సీఎం తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు గానీ, రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదు. తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చుకున్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లోనే 55వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసింది. ఇంకా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత సంఖ్య లక్షల్లో ఉంది. బుధవారం హైదరాబాద్‌లోని బాబూ జగజ్జీవన్‌రామ్ భవన్‌లో ఎస్సీ గురుకులాల్లో టెన్త్, ఇంటర్ చదివి.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా బహుమతుల ప్రదానం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీకి ఎందుకు నోటిఫికేషన్లు ఇవ్వలేదంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన నిలదీశారు. పీజీలు చేసిన విద్యార్థులు ఎంతో విలువైన కాలాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.



# లబ్ధిదారులకు మంజూరు లేఖలు అందించాలి

- జూన్ 2న రాజీవ్ యువవికాస కార్యక్రమం
- జాబితా మేరకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటి సిఎం భట్టి ఆదేశం

హైదరాబాద్,మే 28(సమయజ్యోతి):

రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన అన్ని జిల్లాలలో రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు సాంక్షన్ లెటర్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లా ఇన్చార్జి మంత్రులకు లబ్ధిదారుల జాబితాను సమర్పించి వారి అనుమతితో జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. బుధవారం భట్టి విక్రమార్క, రాష్ట్ర బి.సి.సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణా రావులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకం అమలు ప్రగతిని అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు.

# వ్యక్తిగత ఎజెండాతో విమర్శలు తగవు

## బిజెపి నేతలకు కిషన్ రెడ్డి క్లాస్

హైదరాబాద్,మే28(సమయజ్యోతి):



తెలంగాణ బీజేపీ నేతలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ముఖ్యనేతలతో సమావేశమై నేతలకు క్లాస్ ఇచ్చారు. కొందరు నేతలు వ్యక్తిగత ఎజెండాలో పని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లు- ప్రెస్ మీట్లు- పెట్టి వ్యక్తిగత దూషనలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పార్టీ కార్యాలయాన్ని వ్యక్తి గత అవసరాలకు వాడుకుంటే ఊరుకునేది లేదని నేతలకు గట్టిగా చెప్పారు. పార్టీ ఆఫీసులో పార్టీ లైన్ ప్రకారమే మాట్లాడాలని సూచించారు. ఇక మీదట ప్రెస్ మీట్లు- పెట్టాలంటే అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇది తనతో పాటు- అందరికీ వర్తిస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ పార్టీ నేతలు హూందాగా ప్రవర్తించాలని సూచించారు.బీజేపీ అంటే బాధ్యతగల పార్టీ అని సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన పార్టీ అని కీలక వ్యాఖ్యాలు చేశారు. రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా పార్టీ ఆఫీస్‌ను ఆశ్రయిస్తున్నారని.. అలాంటి వారికి న్యాయం చేసేలా నేతలు పోరాటం చేయాలని సూచించారు. అలా కాకుండా, ఇష్టం వచ్చినట్లు- ప్రెస్‌మీట్‌లు పెట్టి వ్యక్తిగత దూషణలకు దిగుతే చర్యలు తప్పవని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.



# తెలంగాణహైకోర్టు కొత్త చీఫ్ జస్టిస్‌గా ఏకే సింగ్

## సిఫార్సు చేసిన సుప్రీం కొలీజియం

హైదరాబాద్,మే28(సమయజ్యోతి):

తెలంగాణహైకోర్టు కొత్త చీఫ్ జస్టిస్‌గా అపరేష్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) పేరును కొలిజియం సిఫార్సు చేసింది. అపరేష్ కుమార్ ప్రస్తుతం త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. ఇక ప్రస్తుత తెలంగాణ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా ఉన్న సుజయ్ పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలిజియం సిఫార్సు చేసింది. అపరేష్ కుమార్ సింగ్ 1965, జూలై 7న జన్మించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. 1990 నుంచి 2000 వరకు పాట్నా హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తరవాత 2001లో జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012, జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2021 ఏప్రిల్ నుంచి జార్ఖండ్ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా అపరేష్ కుమార్ నియమితులయ్యారు. ఇక 2022 నుంచి 2023 వరకు జార్ఖండ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2023, ఏప్రిల్ 17న త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా అపరేష్ కుమార్ సింగ్ పదోన్నతి పొందారు.

# రాజ్యసభకు కమలహాసన్ ఖరారు

## నాలుగు సీట్లలో ఒకటి ఇచ్చేందుకు డిఎంకె ఓకే



చెన్నై,మే 28(సమయజ్యోతి):

మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎమ్) పార్టీ అధినేత , ప్రముఖ నటుడు కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డీఎంకేతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఎంఎన్ఎంకు ఎగువసభ స్థానం కేటాయించారు. ఈ విషయాన్ని డీఎంకేఎంఎన్ఎం ఖరారు చేశాయి. ఎనిమిది రాజ్యసభ స్థానాలకు జూన్ 19న ఎన్నికలు జరగనున్నాయి. తమిళనాడుకు చెందిన అన్బుమణి రామదాస్, ఎం.షణ్ముగమ్, ఎన్. చంద్రశేగరన్, ఎం.మహమ్మద్ అబ్దుల్లా, పి. విల్సన్, వైగో ఎగువసభ పదవీ కాలం జులై 25తో ముగిసింది. ప్రస్తుతం ఆ రాష్ట్ర అసెంబ్లీలో డీఎంకేకు 134 మంది ఎమ్ఎల్ఎలు ఉన్నారు.దాంతో నాలుగు స్థానాలనూ ఆ పార్టీనే దక్కించుకుంటుందని తెలుస్తోంది.

02

# కెసిఆర్‌కు పేరు రావడం ఇష్టం లేకే కుట్రలు

- మేడిగడ్డపై ఎన్డీఎస్ఏ నివేదికపై మండిపడ్డ కెటిఆర్
- అది ఎన్‌డిఎ నివేదిక అంటూ విమర్శలు
- ఎక్స్ వేదికగా కెటిఆర్ ఆరోపణలు



2లో

హైదరాబాద్,మే28(సమయజ్యోతి):

మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ-) ఇచ్చిన నివేదికను ఎన్డీయే నివేదిక అనడంలో ఎలాంటి తప్పు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. నాణ్యత లేనిది కాళేశ్వరం, మేడిగడ్డలో కాదని.. కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న రాజకీయాల్లోనే అని విమర్శించారు. ఎన్ని కుట్రలు సృష్టించినా.. ఎప్పటికీ వాస్తవమే నిలుస్తుందన్నారు. అశాస్త్రీయ ఆరోపణలను ఎల్ అండ్ టీ ఖండించండం సంతోషమన్నారు. కాళేశ్వరం ప్రపంచంలోని అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ అని, కేసీఆర్ దూరదృష్టి గల నాయకుడు అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.



02

# ముప్పై ఏళ్ల పోరాటానికి దక్కిన గుర్తింపు

- పద్మశ్రీ ఉద్యమకారులకు దక్కిన గౌరవం
- మందకృష్ణ మాదిగా వెల్లడి

హైదరాబాద్,మే28(సమయజ్యోతి):

వ్యక్తిగతంగా నా పేరుతో పద్మశ్రీ వచ్చినా.. ఇది ఉద్యమకారులందరికీ దక్కిన గౌరవం అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. పద్మశ్రీ పురస్కారం ఉద్యమానికి దక్కిన అభినందనలు అని తెలిపారు. 1994లో ఉద్యమం మొదలైందని, ఎమ్మార్పీఎస్‌ది ముప్పై ఏళ్ల పోరాటమన్నారు. సమాజంలో అన్ని వర్గాల అండదండలతోనే ఉద్యమం సాధ్యమయిందన్నారు. సుప్రీంకోర్టు సైతం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని మందకృష్ణ మాదిగ అన్నారు.

# టిడిపి జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు

- మహానాడు వేదికగా ఏకగ్రీవ ఎన్నిక
- ఎన్నికను ప్రకటించి..ప్రమాణం చేయించిన వర్ల రామయ్య
- బాబుకు మద్దుతగా పలువురు నామినేషన్లు
- గత 30 ఏళ్లుగా వరుసగా ఎన్నికవుతూ వస్తున్న చంద్రబాబు
- శక్తి ఉన్నంత వరకు ప్రజలకోసం పనిచేస్తానని బాబు హామీ

2లో



మొదటిపేజీ తరువాయి

# బిఆర్ఎస్ నేతలు కనిపిస్తే ఎక్కడికక్కడ నిలదీయండి

చదువుకున్న పిల్లలకు తాము ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. ఒక్క ఏడాదిలోనే 59 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. గత 15 ఏళ్లుగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేదన్నారు. తమ హయాంలో 563 గ్రూప్-1 పోస్టులు భర్తీ చేస్తున్నామని వివరించారు. గ్రూప్-1లో 89శాతం పోస్టులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు దక్కాయని సీఎం రేవంత్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ఈ రోజు అంటే బుధవారం తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి అని గుర్తు చేశారు. వారి స్ఫూర్తిని కొనసాగించేం దుకు తెలుగు యూనివర్సిటీకి వారి పేరు పెట్టుకున్నామన్నారు. కోటిలోని మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టుకున్నామని తెలిపారు. ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారని ఆయన స్పష్టం చేశారు. జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. కులం వల్ల ఎవరికీ గుర్తింపు రాలేదు... మంచి చదువుతోనే అందరికీ గుర్తింపు వచ్చిందని చెప్పారు. ఆత్మనూన్యత భావాన్ని వీడాలంటూ దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. వారిలోని ఆత్మనూన్యత భావాన్ని తొలగించేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బర్రెలు, గొర్రెలు, చేపలు వంటి స్కీములు తెచ్చారని గుర్తు చేశారు. కానీ మీకు చదువు చెప్పి రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తామని ఎందుకు చెప్పలేదంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా పదేళ్లు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడింది వాస్తవం కాదా? అని ఆ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కానీ మేం మొదటి ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని స్పష్టం చేశారు. మొదటి ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. అంతేకాదు గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు సైతం విడుదల చేశామన్నారు. కానీ నోటికాడి కూడును కింద పడేసినట్లు-.. రాజకీయ కుట్రతో నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని గత ప్రభుత్వ పెద్దలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో గ్రూప్ 1 పరీక్షలు కూడా నిర్వహించని పార్టీలు కోర్టులో కేసులు వేసి అడ్డుకుంటున్నారన్నారు. అందుకే ఇది సామాజిక సమస్యగా మారుతోందని పేర్కొన్నారు. వాళ్లింట్లో ఎన్నికల్లో ఓడిపోతే ఆరు నెలలు తిరగకుండానే ఇంకో ఉద్యోగం ఇచ్చుకున్నారని బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. కానీ మీకుమాత్రం ఉద్యోగాలు రాకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. అలాంటి వారు మీకు ఎదురైతే ప్రశ్నించండంటూ యువతకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మొదటి పాతికేళ్ల వయసు వరకు బాగా చదువుకుంటేనే మీరు మీ జీవితంలో రాణిస్తారన్నారు. తప్పుదారి పడితే కన్న తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి ఉంటుందని విద్యార్థులకు ఆయన కీలక సూచన చేశారు. అలాంటి పరిస్థితులు ఎప్పుడూ తెచ్చుకోవద్దంటూ విద్యార్థులకు హితవు పలికారు. కష్టపడండి.. సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో రాణించి తల్లిదండ్రులకే కాదు.. రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. వందేళ్ల ఉస్మానియా చరిత్రలో తొలిసారిగా దళితుడిని వైస్ చాన్స్‌లర్‌గా నియమించిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. విద్యా కమిషన్ చైర్మన్‌గా ఆకునూరి మురళిని నియమించామని గుర్తు చేశారు. అలాగే అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌ను ప్రజా ప్రభుత్వంలో ఎంపిక చేసుకున్నామని వివరించారు. వీరందరికీ కేవలం కులం ప్రాతిపదికన గుర్తింపు రాలేదు.. చదువుకున్నారు కాబట్టే వారికి ఈ గుర్తింపు వచ్చిందని విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందన్నారు. అన్ని రంగాల్లో మీరు రాణించాలని మనస్ఫూర్తిగా తాను కోరుకుంటు-న్నానని తెలిపారు. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. చాలా మంది మహనీయులకు గుర్తింపు తెచ్చింది కులం కాదు.. చదువు మాత్రమే. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువుతోనే సాధ్యమవుతుంది. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాల్సిన అవసరం ఉంది. యంగ్ ఇండియా నా బ్రాండ్.. నా బ్రాండ్ అంబాసిడర్లు మీరే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు విద్యార్థులు ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను సిఎ ఆసక్తిగా తిలకించారు.

మొదటిపేజీ తరువాయి

## లబ్దిదారులకు మంజూరు లేఖలు అందించాలి

రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఆశలను ముందుకు తీసుకు వెళ్లే క్రమంలో గౌరవ ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా భావించి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 5 లక్షల మంది యువతకు 6 వేల 250 కోట్లతో స్వయం ఉపాధి కల్పించ నున్నారని భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు మాట్లాడుతూ, లబ్ధిదారులకు నిజమైన లబ్ధి చేకూరే విధంగా యూనిట్ల ఎంపిక ఉండాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. తద్వారా ఎంచుకున్న యూనిట్ల ద్వారా యువతి యువకులకు ఆదాయ వనరుగా, లబ్ధిదారుని కుటుంబం ఆర్థికంగా బలపడే విధంగా రాజీవ్ యువ వికాసం పథకం తోడ్పడాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. దశల వారిగా జరిగే లబ్ధిదారుల ఎంపిక పక్రియలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు శిక్షణ, క్షేత్ర స్థాయిలో యూనిట్ల గ్రౌండింగ్ వరకు అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, బ్యాంకర్లతో సమన్వయం చేసుకొని ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి తో పాటు- రాష్ట్ర జి.డి.పి. లో వారిని భాగస్వామ్యం చేసే విధంగా యూనిట్ల ఎంపిక జరగాలని సి.ఎస్ సూచించారు. అదేవిధంగా వాతావరణ శాఖ విడుదల చేసిన హెచ్చరికల నేపథ్యంలో సంబంధిత జిల్లాలలో కురుస్తున్న వర్షాల పట్ల జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముందు జాగ్రత్తలపై దృష్టి సారించాలని సి.ఎస్ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్సీ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీ ఇ.శ్రీధర్, బీసీ సంక్షేమ కమిషనర్ బాల మాయాదేవి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ యాస్మిన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## ముప్పై ఏళ్ల పోరాటానికి దక్కిన గుర్తింపు

మంగళవారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా మందకృష్ణ పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. పద్మశ్రీ పురస్కారం ఉద్యమానికి దక్కిన అభినందనలు. వ్యక్తిగతంగా నా పేరుతో పద్మశ్రీ వచ్చినా.. ఇది ఉద్యమకారులందరికి దక్కిన గౌరవం. సమాజంలో అన్ని వర్గాల అండదండలతోనే ఉద్యమం సాధ్యమయింది. 1994లో ఉద్యమం మొదలైంది, ఎమ్మార్పీఎస్‌ది ముప్పై ఏళ్ల పోరాటం. సుప్రీంకోర్టు సైతం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఉద్యమ లక్ష్యం నెరవేరింది, కేంద్రం గుర్తింపు కూడా ఇచ్చింది. పద్మశ్రీ అవార్డును గౌరవంగానే కాదు బాధ్యతగా ఫీల్ అవుతున్నాం. ఇంకా పరిష్కారం కాని సమస్యల కోసం భవిష్యత్ ప్రయాణం ఉంటు-ంది. చట్టసభల్లో పరిష్కారం కావాల్సిన సమస్యలు ఉన్నాయి. రాజకీయాల్లోకి వచ్చినా కండువా మారదు. రాజకీయ చైతన్యం కోసం కూడా సిద్ధం అవుతాం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతోనే మాదిగలకు అన్యాయం జరిగింది. ఏపీలో చంద్రబాబు నాయుడు మాదిగలకు ప్రాతినిధ్యం పెంచారు' అని మందకృష్ణ మాదిగ అన్నారు.

మొదటిపేజీ తరువాయి

## రాజ్యసభకు కమలహాసన్ ఖరారు

ఇదిలా ఉంటే.. విపక్ష ఇండియా కూటమిలో ఎంఎన్ఎం భాగం. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే , కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒప్పందంలో భాగంగా రాష్ట్రం లోని 39 లోక్‌సభ స్థానాలు , పుదుచ్చేరి లోని ఒక స్థానంలో ఎంఎన్ఎం ప్రచారం చేసింది. 2025 ఎగువ సభ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ స్థానం ఇచ్చేందుకు డీఎంకే నేతృత్వం లోని కూటమి అంగీకరించింది. ఆయన 2018లో ఎంఎన్ఎం పార్టీని స్థాపించారు. అవినీతి, వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు గ్రామాల సాధికారత కోసం దీనిని ఏర్పాటు- చేసినట్టు- తెలిపారు. అన్నాడీఎంకేకు ప్రస్తుతం తమిళనాడు అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేల బలంతో ఒక్క రాజ్యసభ ఎంపీ గెలుస్తుంది. ఒకవేళ మరో అభ్యర్థిని కూడా గెలిపించు కోవాలని భావిస్తే అది బీజేపీ, పీఎంకే ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాల్సి ఉంటుంది. బీజేపీ ప్రస్తుతం అన్నాడిఎంకే పక్షానే ఉంది. తప్పకుండా ఇరు పార్టీలు సహకరించుకునే అవకాశం ఉంది.

## సంక్షేమ హాస్టళ్లలో పిల్లలతో వెట్టి

### శానిటేషన్ సిబ్బందిని తొలగింపు

### కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై కవిత మండిపాటు

**హైదరాబాద్,మే28(సమయజ్యోతి):** కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో సంక్షేమం కొరవడిందని, పిల్లలే టాయ్‌లెట్‌ఉ శుభ్రం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, ఉన్న పరిస్థితిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. స్వీపింగ్, శానిటేషన్ కోసం ఒక్కో గురుకుల పాఠశాలకు ప్రతి నెల బీఆర్ఎస్ ప్రభుత్వం రూ . 40,000 కేటాయిస్తే నలుగురు తాత్కాలిక ఉద్యోగులు పనిచేసేవారని కవిత గుర్తు చేశారు. వీరు టాయిలెట్లు-, తరగతి గదులు శుభ్రం చేసేవారు. గత సంవత్సరం ఆగస్టు నెల నుండి ఈ పద్ధతి కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించినందున పిల్లలే టాయిలెట్లు-, గదులు మాత్రమే కాకుండా పాఠశాల హాస్టల్ ఆవరణలోని బయటి పనులు అన్ని కూడా విద్యార్థులే రెగ్యులర్‌గా చేసుకోవాలని చెప్పారని కవిత పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు గురుకుల పాఠశాలలోని వాచ్‌మెన్ వాటర్ ట్యాంక్ క్లీన్ చేస్తూ ప్రమాదవశాత్తు మరణించగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాష్ట్రంలోని 240 గురుకుల విద్యాసంస్థలలో అసిస్టెంట్ కేర్ టేకర్‌లను తొలగించి వారు చేసే వార్డెన్ పనులను పిల్లలతో చేయించాలని చెప్తున్నారు. ఇప్పటివరకు వార్డెన్లే అన్ని రకాల నిర్వహణలు చూసుకున్నా పిల్లలు కమిటీ-గా ఏర్పడి క్వాలిటీ- చెక్ చేసుకునేవారు. కానీ ఇకపై పిల్లలే వంటశాల నిర్వహణ మరియు మెస్ పనులు కూడా చేయవలసి వస్తుందన్నారు. శ్రమను గౌరవించడం నేర్పడం వేరు, విద్యార్థులతో వెట్టిచాకిరి చేయించడం వేరు. అసలు మొత్తంగా శానిటేషన్ వర్కర్స్‌ను తొలగించి ఆ పనులు పిల్లలతో రెగ్యులర్‌గా చేయించడం నేరమని కవిత పేర్కొన్నారు. ఇక్కడ ఆడియోలో వర్షిని గారు చెప్పిన దాంట్లోనే సమాధానం ఉంది. బోర్డు తుడవడం టాయిలెట్ కడగడం ఒకటి కాదు. మేడం గారి పిల్లలు చదువుకునే చోట అందరూ వాడే టాయిలెట్లను వీరు క్లీన్ చేయగలరా. అది కూడా రెగ్యులర్‌గా. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో చదివే పిల్లలు ఏమైనా పోష్ బ్యాక్ గ్రౌండ్ నుండి వచ్చారా? వెళ్లి కూర్చోగానే టేబుల్ పైకి ఫుడ్ రాదు అనడం.. ఎందుకు ఇలాంటి పనులు చేయరు చేయాల్సిందే అని ఒక ఐఏఎస్ అనడం దుర్మార్గం. ఈ వివక్షల నుండి తప్పించడానికే కదా ఈ పిల్లలకు సాంఘిక సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు- చేయించి చదివించేది. ఇది డిగ్నిటీ- ఆఫ్ లేబర్ నేర్పడం కాదు. కుల వివక్ష, శ్రమ దోపిడీ మాత్రమే అని కవిత అన్నారు. దీంతో పాటు- 240 మంది అసిస్టెంట్ కేర్ టేకర్‌లను తొలగించడం కూడా. గతంలో లాగానే పిల్లలు క్వాలిటీ మాత్రమే తనిఖీ చేసుకునే ఏర్పాటు- ఉండాలి. అంతే కానీ పిల్లలతో పూర్తిస్థాయి వార్డెన్, శానిటేషన్ వర్కర్స్ చేయించే పని చేయించడం కరెక్ట్ కాదు. నలుగురు శానిటేషన్ వర్కర్స్ ఒక వార్డెన్ మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులాలలో కలిపి 1200 మంది ఉద్యోగులను తొలగించడం అన్యాయం. ఒకవైపు ఉద్యోగాలు కల్పిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పడం మరోవైపు అత్యవసరమైన చోట వారిని తొలగించి ఆ పని భారం విద్యార్థుల మీద ఉంచడం తప్పు అని కవిత పేర్కొన్నారు. పోష్ పిల్లలు కాకపోయినా అందరూ పిల్లలు సమాజం దృష్టిలో, ప్రభుత్వం దృష్టిలో సమానమే అన్న సంకేతాలను పంపాల్సిన గురుకుల పాఠశాలలు వివక్ష కేంద్రాలుగా మారకూడదు. ఎస్సీ వర్గాల పిల్లలు ప్రధానంగా చదివే గురుకుల పాఠశాలలో ఈ నిర్ణయం మానవతావాదులు ముక్తకంఠంతో ఖండించవలసింది. కాంగ్రెస్ ప్రభుత్వ పేదల వ్యతిరేక ఆలోచన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను, తక్షణమే ఆ అధికారిని తప్పించాలి, నెలకు మెయింటెనెన్సు డబ్బులు పాఠశాలలకు ఇవ్వాలి.

మొదటిపేజీ తరువాయి

## కెసిఆర్‌కు పేరు రావడం ఇష్టం లేకే కుట్రలు

మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక అంతా బూటకమని ఇప్పటిదాకా బీఆర్ఎస్ చెబుతున్న మాటే అక్షరాలా నిజమని తేలిపోయింది. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్డీఎస్ఏ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ- సూటిగా ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయింది. క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్డీఎస్ ఇచ్చిన నివేదికను ఎల్ అండ్ టీ- పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు- లాంటిదే. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ గంటల వ్యవధిలో ఇచ్చిన ప్రాథమిక నివేదికను మొదలుకుని, ఏడాదిన్నర దాకా సాగదీసి ఇటీ-వల ఇచ్చిన తుది నివేదిక వరకూ రెండింటిలోనూ అడుగడుగునా వ్యత్యాసాలు, పొంతనలేని అంశాలుండటం రిపోర్టు డొల్లతనాన్ని బయటపెట్టింది. ఇలాంటి పనికిరాని రిపోర్టును పట్టు-కుని ఎన్డీఎస్ఏ నివేదికనే తమకు ప్రామాణికమని ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం వారి అసమర్థతకు, చేతకానితనానికి, దివాలాకోరు విధానాలకు నిదర్శనం. కేసీఆర్‌కు పేరొస్తుందనే రాజకీయ కక్షతో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంను పక్కనపెట్టి సీఎం రేవంత్ క్షమించరాని పాపం చేశారని ఎక్స్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండగొట్టి, 500 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్యలకు కారణమయ్యారు. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్ఎస్పై బురదజల్లేందుకు కుట్రలు చేసిన కాంగ్రెస్-బీజేపీ.. ఇటీవల బీఆర్ఎస్ రజతోత్సవ సభను దెబ్బతీయాలన్న కుతంత్రాలతోనే తుది నివేదిక పేరిట నయా డ్రామాకు తెరతీశారు. ప్రాజెక్టు ప్రణాళికల నుంచి నిర్మాణ నాణ్యత వరకూ అడుగడుగునా ఎక్కడా రాజీ పడకుండా కట్టిన ప్రాజెక్టుపై బురదజల్లడం మాని, ఇకనైనా ఎల్ అండ్ టీ- అభ్యంతరాలకు ప్రభుత్వం, ఎన్డీఎస్ఏ సమాధానం చెప్పాలి. ఎన్డీఎస్ఏ వాదనలన్నీ తప్పుల తడక అని తేలిపోయిన నేపథ్యంలో దీన్ని కుంటిసాకుగా చూపి దాటవేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇకనైనా పోలవరం తరహాలో పునరుద్ధరణ చర్యలు చేపట్టి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలి. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ముఖ్యమంత్రితో పాటు- కాంగ్రెస్-బీజేపీల కుట్ర రాజకీయాలకు తెలంగాణ రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం' అని ఎక్స్‌లో కేటీఆర్ రాసుకొచ్చారు.

## లక్ష్మీనరసింహుడి దయతోనే ఇంతగా ఎదిగా

### ఆలయ పునఃప్రతిష్టలో పాల్గొన్న భట్టి

**ఖమ్మం,మే28(సమయజ్యోతి):** ఖమ్మంజిల్లా ముదిగొండ మండలం యడవల్లి గ్రామంలో శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పున:ప్రతిష్ట మహోత్సవం అభివృద్ధి పనులకు డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క భూమి పూజ నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనులకు రూ. 4 కోట్ల 74 లక్షల 50 వేల రూపాయలను కేటాయించారు. పున:ప్రతిష్ట కార్యక్రమం అనంతరం డిప్యూటీ- సీఎం భట్టి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఆరాధ్యదైవంగా ఉందన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో ప్రచారం ఇక్కడ నుంచే మొదలు పెడతా అని, స్వామి వారి ఆశీస్సులతోనే తాను ఈస్థాయిలో ఉన్నానని చెప్పారు. దశాబ్దాలుగా లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఆరాధ్యదైవంగా ఉంది. ప్రతి ఎన్నికల సమయంలో ప్రచారం ఇక్కడ నుంచే మొదలు పెడతా. రూ. 4 కోట్ల 74 లక్షల రూపాయలు దేవాలయ అభివృద్ధి కి కేటాయించాము. మీరందరూ గెలిపిస్తేనే నేను ఉప ముఖ్యమంత్రిని అయ్యాను. రాష్ట్ర ప్రజలందరూ చల్లగా ఉండాలని ప్రజా ప్రభుత్వం మంచి పాలన అందిస్తుంది. సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ పోతుంది. రాష్ట్రంలో ఉన్న మహిళలకు వడ్డీ లేని రుణం కింద 20 వేల కోట్ల రూపాయలు ఇస్తుంది. 22 వేల కోట్ల రూపాయలు రెండు లక్షల లోపు రైతులకు రుణమాఫీ చేశాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేని వారికి రూ.12 వేలు ఇస్తున్నాం' అని డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రతి ఎన్నికల కార్యక్రమం ఇక్కడి నుంచే మొదలు పెట్టా. శ్రీయోగనంద లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులతో నేను ఈస్థాలో ఉన్నా. లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలకు ఉండాలి. ప్రజా సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుంది. పేద ప్రజలకు గ్యాస్, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ లాంటి పథకాలు ఈ ప్రభుత్వం అందజేస్తుంది. రైతు భరోసా, రుణమాఫీ, ఆత్మీయ భరోసా పథకాలను ప్రభుత్వం అందజేస్తుంది. పేద ప్రజలకు ఇందిరా గిరి ఆవాస్ యోజన పథకం కూడా ఉంది' అని డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

## టిడిపి జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు

**కడప,మే28(సమయజ్యోతి):** తెదేపా జాతీయ అధ్యక్షుడిగా మరోసారి చంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మహానాడు వేదికగా పార్టీ ఎన్నికల కమిటీ ఛైర్మన్ వర్ల రామయ్య ప్రకటించారు. అనంతరం ఆయన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీనేతలు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. 1995లో మొదటి సారిగా చంద్రబాబు పార్టీ పగ్గాలు చేపట్టారు. గత 30 ఏళ్లుగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెదేపాలో ప్రతి రెండేళ్ల కోసారి అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుంది. టీ-డీపీ నాయకులంతా ఆయన్ను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. 1995లో చంద్రబాబు తొలిసారి తెలుగుదేశం పార్టీ పగ్గాలు చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికవుతున్నారు. మహానాడు రెండవ రోజున పార్టీ అధ్యక్ష పదవికి సంబంధించి చంద్రబాబు నామినేషన్లను పలువురు నేతలు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలకు పార్టీ నేతలంతా మద్ధతు తెలిపారు. దీంతో చంద్రబాబు నాయుడు టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. చంద్రబాబును జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల కమిటీ ఛైర్మన్ వర్ల రామయ్య మహానాడు వేదికపై ప్రకటించారు. చంద్రబాబు పార్టీ పగ్గాలు చేపట్టాక.. కడపతో కలుపుకుని ఇప్పటి వరకు 25 మహానాడులు నిర్వహించారు. కరోనా నేపథ్యంలో రెండేళ్లు జూమ్ ద్వారా మహానాడు నిర్వహించారు. చంద్రబాబును 12వ సారి టీడీపీ అధినేతగా మహానాడు ఎన్నుకుంది. అనంతరం జాతీయ పార్టీ అధ్యక్షుడిగా చంద్రబాబుతో వర్ల రామయ్య ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. దేవుడు ఇచ్చిన శక్తితో పార్టీని సమర్థంగా నడిపించేందుకు కృషి చేస్తానని అన్నారు. మరోసారి జాతీయ అధ్యక్షుడిగా ఎన్ని-కై-న అనంతరం మహానాడులో పార్టీ శ్రేణులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. నా ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. తెలుగు జాతి ఉన్నంత వరకు తెదేపా ఉంటుంది. నా బలం, బలగం తెదేపా. నాపై కార్యకర్తలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. మహానాడులో ఆరు శాసనాలపై అర్థవంతంగా చర్చలు జరిగాయి. రాబోయే 40 ఏళ్లకు ప్రణాళిక రచించుకున్నాం. నక్సలిజం రూపుమాప డానికి నిరంతరం పోరాడిన పార్టీ తెదేపా. రాయలసీమలో ఫ్యాక్షనిజం తుదముట్టించి అభివృద్ధికి బాటలు పరిచాం. రాయలసీమ రాళ్ల సీమ కాదు..రత్నాల సీమగా మారుస్తానని చెప్పాం. కోనసీమ కంటే సంపదలో అనంతపురం ముందుండడానికి తెదేపా కారణం. హైదరాబాద్‌లో మత ఘర్షణలను పూర్తిగా కట్టడి చేశాం. తెదేపా అధికారంలో ఉంటే అందరికీ రక్షణ ఉంటుంది. 2027 నాటికి పోలవరం పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. హంద్రీనీవా కింద చివరి భూములకు నీళ్ల కోసం రూ.3,800 కోట్లు- ఖర్చు చేశాం. పోలవరం తర్వాత హంద్రీనీవాకు భారీగా ఖర్చు చేస్తున్నాం. వెలిగొండతో పాటు- మిగతా ప్రాజెక్టులను పూర్తి చేస్తాం అని చంద్రబాబు అన్నారు.

## కెసిఆర్‌తో మరోమారు హరీష్ రావు భేటీ

### కాళేశ్వరంపై లోతుగా చర్చించిన నేతలు

**గజ్వేల్,మే28(సమయజ్యోతి):** కాళేశ్వరం కమిషన్ నోటీసులు అందిన నేపథ్యంలో ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు మూడున్నర గంటలగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న కమిషన్ ఇచ్చిన నివేదిక, అందించిన నోటీసులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల 5న కమిషన్ ముందు విచారణకు హాజరు కానున్నట్లు ఇప్పటికే నిర్ణయం తీసుకున్న కేసీఆర్, ముందు జాగ్రత్తగా కమిషన్ వద్ద ఉత్పన్నమయ్యే ప్రశ్నలు, వాటికి ఇవ్వాల్సిన సమాధానాలపై హరీష్‌రావుతో సమాలోచనలు జరిపినట్లు- సమాచారం.విజిలెన్స్ నివేదికలో పేర్కొన్న అంశాలు, ఎక్కడా లోపాలు జరిగాయన్న విషయాలపై పూర్తిగా ఆరా తీసినట్లు-, ఇది కాకుండా, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఏం సూచించింది? బ్యారేజీ కుంగడపై సాంకేతిక కారణాలు ఏమిటన్న దానిపై పూర్తి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కమిషన్ ఎదుట హాజరైన కొంతమంది రిటైర్డ్ ఇంజనీర్లతో కేసీఆర్ ఫోన్ ద్వారా మాట్లాడినట్లు-, కమిషన్ అడిగిన ప్రశ్నలు ఏమిటి? ఇంజనీర్లు ఇచ్చిన సమాధానాలు ఎలా ఉన్నాయన్న విషయాలపై కూడా ఆయన చర్చించినట్లు సమాచారం. మొత్తంగా సమాధానాలు సిద్ధం చేసుకుని కమిషన్ ముందుకు హాజరయ్యేలా కెసిఆర్ సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

# విత్తనాల నాణ్యత పై టాస్క్ ఫోర్స్ ఆకస్మిక తనిఖీలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పలు విత్తన దుకాణాలలో టాస్కోర్స్ అధికారులు విత్తనాల నాణ్యత పై, కల్తీ విత్తనాల నివారణకై ఆకస్మిక తనిఖీలు జరిపారు. వ్యవసాయ శాఖ, సీడ్స్ సర్టిఫికేషన్, పోలీస్ శాఖ సంయుక్తంగా తనిఖీలు చేసి స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులు, విత్తన ప్యాకెట్లు లాట్ నంబర్స్, సర్టిఫికేషన్ వాలిడిటి వివరాలను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశంతో ఈ తనిఖీలను చేపట్టినట్లుగా ఏడిఏ ఎంఎ హలీం హైమద్, ఏఓ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. లాభాపేక్షతో కల్తీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక చేశారు. రైతులు లైసెన్సు పొందిన అధికృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని డీలర్లు రైతులకు విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా బిల్లు రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. రైతులు విత్తన రసీదు బిల్లులు పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చు కోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ నాగేష్, ఏఎస్ఐ లయాక్ అలీ, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్, ఏఈఓ చక్రపాణి పాల్గొన్నారు.



# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో మే 28.**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సారంగాపూర్, జామ్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పి.ఎస్.సి.ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ధాన్యం తూకం, లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ%మిగిలి ఉన్న వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న హమాలీలతో పాటు ప్రతి కేంద్రంలో మరో 20 మంది అదనపు కూలీలను సమకూర్చి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. వరి ధాన్యం కొనుగోలు పై ఎటువంటి అపోహలకు లోనుకావద్దని, రైతులందరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు.అనంతరం జామ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ధాన్యపు తేమ శాతం, తూకం ప్రక్రియలను పరిశీలించారు. మిల్లర్లు ధాన్యంలో కోత విధిస్తున్నారని రైతుల నుంచి ఫిర్యాదు రావడంతో, కలెక్టర్ మిల్లర్‌తో మాట్లాడి అటువంటి చర్యలు తగవని స్పష్టంచేశారు. ధాన్యంలో ఎటువంటి కోతలూ లేకుండా, తూకం వేసి, తక్షణమే మిల్లులకు తరలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్, జిల్లా మేనేజర్ సుధాకర్, తహసిల్దార్ శ్రీదేవి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రైతు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి పిప్పిరి క్లస్టర్ ఎ ఈ ఓ చౌహాన్ కృష్ణాపాల్ సింగ్

## - ప్రతి రైతుకు రైతు గుర్తింపు కార్డు తప్పనిసరి

**సమయజ్యోతి న్యూస్ మే 28 బజార్ హత్నూర్**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ పథకంలో భాగంగా అగ్రి స్టాక్ పేరుతో దేశవ్యాప్తంగా ఉన్న రైతులందరికీ రైతు గుర్తింపు కార్డులను ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టిందని పిప్పిరి వ్యవసాయ విస్తరణ అధికారి చౌహాన్ క్రిష్ణపాల్ సింగ్ తెలిపారు.బుధ వారం రైతు వేదికలో గిర్నూర్,కాండ్లి, కనకదుర్గ,మోహద,పిప్రి, వర్తమన్నూర్ గ్రామ రైతులతో సమావేశమై రైతు గుర్తింపు కార్డుల జారీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ రెవెన్యూ పట్టా పాస్ బుక్కులు ఉన్న రైతులందరూ తప్పనిసరిగా రైతుగుర్తింపు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలి అని తెలిపారు. దీనికొరకు ఆధార్ నంబర్ కు మొబైల్ నంబరు లింకు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. దేశవ్యాప్తంగా రైతులందరి వివరాలను డిజిటలైజేషన్ చేసే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం వల్ల భవిష్యత్తులో రైతులకు కేంద్రప్రభుత్వ పథకాలు అందించడం సులువుగా మారనుందని ఏఈఓ తెలిపారు. ఈ కార్డులో రైతుకు సంబంధించిన భూమి వివరాలు, నేల రకం, సాగు చేస్తున్న పంటల వివరాలు, ఆధార్ కార్డు లింక్, బ్యాంక్ అకౌంట్ లింక్ చేయడం ద్వారా ఈ ఒకే ఒక్క కార్డులోరైతుకు సంబంధించిన పూర్తి వివరాలు నిక్షిప్తం కానున్నాయి. పీఎం కిసాన్, సాయిల్ హెల్త్ కార్డు, సిసిఐ మరియు యఫ్.సి.ఐ వంటి ఎంఎస్పి కేంద్రాలలో ధాన్యం అమ్ముకోవడం మొదలగు కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఈ రైతు గుర్తింపు కార్డు తప్పనిసరి కానుంది. కావున రైతులందరూ తప్పనిసరిగా ఈ రైతు గుర్తింపు కార్డు కొరకు విధిగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



# నూతన నేరన్యాయ చట్టాలపై కనీస అవగాహన ఉండాలి పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**

నూతన నేరన్యాయ చట్టాలపై కనీస అవగాహనా ఉండాలని నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య పేర్కొన్నారు. నిజామాబాద్ శ్రీరామ గార్డెన్స్ లో బుధవారం నూతన నేర న్యాయ చట్టాలపై మీడియా ప్రతినిధులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం జులై 1, 2024 నుండి కొత్తగా ప్రవేశపెట్టిన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, పాత చట్టాలాను సవరించి మూడు కొత్త చట్టాలను రూపొందిచారని, కొత్త చట్టాల ద్వారా వెంటనే ప్రజలకు న్యాయం జరుగుతుందని ఇప్పటి వరకు అమలులో ఉన్న పాత చట్టాలు ఐ.పి.సి, సి.ఆర్.పి.సి చట్టాలు రద్దయ్యాయని వీటి స్థానంలో భారతీయ న్యాయ సంహితభారతీయ నాగరిక్ సురక్ష సంహితభారతీయ సాక్ష్యా అధినియంచట్టాలు అమలులోకి వచ్చాయని, ఈ కొత్త చట్టాలపై అవగాహన కల్పించేందుకు నిజామాబాద్ జర్నలిస్టులతో అవగాహనా కల్పించి, చట్టాల గురించి ప్రజలకు తెలపాలని వివరించారు. ప్రస్తుత యుగంలో నూతన చట్టాలపై జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది, సాధారణ వార్తలకు, క్రైమ్ వార్తలకు చాలా తేడాగా ఉంటుంది అయితే క్రైమ్ వార్తల విషయంలో తప్పనిసరిగా పలు సూచనలు జాగ్రత్తలు పాటించాలి. మైనర్లకు సంబంధించిన కేసులలో వారి పేర్లు కుటుంబ సభ్యుల వివరాలు ఎలాంటివైనా రాయకూడదని సూచించారు. తప్పనిసరిగా సంబంధిత అధికారి వివరణ తీసుకొని వార్తను ప్రచురించాలి. తెలిసి చేసిన తెలియక చేసిన తప్పుకు శిక్ష తప్పనిసరిగా అమలవుతుందన్నారు. సోషల్ మీడియాలో ఏవైనా ఫోటోలు గాని వీడియోలు గాని పోస్టుచేసే ముందు ఎవరిదైతే వీడియో, ఫోటోలు తీసుకుంటున్నామో వారి అనుమతి తప్పని సరిగా ఉండాలన్నారు. ప్రస్తుతం ఎ.ఐ యుగంలో ఉన్నందున ఉన్నది లేనట్టుగా మన ముందు చూపించవచ్చు, కానీ అది కరెక్టా కాదా అనేది ఒకసారి క్రాస్ చెక్ చేసుకున్న తరువాతే ప్రచురిస్తే బాగుంటుంది



అన్నారు. ప్రస్తుత సమాజంలో టెక్నాలజీని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలి కానీ దానిని దుర్వినియోగం చేయకూడదు. ఎవరైన దుర్వినియోగం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడమే కాకుండా జైలులో జీవితం గడపాల్సి ఉంటుందని తెలిపారు.ఈ అవగాహనా కార్యక్రమం పూర్తిగా పవర్ పాయింటు ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మీడియా ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో అదనపు డి.సి.పి (అడ్మిన్) బస్వారెడ్డి నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ట్రాఫిక్ ఎ.సి.పిలు ఎల్.రాజా వెంకట్ రెడ్డి, జె. వెంకటేశ్వర్ రెడ్డి, పి. శ్రీనివాస్, మస్తాన్ అలీ, రూరల్ ఎస్.ఐ ఎమ్.డి ఆరీఫ్ఉద్దీన్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అమ్రాబాద్ కు నీటి ఎద్దడి నివారించకపోతే అమర నిరాహార దీక్ష

**సమయజ్యోతి న్యూస్ అచ్చంపేట**

నీటి ఎద్దడి పై మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేసిన బిజెపి నాయకులు గ్రామ ప్రజలు అమ్రాబాద్ మండల కేంద్రంలో నీటి ఎద్దడి పై బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు మాట్లాడుతూ 8 బోర్లు ఐదు నెలలు ఆరు నెలలు ఏడు నెలలు 8 నెలలు పనిచేయక మిషన్ భగీరథ నీళ్లు వారం రోజుల నుండి రాక గతంలో వచ్చినప్పుడు రెండు మూడు బిందెలే వచ్చేవి కానీ వారం రోజుల నుండి మిషన్ భగీరథ నీళ్లు రాక 8 బోర్లు పనిచేయక ప్రజలు స్థానాలకు బట్టలు ఉతకడానికి కాలకృత్యాలు తీర్చుకోవడానికి నీళ్లు లేక నానా ఇబ్బంది పడుతున్నారు కానీ అమ్రాబాద్ గ్రామ కార్యదర్శి గారు మిషన్ భగీరథ సంబంధించిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి ప్రజలను తీవ్ర ఇబ్బందికి గురి చేస్తున్నారు మన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గారు వెంటనే స్పందించి మిషన్ భగీరథ సంబంధించిన అధికారులపై ఈ బోర్ మోటర్లు రిపేర్ చేయించకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్న అధికారులపై విచారణకు ఆదేశించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథ నీళ్లు ప్రతిరోజు వచ్చే విధంగా కనీసము 20 బిందెల నీళ్లు వచ్చే విధంగా 8 బోరు మోటార్లను రిపేర్ చేసి ప్రజలకు మంచినీళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో అమ్రాబాద్ లో నీటి కోసం



అమర నిరాహార దీక్ష చేయడానికి ప్రజలతో పాటు బిజెపి నాయకులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్ మాధగోని సతీష్ కుమార్ భోగరాజు శంకర్ ఎర్ర గిన్నెల వెంకటేష్ చారి ఎలిజాల అభిరామ్ ప్రజలు ఎలిజాల లక్ష్మయ్య మురుపోజు సత్యనారాయణ చారి కాసోజు విష్ణు చారి మురుపోజు పండరి మురుపోజు కృష్ణయ్య చారి కాసోజు చక్రపాణి జల్ల శివ గౌడ్ మొగిలి గణేష్ చరణ్ వినయ్ మహిళలు పాల్గొనడం జరిగింది.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో బుధవారం మండల అభివృద్ధి అధికారి విజయ భాస్కర్ రెడ్డి ఇందిరమ్మ గృహ నిర్మాణానికి భూమి పూజ చేశారు, ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో మంజూరైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి త్వరగా పనులు ప్రారంభించుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ రమణ, జూనియర్ అసిస్టెంట్ నిషాంత్ రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# జనహృదయలలో చిరస్మరణీయుడు ఎన్టీఆర్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.**

ఆత్మకూరు పట్టణంలో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 102 వ జయంతి వేడుకలను ఆయన అభిమానులు ఆత్మకూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించి అనంతరం మిఠాయిలు పంచి పెట్టి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్, తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ సీనియర్ న్యాయవాది డి. అశోక్ రావు, ఆత్మకూరు మాజీ సర్పంచ్ కట్టెల మండి రాములు,బాలకృష్ణ ఫ్యాన్స్ ఎస్టీ డి శ్రీనివాసులు, తిరుపతయ్య గౌడ్, లక్ష్మన్న గౌడ్, జూరాల రవి, పిన్నంచర్ల జగన్, కోట్ల వెంకటేష్, కట్టెల మండి రాజు తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఫర్టిలైజర్ షాప్ లను తనిఖీ చేసిన ఎస్సై బి. సురేష్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై బి సురేష్ వ్యవసాయ అధికారి అరవింద్ అన్నారు. ఈ సందర్భంగా పోలీస్, వ్యవసాయ శాఖ జాయింట్ గా స్వస్తిక్ ట్రేడర్స్, శ్రీనివాస ట్రేడర్స్ రెండు షాపులను తనిఖీ చేపట్టారు. షాపులోని విత్తనాలు రిజిస్టర్ లను పరిశీలించారు. ఫర్టిలైజర్ షాపుల్లో విత్తనాలు నిలువ, ధరల పట్టిక బోర్డు లో నమోదు చేయాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలని అన్నారు. వీరి వెంట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రామ దేవతల పునర్నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళంగా అందించిన

## - ఎం.డి. రహమతుల్లా

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూర్ వనపర్తి జిల్లా.**

ఆత్మకూరు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎం.డి. రహమతుల్లా ఆత్మకూరు పట్టణంలోని గ్రామదేవతల పునర్నిర్మాణ కొరకై తన వంతుగా లక్ష రూపాయలు విరాళంగా అందించి పెద్ద మనసును చాటుకున్నారు.



సమయజ్యోతి
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తించాలి !

వ్యవసాయ రంగంలో కీలక మార్పులు వస్తున్నాయి. రైతులు కూడా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పుల ను గమనిస్తున్నారు. కొత్త తరహా సేద్యానికి అలవాటు పడుతున్నారు. కేవలం వరిపైనే ఆధారపడకుండా కూరగాయలు, పళ్లతోటల పెంపకం,పాడిపశువుల పెంపకంపైనా శ్రద్ధ పెడుతున్నారు. ఈ క్రమంలో రైతులకు మరింత ఆసరా దక్కాలి. బ్యాంకులు కొర్రీలు లేకుండా రుణాలు ఇవ్వాలి. పంటలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు మారాలి. వారికి వ్యవసాయశాఖ పరంగా అన్ని సూచనలు, సలహాలు అందాలి. అన్నింటికిమించి బీమా సౌకర్యం అందించాలి. ఇలా చిన్నిచిన్న సాయాలుచేస్తే రైతాంగం మరింతగా కష్టపడి దేశ పురోభివృద్దిలో భాగస్వామ్యం కాగలదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ధాన్యం దిగుబడులు భారీగా పెరిగాయి. ఈ రెండు రాష్ట్రాల్లో ముందునుంచి పంటల దిగుబడి పెరుగుతూ వస్తోంది. రైతులు చెమటోడ్చి పంటలు పండిస్తున్నా ఆర్థికంగా మాత్రం ఎదగడం లేదు. పంటలు బాగా పండాయనడానికి ధాన్యం రాశులే దీనికి నిదర్శనం. ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తున్న దృశ్యాలు చూస్తుంటే ఎంతగా ధాన్యం దిగుబడి అయ్యిందో గమనించాలి. ఓ వైపు జోరుగా కొనుగోళ్లు జరుగుతున్నా మరోవైపు తమ ధాన్యం కొనడం లేదని రైతులు ఆందోళనలకు దిగితున్నారు. ఉచిత విద్యుత్‌కు తోడుగా, అందుబాటులో నీరు ఉండడంతో జిల్లాల్లో ధాన్యం దిగుబడులు పెరిగాయి. తెలంగాణ కూడా ఇప్పుడు వ్యవసాయికంగా బాగా పురోగమించిందనే చెప్పాలి. మరోవైపు ధాన్యం దిగుబడిలో ఇప్పటికే అగ్రస్థానం లో నిలిచిందని సిఎం రేవంత్ అన్నారు. కాళేశ్వరం నీళ్లు లేకున్నా పంటల దిగుబడి పెరిగిందని మంత్రులు అంటున్నారు. వరిదిగుబడి, ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిం దని భారత ఆహార సంస్థ గతంలో చేసిన ప్రకటన తెలంగాణ వ్యవసాయరంగం పురోగమిస్తోందనడానికి సంకేతం. వ్యవసాయ రంగంలో విప్లవం సాధించిన ఘనత ఎలా ఉన్నా, ధాన్యాగారంగా మారడానికి అన్నదాతల కష్టాలను అభినందించాల్సిందే. దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణ మాదిరిగా ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. గ్రామాల్లోనే కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొనడం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఈ దశలో వ్యవసాయంలో మరో విప్లవాత్మక మార్పునకు తెలంగాణ సర్కారు దృఢ నిశ్చయంతో ఉన్నది. కృష్ణా, గోదావరి, మూసీ నదీ జలాలు పుష్కలంగా లభిస్తున్న తరుణంలో పంట మార్పిడి దిశగా నియంత్రిత సాగు విధానాన్ని అమలు చేయాలని భావిస్తున్నది. గిరాకీ ఉన్న పంటల్నే పండించడం, డిమాండ్ ఉన్నప్పుడే పంటను మార్కెట్‌కు తేవడం.. నియంత్రిత వ్యవసాయం లక్ష్యం. వ్యవసాయానికి పెట్టుబడి సాయం మొదలు విత్తనాల్లో సబ్సిడీ, ఎరువుల్లో రాయితీ సమకూర్చుతున్న ప్రభుత్వం... రైతులు మూస విధానం వీడి మంచి ఆదాయం పొందేలా మేధోమధనం జరిపింది. ఈ మేరకు జిల్లా నేలలకు అనువైన పంటలు వేసి లాభాలు గడించేలా ప్రణాళిక రూపొందిం చింది. ఒకే రకమైన పంటలసాగుతో ధరలు తగ్గి రైతులు నష్ట పోతున్న నేపథ్యంలో డిమాండ్ ఉన్న పంటలకు రైతులు కూడా మొగ్గుచూపు తున్నారు. ఇక అవసరమున్న పంటలను పండించాలన్న లక్ష్యంతో వ్యవసాయ రంగం బహుముఖంగా అభివృద్ది చెందనుంది. కరోనా కాలం కష్ట సమయంలో ధాన్యాగారంగా,యావద్దేశానికే అన్నపూర్ణగా తెలంగాణ అవతరించింది. ఈ విజయం వ్యవసాయరంగ పురోభివృద్దిలో సాధించిన మైలురాయిగా చూడాలి. అయితే ఉభయ రాష్ట్రాల్లో కరువులు, వలసలతో కొండంత కష్టాలతో కుమిలి పోయిన అన్నదాతల జీవితాలు మాత్రం గట్టెక్కడం లేదు. రైతుభరోసా పెట్టుబడి సాయంతో పాటు 24 గంటల పాటు నాణ్యమైన కరెంటు సరఫరా అవుతున్నా అనేక కష్టాలను ఈదాల్సి వస్తోంది. అన్నింటికి మించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కక పోవడం, సకాలంలో కొనుగోళ్లు చేయకపోవడం వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదు. యాసంగి దిగుబడిలో మునుపెన్నడూ ఎరుగని రీతిలో వరి దిగుబడి సాధించి రైతులు రికార్డు సృష్టించారు. ఆ తరువాత పండించిన ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనడంతో అన్నదాతలకు భరోసా దక్కింది. తెలంగాణ ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన యాసంగి ధాన్యం విలువ పదివేల కోట్ల రూపాయల పై మాటే అని తెలుస్తోంది. యాసంగిలో పండిన వరిధాన్యం సేకరణలో జాతీయస్థాయిలో తెలంగాణది కీలక భాగస్వామ్యమని ఎఫ్‌సిఐ పేర్కొన్నది. ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను అభినందించారు. రుతుపవనాలు ముందుగా రావడంతో మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారింది.. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ. 12184 కోట్లు చెల్లించినట్లు ప్రకటించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని తెలిపారు. కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయి.. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలు వల్లనే అని దుష్ప్రచారం చేస్తున్నారని సిఎం రేవంత్ అన్నారు.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలి.. కలెక్టర్లు ప్రో యాక్టివ్‌గా ఉండాలి.. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి.. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి.. చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండని కూడా సూచించారు. ఒక్క నిముషం వృధా చేయొద్దు.. నిర్లక్ష్యం వహించొద్దు.. అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయండి.. మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉంది.. సీజన్ ముందు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.. పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.. అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టాలి. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి..

# ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా 709 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ఉత్తర్వు ప్రతుల పంపిణీ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు 30 రోజుల్లోగా తప్పనిసరిగా ప్రారంభించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లబ్దిదారులకు సూచించారు. బుధవారం ఆయన, బోయిన్ పల్లి మండలం అనంతపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్ లో రెండో విడత క్రింద 709 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతపల్లి గ్రామంలో పైలెట్ గ్రామంగా ఎంపిక చేసుకొని మొదటి విడత క్రింద 109 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయగా నేడు 50 శాతం వరకు పూర్తయ్యాయని, ప్రభుత్వం వారికి చెల్లింపులు కూడా చేస్తుందని అన్నారు. రెండో విడత కింద మండల వ్యాప్తంగా 709 లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి, నేడు ఇందిరమ్మ ఇండ్ల ఉత్తర్వు ప్రతుల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 40 వేల మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, నిరు పేదలకు ముందుగా మంజూరు చేయాలని ప్రభుత్వం సూచనల మేరకు లబ్ధిదారుల ఎంపిక చేశామని, 3 నెలల వ్యవధిలో ఇండ్ల నిర్మాణం పనులు పూర్తి చేసుకొని, రానున్న పండుగలు నూతన గృహాల్లో జరుపుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షలు ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత 1లక్ష, గోడలు నిర్మిస్తే 1లక్ష, స్లాబ్ తర్వాత 2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారి నుంచి పైరవి వంటి చేయాల్సిన అవసరం లేదని, ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఎవరికి ఒక రూపాయి ఇవ్వడానికి వీలు లేదని అన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని, నిర్మాణానికి అవసరమైన ఇసుక మండల కేంద్రాలలో అందుబాటులో పెడతామని తెలిపారు. లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని అన్నారు. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తామని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ లబ్ధిదారులు నాణ్యమైన ఇంటిని నిర్మించుకోవాలని, సొంత స్థలంలో మంచి ఇండ్లు నిర్మించుకొని ప్రజల సంతోషంగా ఉండాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. పేదలకు ఇచ్చిన మాట ప్రకారం సొంత స్థలం ఉన్న నిరు పేదలను గుర్తించి బోయిన్ పల్లి మండలంలో 709 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రజల హృదయాల్లో స్పష్టమైన ముద్ర వేసుకునేలా సిరిసిల్ల కలెక్టర్ పని తీరు ఉందని ఎమ్మెల్యే ప్రశంసించారు. మండలంలో ఇటీవల పేద మహిళ ఇళ్ళు కాలిపోతే సాయంత్రం వరకు 50 వేల రూపాయల ప్రభుత్వ సహాయంగా చెక్కు మంజూరు చేశారని, నీరోజపల్లి గ్రామంలో కూడా విద్యుత్ షాక్ తో మరణిస్తే ఆ కుటుంబానికి కూడా కలెక్టర్ సహకరించారని, మానవీయ కోణంతో పని చేస్తున్న కలెక్టర్ కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. మిడ్ మానేరు బాధితులకు న్యాయం చేయడం కోసం త్వరలో అదనంగా మరో 1000 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామని ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. బోయినపల్లి మండలంలో 4153 రైతులకు 36 కోట్ల 63 లక్షల రుణ మాఫీ పూర్తి చేశామని, గతంలో కేవలం 13 కోట్ల మాత్రమే జరిగాయని ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని అన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సరఫరా, రాజీవ్ యువ వికాసం క్రింద స్వయం ఉపాధి యూనిట్ల, ఇందిరా మహిళా శక్తి క్రింద మహిళలకు వడ్డీ లేని రుణాలు, 22 వేల కోట్లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, 12 వేల 600 కోట్లతో 2 లక్షల 10 వేల ఆర్వోఎఫ్ఆర్ పట్టా భూముల అభివృద్ధి చర్యలు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, పిఏసి చైర్ పర్సన్ వెంకట రామారావు, సెజ్ సంచాలకులు సుధాకర్, పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి వినోద్, ఎంపీడీవో జయశీల సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు సురేందర్ రెడ్డి, రమణారెడ్డి సుధాకర్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



# సీఎం బోథ్ గురుకుల పాఠశాలకు ప్రశంసా పత్రం తోపాటు ఐదు లక్షల అభివృద్ధి ఫండు చెక్కు ప్రధానం

**సమయజ్యోతి న్యూస్ మే 28 బజార్ హత్నూర్ బోథ్**

బోథ్ మండల కేంద్రము లోని గురుకుల పాఠశాల పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు 100% ఫలితాలు సాధించినందుకు బుధవారం హైదరాబాదులోని జగ్జీవన్ రామ్ భవన్లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా బెస్ట్ సర్టిఫికెట్, స్కూల్ డెవలప్మెంట్ కింద ఐదు లక్షల రూపాయలు చెక్కును తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల బాలికల బోథ్ ప్రిన్సిపాల్ జి.సంగీత అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పోషకులు ప్రిన్సిపల్ మేడంకు అభినందనలు తెలిపారు.



# బ్రిడ్జ్ కూల్చివేతపై విచారణ జరపాలి - మాజీమంత్రి జోగు రామన్న

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

తర్ణం బ్రిడ్జి కూల్చివేత పై విచారణ జరపాలని,లాండ్డే దత్తు మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని మాజీ మంత్రి జోగు రామన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను కలిసి వినతి పత్రం అందజేశారు.జిల్లాలో కురుస్తున్న వర్షాలతో తర్ణం బ్రిడ్జ్ వద్ద వాగు పొంగిపొర్లుతున్న సదరు కాంట్రాక్టు సిబ్బందితో పాటు ప్రభుత్వ యంత్రాంగం బ్రిడ్జి వద్ద ఎలాంటి హెచ్చరికలు జారీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి,లాండే దత్తు మృతికి కారకులయ్యారని జోగు రామన్న అన్నారు.ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని 25 లక్షల ఆర్థిక సాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు.ఇదివరకు కాలినడక ప్రయాణంతో ద్విచక్ర వాహనాలు నడిచేందుకు వీలుగా ఉన్న బ్రిడ్జును కాంట్రాక్టర్ కూల్చి వేయడం సమంజసం కాదని తెలిపారు.బ్రిడ్జ్ కూల్ కూల్చివేతపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జోగు రామన్న కోరారు.జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి బాధ్యులపై చర్యలు చేపడతామన్నారు.కలిసిన వారిలో యూనిస్ అక్బాని,ఇజ్జగిరి నారాయణ,మార్శెట్టి గోవర్ధన్,సాజిదొద్దీన్,బట్టు సతీష్ పాల్గొన్నారు.



# రాజీవ్ యువ వికాసం ద్వారా లాభసాటి వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేయాలి

## కలెక్టర్లతో వీసీ ద్వారా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజీవ్ యువ వికాసం పథకం క్రింద లాభసాటి వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేసి పక్కాగా గ్రౌండింగ్ జరిగేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం రాజీవ్ యువ వికాసం అమలు పై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు హైదరాబాద్ లోని సచివాలయం నుంచి అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ పాల్గొన్నారు. రాజీవ్ యవ వికాసం పథకం అమలుకు సంబంధించి చేపట్టిన చర్యలను అధికారులు వివరించారు.

డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు కార్పొరేషన్ ద్వారా మొక్కుబడిగా పథకాలు అమలు చేశాయని, తమ ప్రభుత్వం లక్షలాది మంది యువతకు స్వయం ఉపాధి కల్పించాలని చిత్తశుద్ధితో రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేస్తుందని అన్నారు. యువ వికాసం పథకం క్రింద వచ్చే సహాయంతో యువత వ్యాపారం చేసి లబ్ది పొందాలని, 8 వేల కోట్లతో దాదాపు 5 లక్షల మంది యువతను వ్యాపార వేత్తలుగా మారుస్తున్నామని, ప్రభుత్వం పెట్టే ప్రతి పైసా పెట్టుబడి ఎలా పనిచేస్తుందో రెగ్యులర్ గా మానిటరింగ్ చేయాలని, రాష్ట్ర జీడిపి వృద్ధిలో ఈ పథకం భాగస్వామ్యం కావాలని అన్నారు. ప్రభుత్వము మంజూరు చేసిన యూనిట్ల గ్రౌండింగ్ చేసిన తర్వాత వాటి పని తీరు పర్యవేక్షించేందుకు జిల్లాలో కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు. మే 29, 30 తేదీలలో జరిగే ఇంచార్జి మంత్రి వర్యుల సమావేశాలలో రాజీవ్ యువ వికాసం పై చర్చించి తుది జాబితా ఆమోదం చేయాలని అన్నారు. జూన్ 2 నాడు రాష్ట్ర అవతరణ దినోత్సవ నాడు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, అందులో యువ వికాసం లబ్దిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు.

బిసీ రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, లబ్దిదారుల ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని ప్రస్తుతం ఎంపిక చేసే లబ్దిదారులకు అవసరమైన శిక్షణ సంపూర్ణంగా అందించిన తర్వాత యూనిట్ గ్రౌండింగ్ పై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రభుత్వం చేసే ఖర్చు పూర్తి స్థాయిలో సద్వినియోగం కావాలని, ఒకే రకమైన యూనిట్లు గ్రౌండ్ కాకుండా చూడాలని అన్నారు. వాహనాలు, ట్రాలీలు, కిరాణా షాపు వంటి యూనిట్ల తక్కువగా గ్రౌండ్ చేయాలని అన్నారు.

ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు మాట్లాడుతూ.. 6250 కోట్ల సబ్సిడీ, 1667 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు మొత్తం దాదాపు 8 వేల కోట్లతో 5 లక్షల మంది యువతకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ప్రభుత్వ అందించే సహాయంతో యువత స్వయం ఉపాధి పోందాలని, రాజీవ్ వివో వికాసం ద్వారా ఆర్థిక ప్రగతి జరగాలని, యువతకు ఉపాధి అవకాశాలు జరగాలని ఆర్థిక జిల్లా కలెక్టర్లు యూనిట్ గ్రౌండింగ్ చేయాలని సీఎస్ సూచించారు. ఒకే రకమైన యూనిట్ల మంజూరు కాకుండా జాగ్రత్తలు వహించాలని, మనం మంజూరు చేసే యూనిట్ క్షేత్రస్థాయిలో వయబుల్ కావాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ శేషాద్రి, బిసి వెల్ఫేర్ అధికారి రాజా మనోహర్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి భారతి, ఈడి ఎస్సి కార్పొరేషన్ స్వప్న, ఎల్.డి.ఎం. మల్లికార్జున్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# దొరికిన పర్సు అందజేసి నిజాయితీ చాటుకున్న యువకుడు

**సమయజ్యోతి న్యూస్ మే 28 బజార్ హత్నూర్ బోథ్**

బోథ్ మండల కేంద్రం కి చెందిన వేముల శ్రీనివాస్ బోథ్ లో బీడీల కంపెనీ నిర్వహిస్తున్నాడు నిన్న రాత్రి బస్టాండ్ ప్రాంతం లో పర్సు పడి పోయింది అందులో 9000 నగదు మరియు వివువైన పేపర్ లు ఉండే అయితే ఈ పర్సు బోథ్ లోని ఒక షాప్ లో పనిచేస్తున్న సుల్తాన్ అనే అబ్బాయి కి దొరికింది ఈ విషయం మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్ కి తెలియజేయగా అందులో ఉన్న పేపర్ లు బట్టి స్థానికుడు శ్రీనివాస్ ది అని తెలియగానే బుధ వారం నాడు బోథ్ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ చేతుల మీదుగా దొరికన పర్సు అందజేశారు ఇలా దొరికిన పర్సు లో ఒక రూపాయి తీసుకోకుండా ఇచ్చిన సుల్తాన్ అనే వ్యక్తి ను పలువురు అభినందించారు ఈ కార్యక్రమం లో వ్యవసాయ సంఘం సొసైటీ చైర్మన్ కదం ప్రశాంత్,మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్,వేముల శ్రీనివాస్,మురారి సంజీవ్,బిక్క లక్ష్మణ్ తదితరులు ఉన్నారు



# భూ భారతి దరఖాస్తులను పరిశీలించిన - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా ఆదిలాబాద్ లో భూ భారతి పైలెట్ ప్రాజెక్టు గా ఎంపికైన భోరజ్ మండలం ను బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా సందర్శించారు.ఈ సందర్భంగా తహాశీల్దార్ కార్యాలయంలో భూ భారతి లో దరఖాస్తుల పై ఆరా తీశారు.ఈ సందర్భంగా వచ్చిన మొత్తం దరఖాస్తులు 1067 దరఖాస్తులను పరిశీలించడం జరిగిందనీ,భూ భారతి వచ్చిన 142 దరఖాస్తులు తిరస్కరించబడినవని,ఇందులో 494 దరఖాస్తులు అమోదించబడినవని, 249 దరఖస్తులకు నోటిసు జారీ చెయ్యడం జరిగిందని తెలిపారు.2018వ సంవత్సరం లో ఎటువంటి రుసుము కట్టకుండా 64 దరఖాస్తులను ఫామ్ ఆఫ్ కల్ట్ క్రింద వేసుకోవడం జరిగినదని చెప్పారు.ఈ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందనీ,సంబంధిత వారికి నోటి ద్వారా తెలియజేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి,ఆర్డీఓ వినోద్ కుమార్,తహసీల్దార్లు రాజేశ్వరి,నలంద ప్రియ తదితరులు పాల్గొన్నారు.



# భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**




భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా అత్యవసర పరిస్థితుల్లో 18004251939 కంట్రోల్ నెంబర్ కు కాల్ చేయాలని బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు.లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భారీ నుండి అతి భారీ వర్షాల కురుస్తున్నందున ఏ విధమైన ఆస్తి నష్టం కలగకుండా అధికారులు హెడ్ క్వార్టర్ లోనే ఉండి పర్యవేక్షించాలని,తెలిపారు.వర్షాల కారణంగా ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని,తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వర్షాల వలన వరదలు,వాగులు ఉప్పొంగిపోతే రోడ్లు,వంతెనలు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు.నాలాలో పేరుకుపోయిన చెత్త,ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు.శిథిలావస్థకు చేరిన పాత ఇళ్లు వర్షాలకు నాని కూలిపోయే అవకాశం ఉన్నందున అక్కడ నివసించే వారిని ఖాళీ చేయించాలని,ఐరన్ విద్యుత్ స్థంభాలు,విద్యుత్ లైన్లు ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల జరిగే ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని,రోడ్లపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను పూడ్చాలని మున్సిపల్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ఆపదమిత్ర శిక్షణ పొందిన వాలంటీర్లను వినియోగించుకోవాలని,సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని,అవసరమైన మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని,అత్యవసర పరిస్థితుల్లో 18004251939 కంట్రోల్ నెంబర్ కు కాల్ చేయాలని ప్రజలను జిల్లా కలెక్టర్ కోరారు.

# ఫలించిన ఎమ్మెల్యే జిఎంఆర్ కృషి - ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**



మినీ ఇండియాగా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కార్పోరేట్ విద్యను అందించాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం 200 కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను పటాన్చెరులో ఏర్పాటు చేయాలని కోరుతూ గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందని తెలిపారు పాఠశాల ఏర్పాటు కోసం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 993 లో 25 ఎకరాలు కేటాయించాలని ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారుఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల ఏర్పాటు కోసం 200 కోట్ల రూపాయలు నిధులు కేటాయిస్తూ జీవో విడుదల చేసిందని తెలిపారుఆధునిక వసతులు అత్యాధునిక ప్రమాణాలతో ఏర్పాటయ్యే రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా పేద మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్య అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు,పాఠశాల ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు

# దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉన్నది కష్టపడి చదివితే రాణిస్తారు

## గురుకులాలకు ప్రోత్సాహకాలు అందజేసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ హైదరాబాద్ బ్యూరో**

జీవితంలో తొలి మెట్టు ఎక్కబోతున్న విద్యార్థినీ విద్యార్థులంతా కష్టపడి చదువుకుని భవిష్యత్తులో మరింతగా రాణించి రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. చదువుకోవడం ద్వారా కుటుంబానికే కాకుండా, సొంత ఊరికి, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్టలు తేవొచ్చని ఉద్బోధించారు. బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ఆధ్వర్యంలోని ఎస్సీ గురుకులాల నుంచి ఐఐటీ, ఎన్ఐటీల్లాంటి ప్రఖ్యాత సంస్థల ప్రవేశాలతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు అవార్డుల బహూకరణ, ఉత్తమ ఫలితాలు సాధించిన గురుకులాలకు ప్రోత్సాహకాలు అందజేస్తూ ముఖ్యమంత్రి మాట్లాడారు. దీనికి ముందుగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో కలిసి, ముఖ్యమంత్రి ప్రాంగణంలో విద్యార్థుల చిత్రకళా గ్యాలరీని ప్రారంభించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ అసమానతలు తొలగించి సమసమాజం నిర్మించాలన్న ఆనాటి పోరాటయోధుల స్ఫూర్తితో ప్రభుత్వం పనిచేస్తోంది. గురుకులాల్లో చదువుకుంటున్న మా పిల్లలు రేపటి రోజున ఉన్నత శిఖరాలను అధిరోహించి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని అకాంక్షిస్తున్నా. తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప రెడ్డి పేరును తెలుగు యూనివర్సిటీకి, మహిళా విద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరును, ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును.. ఇలా ఎందరో త్యాగమూర్తుల స్ఫూర్తితోనే సమసమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం పనిచేస్తోంది. జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తున్నాం. ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారు. ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువు చాలా ముఖ్యం. చదువులో మరో మెట్టు ఎక్కబోతున్న విద్యార్థుల ముందు రకరకాల రంగుల ప్రపంచం ఆకర్షణీయంగా ఉంటుంది. ఊహాగానాల్లో తిరగకుండా జీవితంలో 25 సంవత్సరాలు వచ్చే వరకు కష్టపడి చదువుకుంటే ఈ సమాజంలో గౌరవంగా బతకడానికి, భవిష్యత్తులో రాణించడానికి వీలవుతుంది. దారితప్పితే తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి వస్తుంది. చదువుకుంటే గ్రామం నుంచి రాష్ట్రం వరకు గర్వంగా బతికేలా చేస్తుంది. వందేళ్ల చరిత్రలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తొలిసారి దళితుడిని వీసీగా నియమించాం. ఆ కోవలోనే సార్వత్రిక విశ్వవిద్యాలయానికి, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీకి,



ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్‌గా, విద్యా కమిషన్ చైర్మన్‌గా, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా, రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా గతంలో ఎప్పుడూ లేని విధంగా దళిత బిడ్డలు ఈ పదవులు చేపట్టారంటే వారికి కేవలం కులంతోనే అవకాశాలు రాలేదు. వారు ఉన్నత స్థాయిలో చదువుకుంటే వచ్చాయి. దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు ఆత్మన్యూనతా భావాన్ని వీడాలి. ఆ లక్ష్యంతోనే రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నాం. ఇక్కడున్న గురుకుల పిల్లల్లో ప్రతిభ ఉంది. ఆత్మవిశ్వాసం ఉంది. భవిష్యత్తులో కచ్చితంగా రాణించగలుగుతారన్న నమ్మకం నాకుంది. కుటుంబానికే కాకుండా గ్రామానికి, దేశానికి పేరుప్రతిష్టలు తీసుకొస్తారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉన్నదని సంపూర్ణంగా విశ్వసించే వాడిని. కష్టపడి చదివితే రాణిస్తారు. మీరు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. మీ భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కోరుకుంటున్నా. మీకెప్పుడూ తోడుగా ఉంటా. భవిష్యత్తులో రాణించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మొహమ్మద్ షబ్బీర్ అలీ, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.

# రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు జూన్ 2న మంజూరీ పత్రాలు

- మొదటగా రూ. 50 వేలు, రూ. లక్ష లోపు కేటగిరీల వారికి అందజేత
- కలెక్టర్లతో వీ.సీలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క వెల్లడి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**

యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎంపికైన లబ్దిదారులకు రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2న మంజూరీ పత్రాలు (ప్రొసీడింగ్స్) అందజేయడం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లతో బుధవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకంపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేటగిరీలను కలుపుకుని రాజీవ్ యువ వికాసం పథకానికి 1623764 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపిక చేసిన లబ్దిదారులకు జూన్ 02 వ తేదీ నుండి మంజూరీ పత్రాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. జూన్ మాసంలో రూ. 50 వేలు, రూ. లక్ష లోపు సబ్సిడీ రుణ కేటగిరీలలోని సుమారు 85 వేల మంది లబ్దిదారులకు మొదటగా మంజూరీలు తెలుపడం జరుగుతుందని అన్నారు. అన్ని జిల్లాలలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మంజూరీ ప్రత్రాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు సూచించారు. మంజూరీలు తెలుపబడిన లబ్దిదారులకు జూన్ 10 నుండి 15వ తేదీ వరకు యూనిట్ల స్థాపన, నిర్వహణ, మార్కెటింగ్, తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. జూన్ 16 నుండి 20 వ తేదీ వరకు సబ్సిడీ మొత్తాలను విడుదల చేస్తారని, 21 నుండి 30 వ తేదీ వరకు యూనిట్ల గ్రౌండింగ్ జరిగేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ షెడ్యూల్ ను అనుసరిస్తూ జులై మాసంలో లక్ష నుండి రెండు లక్షల రూపాయల లోపు కేటగిరీకి చెందిన సుమారు లక్ష మంది లబ్ధిదారులకు, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాలలో రెండు లక్షల నుండి 4 లక్షల కేటగిరీకి చెందిన మరో మూడు లక్షల పైచిలుకు మంది లబ్దిదారులకు మంజూరీలు తెలుపడం జరుగుతుందని వివరించారు. ఐదు విడతలలో ఐదు లక్షల మంది లబ్దిదారులకు రాజీవ్ యువ వికాసం పథకం కింద ప్రభుత్వం సబ్సిడీ రూపంలో 6260 కోట్ల రూపాయలను, బ్యాంకు లింకేజీ కింద 1667 కోట్ల రూపాయలను కలుపుకుని సుమారు 8 వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తోందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి లబ్ధిదారుడు తప్పనిసరిగా యూనిట్లను స్థాపించుకుని ఆర్థిక పురోగతి సాధించేలా పక్కా ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. స్థానిక పరిస్థితులు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా లబ్ధిదారులు యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని హితవు పలికారు. మంజూరు చేసిన యూనిట్ల స్థాపన అనంతరం వాటి పనితీరు, నిర్వహణ తీరుతెన్నులను పర్యవేక్షించేందుకు జిల్లాలో మానిటరింగ్ కమిటీ ఏర్పాటు





చేయాలని అన్నారు. మే 29, 30 తేదీలలో జరిగే ఇంచార్జి మంత్రుల సమావేశాలలో రాజీవ్ యువ వికాసం పై చర్చించి తుది జాబితా ఆమోదం చేయాలని అన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, లబ్దిదారులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రస్తుతం ఎంపిక చేసే లబ్దిదారులకు పూర్తి అవగాహన కల్పించిన తర్వాత యూనిట్ గ్రౌండింగ్ పై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రభుత్వం వెచ్చించే నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం కావాలని, ఒక ప్రాంతంలో ఒకే తరహా యూనిట్లు ఎక్కువ సంఖ్యలో స్థాపించినట్లైతే లబ్ధిదారుల మధ్య పోటీ విపరీతంగా నెలకొనే అవకాశం ఉన్నందున వేర్వేరు యూనిట్లు నెలకొల్పేలా చూడాలన్నారు. ఇటుకల తయారీ, సెంట్రింగ్ వంటి వాటికి ముందుకు వచ్చే వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, లీడ్ బ్యాంకు మేనేజర్ అశోక చౌహన్, ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ రమేష్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగూరావు, బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారము 1991-92 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సుమారు మూడున్నర దశాబ్దాల క్రితం పాఠశాల తరగతిగది ముచ్చట్లను వేదికపై పూర్వ విద్యార్థులు పంచుకొని ఆనందోత్సవాన్ని వ్యక్తం చేశారు. గురువుల విద్యా బోధన వల్ల తాము ఎదిగిన స్థితిగతులను గుర్తు తెచ్చుకుంటూ అప్పటి ఉపాధ్యాయులకు అపూర్వరీతిన సన్మానం జరిపారు. కార్యక్రమంలో కూర నగేష్, నారాయణ, ఉప్పలి చంద్రం, కొల్లూరి శంకర్, సత్యనారాయణ, రవి, నరసయ్య, సత్యం గౌడ్, ఎల్లం, మధు, మురళి, సర్వర్ పాల్గొన్నారు.



# జిల్లాలో ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా అదిలాబాద్ లోని ఎన్టీఆర్ చౌక్ లో ఘనంగా నివాళులర్పించిన తెలుగుదేశం పార్టీ అదిలాబాద్ నాయకులు,ఆదిలాబాద్ నియోజకవర్గ కన్వీనర్ అల్లూరు రాజా రెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించి ఎన్టీఆర్ తెలుగు ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పట్టణ పార్టీ అధ్యక్షులు నూనె సతీష్,గంగ సరపు ఓమన్న,గాలిపెల్లి నాగన్న,ఆకుల రాము,సోమా గంగారెడ్డి,తోకల లక్ష్మన్న,జక్కుల సుభాష్,గోక శ్రీనివాస్ రెడ్డి,కదరపు దేవదాస్,తోకల గంగమ్మ,ఓసా ప్రమోద్,పెంటన్న,అంబు భాయ్,ప్రశాంత్,రూపమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ఆంధ్రుల ఆరాధ్య దైవం నందమూరి తారక రామారావు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

ఆంధ్రుల ఆరాధ్య దైవం విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 102 జయంతి వేడుకలను అమరచింత పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మోదీ మనోహర్ రాజు, మాజీ వార్డు మెంబర్ పోసిరిగారి గోపి మాట్లాడుతూ ఏకపక్షంగా పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రత్నియంగా ప్రాంతీయ పార్టీ టిడిపి పార్టీ ని స్వర్గీయ నందమూరి తారక రామారావు మర్చి 29 1982 లో స్థాపించి అనధికాలంలోనే అధికారంలోకి వచ్చి .బడుగు బలహీన వర్గాల ప్రజలకు 2 రూపాయల కిలో బియ్యం, వృద్ధులకు పెన్షన్లు చీరలు పంచలు పంచిపెట్టి పేద ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హైదరాబాదును అభివృద్ధి చేశారని అన్నారు. తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో పూర్వం తీసుకొస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు నసీరుద్దీన్, అమాల సంఘం అధ్యక్షుడు రాము, కార్యదర్శి నాగరాజు, మహారాష్ట్ర శీను, స్వామి,శేఖర్, చిన్నరఘు, పెద్ద రఘు, దాసరపల్లి స్వామి, ఎం.శేఖర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# 60 లక్షల రూపాయలతో అదనపు తరగతి గదులు ఎమ్మెల్యే జిఎంఆర్

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 60 లక్షల రూపాయల నిధులతో నాలుగు అదనపు తరగతి గదులు నిర్మించబోతున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు బుధవారం ముత్తంగి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణలో గల గదులు శిథిలావస్థకు చేరుకోవడం మూలంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు విద్యాశాఖ అధికారులు గతంలో తమ దృష్టికి తీసుకొని వచ్చారని ఆయన తెలిపారు అమెరికాకు చెందిన మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు 60 లక్షల రూపాయలతో తరగతి గదులు నిర్మించేందుకు ముందుకు వచ్చారని ఆయన తెలిపారు రాబోయే కొద్దిరోజుల్లోనే పనులు ప్రారంభించి తరగతి గదులను అందుబాటులోకి తీసుకొని వస్తామని చెప్పారు గదుల నిర్మాణానికి ముందుకు వచ్చిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్ మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నరసింహారావు మేరాజ్ ఖాన్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు



# సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం వేములవాడ రాజన్న ఆలయ ఈవో కె.వినోద్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

జూన్ 15 నుండి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం మూసివేయ బడుతుందని, అన్ని ఆర్జిత సేవలు నిలిపివేయబడతాయని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు లేఖ ప్రచారం అవ్వడం తమ దృష్టికి వచ్చిందని, భక్తులు ఈ అంశంపై అప్రమత్తంగా ఉండాలని, ఆలయ అధికారులు అలాంటి లేఖను జారీ చేయలేదని, వ్యాప్తి చెందుతున్న సమాచారం తప్పుదారి పట్టించేదని ఆలయ ఈవో కె వినోద్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఇటువంటి నకిలీ సమాచార ప్రసారం భక్తులు, సాధారణ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందని, ఈ సమాచారాన్ని వ్యాప్తి చేసిన వారిపై కఠిన చర్యలు గైకొంటామని పేర్కొన్నారు.



# యోగా శిక్షణను వినియోగించుకోవాలి

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ఉచిత యోగా శిక్షణ కేంద్రంలో యోగ అభ్యాసం చేసి ఆరోగ్య పరిరక్షణ చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని హెూమియో వైద్యరాలు శశి ప్రభ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు నిర్వహించే యోగా క్లాసులకు అన్ని వయసుల వారు హాజరవ్వాలని కోరారు.



# వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

వన మహోత్సవం 2025 సీజన్ లో ప్లానింగ్ ఇందిర సౌర గిరి జల వికాసం,పిఎం జన్ మన్,డిఎ జెజియుఎ ల పై బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి,డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ తో కలసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని 2025 జూన్ మొదటి వారంలో ప్రచార రీతిలో సామూహిక చెట్ల పెంపకం చేపట్టాలని,కార్యక్రమం,ముఖ్యంగా పాఠశాలలు,కళాశాలలు,ఇతర సంస్థలు,ప్రజా ప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థలు మరియు పౌర సమాజ సంస్థలు మొదలైన వారి భాగస్వామ్యంతో అందరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.జిల్లాలోని అన్ని మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించి,ఆ ప్రదేశాలు టీజీ ఎఫ్ఎంఐఎస్ వెబ్సైట్ లో జియో-కోఆర్డినేట్ లతో నమోదు చేయాలని అన్నారు.మంచి మనుగడను నిర్ధారించడానికి నర్సరీలలో సరైన విభజన తర్వాత,మంచి నాణ్యత గల మొలకలను నాటడానికి సిద్ధంగా ఉంచాలని,ఫలాలు కాసే జాతుల పెంపకంపై దృష్టి పెట్టాలన్నారు.జిల్లాల్లోని అన్ని అనువైన ఖాళీ స్థలాలలో మొక్కలు నాటడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని,అవసరమైన చోట నీరు పట్టడం,కాపలా పెట్టడానికి సరైన ఏర్పాట్లు చేయాలని,వ్యవసాయ అడవుల పెంపకాన్ని,గట్ల దగ్గర మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని,వ్యవసాయ అటవీ,నేల ఆరోగ్యం యొక్క ప్రయోజనాల గురించి వ్యవసాయ విస్తరణ అధికారుల నుండి గ్రామస్తులకు ప్రచారం.ఏడాది పొడవునా బండ్ ప్లాంటేషన్ ప్రోత్సహించాలని తెలిపారు.ముందుగా నాటిన తోటల నిర్వహణ,వన మహోత్సవాన్ని ప్రోత్సహించడానికి మంచి తోటల పెంపకంతో ఫోటోను తీసుకోవాలని,జాతీయ వెదురు మిషన్ ను వెదురు పై తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని, ఎస్ సి టి,సీసీటీ ఇతర ఎస్ఎంసి నిర్మాణాలపై పొదలు,మూలికల పెంపకం,పర్యావరణ శాస్త్రానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.మున్సిపల్ ఏరియాలో ప్రతి ఇంటికి 5 మొక్కలను అందజేయాలని,వాల్టా నియమాన్ని పాటించాలన్నారు.మున్సిపల్ ప్రాంతంలోని రోడ్లపై,ముఖ్యంగా



రోడ్లపై ఉన్న దుకాణాలు/ఇళ్ల ముందు ఉన్న 3 ప్లాంట్లను నాటడానికి చర్యలు చేపట్టాలని అన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా స్థాయిలో ప్రభావవంతమైన సమీక్ష,నిరంతర పర్యవేక్షణ చాలా అవసరం అని తదనుగుణంగా,అవసరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.వన మహోత్సవ వేడుకల కాలంలో పూర్తయిన,పూర్తిగా సిద్ధంగా ఉన్న హరిత ఆస్తులను గుర్తించి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలన్నారు.వనమహోత్సవం సమయంలో మొక్కలు నాటడం ద్వారా సాధించిన విజయాన్ని టీజీ ఎఫ్ఎంఐఎస్ లో అప్లోడ్ చేయాలని,ఈ విషయంలో ఏవైనా సమస్యలకు సంబంధిత జిల్లా అటవీ అధికారులు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.ఈ సందర్భంగా జిల్లాకు కావలసిన మొక్కలను అందుబాటులో ఉంచాలని,ఆయా శాఖలకు సంబంధించి మొక్కల లక్ష్యాలను సాధించాలని,అవసరమైన ఈత,ఖర్జూర,ఇప్పా తదితర మొక్కలు నర్సరీల్లో కావలసిన మొక్కలను అందుబాటులో ఉంచాలని డిఆర్డిఓ ను ఆదేశించారు.అనంతరం ఇందిరా సౌర గిరి జల వికాసం,పిఎం జన్ మన్,జెజియుఎ ల పై సమీక్షించారు.ఈ సమావేశం లో ఆర్డిఓ వినోద్ కుమార్,ఆయా శాఖలకు సంబంధించి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే ఆదర్శ పాఠశాలగా రుద్రారం జిల్లాపరిషత్ పాఠశాలగూడెం మహిపాల్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

తెలంగాణ రాష్ట్రంలోనే రుద్రారం గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను 16 కోట్ల రూపాయల సి ఎస్ ఆర్ నిధులతో ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దబోతున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు బుధవారం పటాన్చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామ పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు లాటిక్రేట్ సంస్థ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణ ప్లాన్ మౌలిక వసతుల కల్పనపై చర్చించిన ఆయన మాట్లాడుతూ రుద్రారం గ్రామ పరిధి నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అంగన్వాడి పాఠశాల భవనాలను ఆధునిక సాంకేతికతో నిర్మించబోతున్నట్లు తెలిపారు లాటిక్రేట్ పరిశ్రమ సహకారంతో 16 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రముఖ ఆర్కిటెక్చర్ సంస్థ కృతిక ద్వారా ఆధునిక వసతులతో నిర్మించనున్నట్లు తెలిపారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మూడు ఎకరాల 34 గంటల స్థలంలో 43,378 చదరపు అడుగుల విస్తీర్ణంతో 15 తరగతి గదులు మండల పరిషత్ పాఠశాలను ఒక ఎకరా 23 గుంటల స్థలంలో 26,586 చదరపు అడుగుల విస్తీర్ణంలో 10 తరగతి గదులు నిర్మించబోతున్నట్లు తెలిపారు వీటితోపాటు ఫుట్ బాల్ బ్యాడ్మింటన్ కబడ్డీ కోర్టులను నిర్మించబోతున్నట్లు




తెలిపారు గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించేలా పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు ఇందుకు గ్రామంలోని తల్లిదండ్రులు పాఠశాల బృందానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు త్వరితగతిన పాఠశాల నిర్మాణం పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి పిఎసిఎస్ చైర్మన్ పాండు మాజీ ఎంపీటీసీలు రాజు హరి ప్రసాద్ రెడ్డి మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్ నాయక్ లాటిక్రేట్ సంస్థ ప్రతినిధి రోహిత్ తదితరులు పాల్గొన్నారు

# పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లాలో గత నెలలో జరిగిన నేరాలు,గతంలో జరిగిన కేసుల వివరాలు వాటి పురోగతిని తెలుసుకునేందుకు జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు గల సమావేశ మందిరంలో బుధవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అధ్యక్షతన ఉట్నూర్ సబ్ డివిజనల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉట్నూర్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,రానున్నది వర్షాకాలం ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్క సిబ్బంది అప్రమత్తమై పోలీస్ స్టేషన్ నందు ఉండాలని సూచించారు.వాహనాలలో అత్యవసర సామాగ్రిని కలిగి ఉండాలని,వాగులు వంకలు బ్రిడ్జిలను దాటి ప్రవహిస్తున్నప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అదేవిధంగా రైతులు మోసపోకుండా నకిలీ విత్తనాలను చలామణిలో లేకుండా కఠినమైన చర్యలను తీసుకోవాలని తెలిపారు.రైతులు నాణ్యమైన విత్తనాలను గుర్తింపు పొందిన దుకాణ యజమానుల వద్ద పొందాలని ప్యాకెట్లపై సరైన లేబుల్,విత్తనం యొక్క తయారీ తేదీ,ఎక్స్పైరీ తేదీ పూర్తి వివరాలను కలిగి ఉండి దుకాణ యజమాని వద్ద బిల్లు గ్రహించాలని సూచించారు.రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అక్రమ పశువుల రవాణా జరగకుండా చూడాలని ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ ఉండాలని తెలిపారు.డయల్ 100,బ్లూ కోర్ట్ సిబ్బంది గ్రామ గ్రామాన సందర్శిస్తూ,పోలీసు మీకోసం కార్యక్రమాలను నిర్వహిస్తూ విలేజ్ పోలీస్ ఆఫీసర్ యొక్క ఆవశ్యకత పై వివరణ ఇవ్వాలన్నారు.ఎలాంటి సమాచారమైనా డయల్ 100 లేదా విపిఓ కు సంప్రదించాలని తెలిపారు.ప్రతి గ్రామంలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ యొక్క నంబరు,సంబంధిత ఎస్సై సీఐ నెంబర్లను గోడలపై చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు.డాబాలలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా,ప్రతి ధాబాలు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు.రానున్న లోక్ అదాలత్ ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.ముఖ్యంగా మండలాల పరిధిలో గంజాయి సాగు వాడకం వర్తకం లాంటివి జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు.మండలాల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు గ్యాంబ్లింగ్ గుడుంబా లాంటివి జరగకుండా గస్తీ నిర్వహించాలని సూచించారు.సిబ్బందికి ప్రత్యేక శిక్షణ తరగతులను ఏర్పాటు చేసి రికార్డు మైంటెనెన్స్,స్టేషన్ రైటర్స్,క్రైమ్ రైటర్స్ లలో మరింత నైపుణ్యం పెంపొందించే విధంగా




ఏర్పాటు చేస్తామన్నారు.అమాయక ప్రజలను మోసం చేసి రిజిస్ట్రేషన్లు చేసుకునే వారిపై,అధిక వడ్డీలు వసూలు చేసి ప్రజల రక్తాన్ని పిండే వడ్డీ వ్యాపారస్తులపై,డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసి మోసం చేసి స్థలాలను కబ్జా చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.నేర సమీక్ష సమావేశంలో గత నెలలో జరిగిన మోసాలు నేరాలపై సిబ్బందిని అడిగి తెలుసుకుని కేసుల నమోదు,దర్యాప్తు,పరిశోధనపై సూచనలు చేశారు.జిల్లాలో పెండింగ్లో ఉన్న కేసుల దర్యాప్తులను పూర్తి చేసి కోర్టు నందు చార్జి సీటు దాఖలు చేయాలని సూచించారు.వర్టికల్స్ ల పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నవీకరిస్తూ ఉండాలని సూచించారు.కోర్టు డ్యూటీ అధికారి తో వారాంతంలో సమీక్ష సమావేశం నిర్వహించి కోర్టులో జరిగే ప్రతి అంశాన్ని తెలుసుకొని బాధితులకు న్యాయం చేసే విధంగా కృషి చేయాలన్నారు.పెండింగ్ లో ఉన్న నాన్ బెలెబుల్ వారెంట్ లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్ రావు,ఉట్నూర్ ఏఎస్పి కాజల్ సింగ్,డీఎస్పీలు పోతారం శ్రీనివాస్,సిహెచ్ నాగేందర్,సిఐలు రహీం పాషా,జి మొగిలి,బి రాజు,పండే రావు,గుణవంత్ రావు,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి,టి మురళి,ఎన్ చంద్రశేఖర్,ఓటును సబ్ డివిజన్ ఎస్ఐలు,ఐటి కోర్,డి సి ఆర్ బి,కమ్యూనికేషన్,పిసిఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని గట్టెక్కించడం అందరి బాధ్యత

## కార్మికులను కాపాడుకోవడమూ ముఖ్యమే

హైదరాబాద్,మే28(సమయజ్యోతి):



నష్టాల బాటలో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించడం కోసం ఎండి సజ్జన్నార్ రకరకాల ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే కరిమింగిన వెలగపండులా ఆర్టీసీ రోజురోజుకూ కుదేలవుతోంది. ప్రస్తుత నష్టాలను చార్జీల ద్వారా గట్టెక్కించడం అసాధ్యం. దీనికితోడు పెరుగుతున్న డీజిల్ ధరలు కూడా ఆర్టీసికి గుదిబండగా మారాయి. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ మరింత నష్టాల్లోకి దిగజారింది. కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవడంలో వెనకాడరాదు. అదేపనిగా టిక్కెట్ ధరలు పెంచినా గట్టెక్కించడం అసాధ్యం. ఆర్టీసిని లాభాల్లోకి తీసుకుని రావడంతో పాటు, కార్మికులకు కాపాడుకునే బాధ్యత యాజమాన్యంపై ఉంది. అయితే ఎండిగా సజ్జన్నార్ బాధ్యతలు తీసుకున్న తరవాత గతంకన్నా మేలనే చెప్పాలి. అనేక విధాలుగా ఆర్టీసీని గట్టెక్కించే చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడా చిన్న అవకాశం వదలకుండా కృషి చేస్తున్నారు. ఆర్టీసిని రక్షించుకునే ప్రయత్నంలో కార్మికుల జీవితాలకు కూడా భరోసా కల్పించి ముందుకు సాగాల్సి ఉంది. ప్రజలకు ఉత్తమ, మెరుగైన రవాణా సౌకర్యాలు, బస్సుల్లో అధికరద్దీని తగ్గించడం, అనుకూలమైన, అందుబాటు టికెట్ ధరలు, ఎక్కువ సంఖ్యలో బస్సులు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో సాగుతున్నది. ఆర్టీసీ రక్షణతో పాటు,కార్మికులు పక్షాన కూడా ఆలోచనతో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించాల్సి ఉంది. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆధీనంలోని వివిధ రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నాయి. వాటిని పాక్షికంగా లేదా పూర్తిగా ప్రైవేటీకరించే దిశగా ప్రయత్నిస్తున్నాయి. అనేక సంక్షేమ పథకాల అమలు వల్ల ఎప్పటికప్పుడు నిండుకుంటున్న ఖజానాతోపాటు, ఆర్థిక మాంద్యం దెబ్బతో బడ్జెట్ లెక్కలను నేల మీదకు దించక తప్పలేదు. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం ఇప్పటికిప్పుడు సాధ్యమయ్యే పనికాదనేది ఆర్థిక రంగ నిపుణుల అభిప్రాయం. మారిన పరిస్థితుల్లో ట్రాన్స్‌పోర్టుకు పూర్తిగా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడుతున్న వారు మినహా మిగిలిన జనం పెద్దగా ఇబ్బంది పడటంలేదు. ఆర్టీసీని కూడా ఏదో రకంగా గట్టెక్కించి లాభాల్లోకి రాకున్నానష్టాలు రాకుండా చూడ గలగాలి. ఇది ఏ ఒక్కరిద్దరి సమస్యనో కాదు. 50వేల మంది కార్మికులు, వారి కుటుంబాలతో ముడిపడి ఉన్న అంశం.

నిబద్ధతతో పని చేస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేస్తోన్న ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తోందని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లింపు, 21 శాతం ఫిట్‌మెంట్‌తో 2017 పీఆర్సీ, 2013 ఆర్పీఎస్ బాండ్ల డబ్బుల విడుదలతో పాటు- పెండింగ్ డీఏలను మంజూరు చేసిందని గుర్తు చేశారు. విధి నిర్వహణలో మరణించిన 2,350 మంది సిబ్బంది కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలను కల్పించామన్నారు. మెడికల్ అన్ ఫిట్ అయిన మరో 537 మందికి ఉద్యోగాలు ఇచ్చామని వీసీ సజ్జనార్ వెల్లడించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ కార్యక్రమం ద్వారా ప్రతి ఉద్యోగికి వైద్య పరీక్షలు చేశామని సజ్జనార్ పేర్కొన్నారు. ఈ ఆరోగ్య టెస్టుల ఫలితంగా 726 మంది ఉద్యోగులకు, 184 మంది ఉద్యోగుల జీవిత భాగస్వామ్యులను ప్రాణాప్రాయం నుంచి సంస్థ కాపాడిందన్నారు. అలాగే, మహాలక్ష్మి పథకం అమలుతో సిబ్బందిలో పెరిగిన పని భారాన్ని తగ్గించేందుకు తాత్కాలికంగా డ్రైవర్, కండక్టర్ పోస్టులకు నియామకాలు చేపడుతుంటే.. కొందరు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీసీలో 3036 రెగ్యూలర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పర్మిషన్ ఇచ్చిందని.. సాంకేతిక కారణాల వల్ల నియామక పక్రియలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఆ నియ మాకాలు కచ్చితంగా జరుగుతాయి.. అందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. తమ మనుగడ కోసం ఐదారు నెలలుగా కొందరు రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నా.. ఉద్యోగులు ఎంతో సమయమనంతో ఉన్నారని వీసీ సజ్జనార్ చెప్పారు. అలాగే, ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ కొనుగోలు చేసేలా అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని వీసీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. యాజమాన్యం తీసుకునే నిర్ణయాల వెనుక ఉద్యోగులు, సంస్థ ప్రయోజనాలే ఉంటాయో తప్ప.. ఎవరి వ్యక్తిగత ప్రయోజనాలు ఉండవన్నారు. ప్రతి నిర్ణయం చాలా పారదర్శకంగా, సంస్థ నియమ నిబంధనలకు లోబడే ఉంటుందని ఎండీ సజ్జనార్ వెల్లడించారు.

# అస్తవ్యవస్తంగా ముంబై డ్రైనేజీ వ్యవస్థ

### భారీ వర్షం పడితే సముద్రం తలపించేలా వీధులు

### పాలకలు చిత్తశుద్ధి లోపంతో ప్రజలకు అవస్థలు

ముంబై,మే28(సమయజ్యోతి):



ముంబై మహానగరంలో ఏటా వర్షాలు వస్తే నరకం చూడాల్సిందే. చిన్నపాటి వర్షం అయినా చిగురుటాకులా వణికిపోతుంది. అలాంటిది సాధారణం కన్నా రెండు వారాల ముందుగానే ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు 107 ఏళ్ల నాటి రికార్డులను చెరిపివేస్తూ కురిపించిన కుండపోతతో దేశ ఆర్థిక రాజధాని అతలాకుతలమైంది. ఎంతటి మహానగరమైనా వరుణుడు కన్నెర్ర చేస్తే నడిసంద్రంలా మారుతున్న తీరు మన పాలకుల ముందుచూపు లేమికి నిదర్శనంగా నిలిచిపోతోంది. గతంలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విజయవాడ... ఇలా ఎన్నో ఉదాహరణలు ఉండనే ఉన్నాయి. 2021లో ఇదే ముంబై నగరం భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయింది. ఆకస్మికంగా భారీ వర్షాలు కురిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలపై నిపుణుల కమిటీలు పలు సిఫార్సులు చేశాయి. కానీ, పాలకులు వాటిని అమలు చేయకుండా బుట్టదాఖలు చేయడం వల్లనే ఇటువంటి నష్టాలు తిరిగి సంభవిస్తున్న పరిస్థితి. ప్రధానంగా ఆక్రమణలు, డ్రైనేజీ వ్యవస్థ అల్లకల్లోలం చేస్తున్నాయి. ఆర్థిక నగరానికి ఆదాయం ఉన్నా దానిని బాగు చేసే ఆలోచనలో పాలకులు లేరు. ఎవరు అధికారంలో ఉన్న ముంబై అతలాకుతలం కావాల్సిందే. మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ చూపకపోవడం నగరాలు, పట్టణాలు నీట మునకకు కారణమవుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజిలు తదితర మౌలిక వసతులు కల్పించి, నీటి ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చూసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకునేందుకు ఇప్పటి-కై-నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భుజంభుజం కలపాలి. ప్రకృతికి అనుకూలంగా ఉండే ప్రాజెక్టులను రూపొందించడం, డ్రైనేజి వ్యవస్థను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం, నూతన నగరాల నిర్మాణంలో, ఉన్న నగరాల విస్తరణలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం లాంటి చర్యలు అత్యావశ్యకం.ఈ ఏడాది 16 రోజులు ముందుగానే రావడం గత 75 ఏళ్లలో ఇదే తొలిసారి. మునిగిన రహదారులు, భూగర్భ మెట్రో లైన్లు, రైల్వే స్టేషన్లతో నగర జీవనం స్తంభించిపోయింది. రోడ్డు, రైలు, విమాన సర్వీసులకూ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎల్లో అలర్ట్‌ను జారీచేయడం ద్వారా ఈ స్థాయి వర్షాలను అంచనా వేయడంలో భారత వాతావరణ శాఖ విఫలమైనట్టే! గతంలో వయనాడ్‌లో భారీ వర్షాలతో కొండచరియల బీభత్స సమయంలోనూ వాతావరణ శాఖ వైఫల్యం మనమెరిగిందే! ఇంతటి భారీ వర్షపాతానికి సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదల, వాతావరణ మార్పులు ప్రధాన కారణమని ఐఎండి చెబుతోంది. ధారాపాతంగా రాత్రంతా కురిసిన 200 మిల్లీమీటర్లకు మించిన వర్షపాతం ముంబైని ముంచెత్తింది. పొరుగున ఉన్న కొలాబాలో సోమవారం 295 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడం 1918 నాటి రికార్డు 279.4 మిల్లీమీటర్లను తిరగరాసింది. దక్షిణ ముంబైలో 13 గంటల్లోనే 252 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాల్లోనూ వర్షాలు ప్రభావం చూపాయి. కేరళలో రుతుపవనాలు ప్రవేశించిన పది రోజులకు మహారాష్ట్రకు రావాల్సి ఉండగా 24 గంటల్లోనే ఇక్కడ ప్రతాపం చూపాయి. సాధారణంగా ఏటా జూన్ 11న ముంబైలో రుతుపవనాలు ప్రవేశిస్తాయి. వాతావరణ శాఖ మరింత అధునాతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా నష్టాల తీవ్రతను కొంతమేరకైనా తగ్గించవచ్చు. ప్యారిస్ వాతావరణ ఒప్పందం అమలుకు అమెరికాలాంటి అగ్రరాజ్యాలు చేతులెత్తేయడం, పర్యావరణ పరిరక్షణకు చేసిన తీర్మానాల అమలుకు శ్రద్ధ చూపని ధనిక దేశాల తీరు ప్రకృతి వైపరీత్యాల తీవ్రతను భారీగా పెంచేస్తున్నాయి. మూడో ప్రపంచ దేశాలకు పెనుముప్పుగా మారిపోతున్నాయి.ఏటా అంతక్రితం ఏడాదితో పోలిస్తే భారీ వర్షాలు నమోదవుతూనే ఉన్నాయని కేందప్రభుత్వ ఎర్త్ సైన్స్ విభాగం ఐదేళ్ల క్రితమే అంచనా వేసింది. కుండపోత వర్షాలు కురిసినా చెరువులు, వాగులు, వంకలు లాంటి సహజ సిద్ధమైన ప్రవాహ మార్గం ద్వారా గతంలో వెళ్లిపోయేవి. నగరాలు, పట్టణాల విస్తరణ, అక్రమార్కుల కబ్జాలు, వాటికి పాలకుల ప్రోత్సాహం... ఇవన్నీ నీటి ప్రవాహానికి ఎక్కడికక్కడ అడ్డంకులుగా వున్నాయి. గత ఏడాది విజయవాడను ముంచెత్తిన వరదలు కూడా ఇలాంటివే. ప్రకృతి వైపరీత్యాల నష్టాల తీవ్రతకు పాలకుల విధాన వైఫల్యమే ప్రధాన కారణం.

# రైతులకు కేంద్రం శుభవార్త

### వరి తదితర పంటలకు మద్దతు ధరల పెంపు-వరిపై 69 రూపాయలు పెంచుతూ నిర్ణయం

న్యూఢిల్లీ,మే28(సమయజ్యోతి):

కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. రైతులకు శుభవార్త చెప్పింది. వరి మద్దతు ధర పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఖరీఫ్ సీజన్‌కు వరి మద్దతు ధరను 69 రూపాయలకు పెంచింది. తాజా పెంపుతో క్వింటా వరి మద్దతు ధర 2,369 రూపాయలకు చేరింది. కేంద్రం మద్దతు ధర కోసం 2.70 లక్షల కోట్ల రూపాయలు కేటాయించింది. అంతేకాదు.. రైతులకు వడ్డీ రాయితీ కింద 15,642 కోట్ల రూపాయలు కేటాయించింది. పెట్టుబడిపై రైతులకు 50 శాతం లాభం ఉండేలా నిర్ణయం తీసుకుంది.ఖరీఫ్ సీజన్‌లో వరి సహా 14 పంటలకు మద్దతు ధర పెంపునకు ఆమోదం తెలిపింది. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి క్వింటాల్ వరిపై రూ.69 పెంచడంతో కనీస మద్దతు ధర రూ.2369కి చేరింది. కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. గత 10-11 ఏళ్లలో ఖరీఫ్ పంటలకు ఎంఎస్‌పీ భారీగా పెంచినట్లు- ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కోసం ఎంఎస్‌పీ పెంపును కేంద్ర క్యాబినెట్ ఆమోదించిందన్నారు. ఆయా పంటలకు ఎంఎస్‌పీ కోసం రూ.2.7లక్షల కోట్లు- కేటాయిస్తున్నట్లు- తెలిపారు. రైతులకు వడ్డీ రాయితీ కింద రూ.15,642 కోట్లతో పాటు- అన్నదాతల పెట్టుబడిపై 50శాతం మార్జిన్ ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు- మంత్రి పేర్కొన్నారు. మరోవైపు, ఏపీలోని బద్వేల్- నెల్లూరు నాలుగు వరుసల రహదారి అభివృద్ధికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.3,653 కోట్లతో 108.134 కి.మీల పొడవున ఈ రహదారిని అభివృద్ధి చేయనుంది. బద్వేల్‌లోని గోపవరం నుంచి నెల్లూరు జిల్లాలోని గురివిందపూడి వరకు నిర్మాణం చేపట్టే ఈ కారిడార్‌తో కృష్ణపట్నం పోర్టుకు ప్రయాణ దూరం దాదాపు 33.9 కిలోమీటర్లు తగ్గనుంది. అలాగే, ఈ కారిడార్ నిర్మాణంతో భారీగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్రం తెలిపింది. వరి సహా మొత్తం 14 ఖరీఫ్ పంటలకు క్వింటాల్‌పై కనీస మద్దతు ధ(ఃꞏూ) కేంద్రం పెంచింది. వీటిలో వరి సాధారణ, గ్రేడ్- ఏలకు రూ.69 పెంచగా.. జొన్నలు రూ. 328; సజ్జలు రూ.150; రాగులు రూ.596; మొక్కజొన్న రూ.175; కందిపప్పు రూ.450; పెసర రూ.86; మినుములు రూ.400; వేరుశెనగ రూ.480; పొద్దుతిరుగుడు రూ.441; సోయాబీన్ రూ.436; కుసుమలు రూ.579; వలిశలు (గడ్డినువ్వులు) రూ.820; పత్తి రూ.589 చొప్పున కనీస మద్దతు ధరను పెంచారు.

## కలియుగంలో భగవన్నామస్మరణమే

## ( ఆధ్యాత్మిక చింతన)

తిరుమల,మే28(సమయజ్యోతి):

కలియుగంలో భక్తి పారాయణం అన్నది భగవంతుడి కృప పొందడానికి ఉన్న ఏకైక మార్గం. తపస్సులు ఆచరించి భగవంతుడిని సాధించడానికి ఈ కలికాలంలో అసాధ్యం. నామస్మరణ ద్వారా అనుభూతి కలుగుతుంది. అది అనుభవించిన వారికే దాని మాధుర్యం తెలుస్తుంది. భగవన్నామ స్మరణ ఒక్కటే వారికి మోక్షదాయకమని వేదపురాణాలు చెబుతున్నాయి. సప్త వ్యసన పరులైనా చనిపోయేముందు రామనామ జపం చేస్తారు. నారాయణుడి పేరును తులస్తారు. నారాయణ నామం పదేపదే ఉచ్ఛరించడం వల్ల నేరుగా వైకుంఠానికి చేరుకుంటామన్న భావన కారణంగా ఇలా చేస్తారు.అందుకే భగవంతుడు స్మరణతోనే సాక్షాత్కరించే యుగం ఇది. కలియుగంలో కేవలం మనస్సును లగ్నం చేసి స్మరించాలి. భగవంతుణ్ని చేరడానికి నామస్మరణే సులభమైన భక్తి మార్గమని మన పూర్వీకులు, మునులు సూచించారు. శ్వాస, ధ్యాసలను ఆ పరమాత్ముని నామ జపం మీదే ఉంచి ఆయన్ని చేరడానికి ప్రయత్నించాలి. భజనలు, పారాయణాలు, పూజలు మాత్రమే చేయాల్సి ఉంటుంది. ప్రముఖ వాగ్గేయకారులంతా భగవంతుడి నామస్మరణలో తమదైన స్తోత్రాలు చేశారు. అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు లాంటి వారంతా భగవంతుడిని ప్రేమతో ఆరాధించారు.నామస్మరణలు, భజనలు, ఆరాధనలు కేవలం భక్తిని మాత్రమే కాకుండా మనిషిలో ఏకాగ్రత, ఆత్మ విశ్వాసం కలిగిస్తాయి. అనిర్వచనీయమైనా ఆత్మానందాన్ని ఇస్తాయి. మానసిక ఉల్లాసానికి కారణ మవుతాయి. ఆశావహదృక్పథం, ప్రేమతత్వం పెరుగుతంది. ఈ జీవితంలో భగవన్నామ స్మరణ ఒక్కటే ముక్తికి దగ్గరి దారి అని మహర్షులెందరో చాటిచెప్పారు. భగవంతుని అనుగ్రహం పొందడానికి, ఆయన ప్రేమను పొందడానికి ప్రేరణ భక్తి ఒక్కటే. భగవానుని ఆశీస్సులతో నిత్యజీవితంలో ఎదురయ్యే కష్టనష్టాల నుంచి ఉపశమనం పొందడానికి కూడా ప్రేరణ ఇస్తాయి. ఉన్నంతలో సంతృప్తిగా, సంతోషంగా, జీవన విధానాన్ని తీర్చిదిద్దుకునేందుకు ఆధ్యాత్మికత అన్నది దోహపడుతుంది. అంతెందుకు మనమంతా సన్మార్గంలో పయనించాలన్న బలమైన భావన, విశ్వాసం ఏర్పడుతాయి. వేదాంతపరమైన అంశాలను, గురువుల బోధనను, మత గ్రంథాలలో ప్రస్తావించిన విషయాలను కొంత వరకైనా అవగాహన చేసుకొని ఆచరణ చేయడం మంచిది. అయితే ఆచరణలో పెట్టకుండా ఎన్ని ప్రబోధాలు విన్నా, ఎన్ని గ్రంథాలు పారాయణం చేసినా ప్రయోజనం ఉండదు. మన రామాయణ, భారత, భాగవతాది గ్రంథాల్లో వచ్చే కథలన్నీ ఇలాంటి స్ఫూర్తిని రగిలిస్తాయి. పురాణాలు, ప్రబంధాలు ప్రబోధిం చిన ధర్మాలను, జీవన విధానాలను ఆచరణలో పెట్టుకుని,భక్తిభావనలో ముందుకు సాగితే జీవితం సుఖమయం కాగలదు.

## ఎన్టీఆర్ నుంచి ప్రేరణ పొందా : మోడీ నివాళి

న్యూఢిల్లీ,మే28(సమయజ్యోతి):

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళి అర్పించారు. ఆయన తెలుగు సినీ రంగంలో విశిష్ట నటుడు.. దార్శనికత ఉన్న నాయకుడు అని కొనియాడారు. సినిమాల్లో ఎన్టీఆర్ పోషించిన పాత్రలను ఇప్పటికీ ప్రజలు తలచుకుంటూనే ఉంటున్నారని చెప్పారు. సమాజ సేవ, పేదలు, అణగారిన వర్గాల సాధికారతకు కృషి చేశారన్నారు. ఆయన నుంచి ఎంతో ప్రేరణ పొందినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ ఆశయాలను సాధించేందుకు కృషి చేస్తోందని వివరించారు.

## అస్వస్థతకు గురైన గులాంనబీ ఆజాద్

### రియాజ్ ఆస్పత్రిలో చికిత్స

న్యూఢిల్లీ,మే28(సమయజ్యోతి):

విదేశీ పర్యటనలో ఉన్న కేంద్రమాజీమంత్రి గులాంనబీ ఆజాద్ అస్వస్థతకు గురయ్యారు. ఆయన బహ్రెయిన్‌లో అస్వస్థతకు గురికాగా రియాజ్‌ని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నరు. పహల్గంలో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్థాన్‌ను ఎండగట్టేందుకు భారత్ సిద్ధమైంది. ఈ మేరకు అన్ని పార్టీల నుంచి ఎంపిలను ఎంపిక చేసి.. విదేశీ పర్యటనకు పంపించింది. అయితే ఈ బృందం సభ్యుల్లో ఒకరైన జమ్ముకశ్మీర్ మాజీ సిఎం, డెమొక్రటిక్ ప్రోగ్రెసీవ్ ఆజాద్ పార్టీ చీఫ్, మాజీ ఎంపి గులాం నబీ ఆజాద్ కూడా ఉన్నారు. అయితే ఆయన బహ్రెయిన్ పర్యటనలో అస్వస్థతకి గురయ్యారు. ఈ విషయాన్ని ఈ బృందానికి నేతృత్వం వహిస్తున్న బిజెపి ఎంపి బైజయంత్ పాండా ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆజాద్ ప్రస్తుతం రియాజ్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని పేర్కొన్నారు. ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని.. కొన్ని -టె-స్టులు చేయాల్సి ఉందని తెలిపారు. సౌదీ పర్యటనలో ఉండగా.. ఆయన అనారోగ్యానికి గురి కావడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇప్పటివరకూ ఆయన సహకారంతో బహ్రెయిన్, కువైట్‌లో పర్యటనలు విజయవంతంగా జరిగాయని.. అల్జీరియా పర్యటనలో ఆయన లేని లోటు- స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.

## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబయి,మే28(సమయజ్యోతి):

దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలున్నప్పటికీ.. వరుసగా రెండో రోజూ సూచీలు నష్టాల్లో ముగిశాయి. రోజంతా ఓ మోస్తరు స్థాయిలో కదలాడి చివరికి నష్టాల్లో స్థిరపడ్డాయి. ఎఫ్ఎంసీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 81,457.61 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,244.02 - 81,613.36 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి 239 పాయింట్ల నష్టంతో 81,312.32 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 73.75 పాయింట్ల నష్టంతో 24,752.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం 85.37గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐటీ-సీ, ఇండస్ ఇండ్ బ్యాంక్, నెస్లే ఇండియా, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు లాభపడ్డాయి.

## 4కోట్ల విలువైన గంజాయి పట్టివేత

భద్రాద్రి కొత్తగూడెం,మే28(సమయజ్యోతి):

తెలంగాణలో డ్రగ్స్, గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నా.. నిత్యం ఎక్కడో ఒక చోట పట్టుబడుతూనే ఉంది. పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నా.. వీటి రవాణా మాత్రం ఆగడంలేదు. ఈజీ మనీకి అలవాటు పడ్డ వారు గంజాయిని రవాణా చేస్తున్నారు. తాభాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. పక్కా సమాచారంతో బుధవారం జూలూరుపాడు మండలంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి 8.30 క్వింటాళ్ల గంజాయి పట్టుకున్నారు. అనంతరం తొమ్మిది మంది సభ్యుల ముఠాను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. పట్టుబడిన గంజాయి ధర మార్కెట్ లో రూ.4 కోట్లకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి ముఠాపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పంటనష్టపోయిన రైతులకు ఊరట

### పరిహారాన్ని ఖాతాల్లో జమచేసిన ప్రభుత్వం

హైదరాబాద్,మే28(సమయజ్యోతి):

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి శుభవార్త చెప్పింది. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఆసరాగా నిలిచింది. రైతులకు ఊరటనిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పంట నష్ట పరిహారం నిధులను బుధవారం నాడు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇటీవల వడగంట్ల వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా 29 జిల్లాల్లోని 5,528 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ అంచనా నివేదిక ప్రచారం ప్రభుత్వం రూ. 51.52 కోట్లను విడుదల చేసింది. ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మే నెలకు పంట నష్టపరిహారం నిధులను త్వరలోనే విడుదల చేస్తామని మంత్రి తుమ్మల ప్రకటించారు.

# రాజ్యసభ సభ్యుడిగా పాక
## ప్రమాణం చేయించిన ధన్‌ఖడ్

**న్యూఢిల్లీ,మే28(సమయజ్యోతి):**

రాజ్యసభ సభ్యుడిగా బిజెపికి చెందిన పాక వెంకట సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం మధ్యాహ్నం సత్యనారాయణ చేత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ దన్‌ఖడ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్, ఎంపీ లక్ష్మణ్, ఏపీ మంత్రి సత్య కుమార్ హాజరయ్యారు. విజయసాయి రెడ్డి రాజీనామాతో ఏర్పడిన ఖాళీ స్థానానికి పాక సత్యనారాయణ అభ్యర్థిని బీజేపీ ప్రకటించింది. ఏపీ నుంచి బీజేపీ ఎంపీగా పాక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏప్రిల్ 2028 వరకు సత్యనారాయణ పదవిలో కొనసాగనున్నారు.
1961లో ఏపీలోని భీమవరంలో పాక సత్యనారాయణ జన్మించారు. 15ఏళ్ల వయస్సులోనే అంటే 1976లో ఆయన ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో పాక సత్యానారాయణ క్రియాశీలకంగా పనిచేశారు. 1980లో బీజేపీలో చేరిన పాక.. ఆ తరవాత భీమవరం మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. 1996 లోక్‌సభ ఎన్నికల్లో నరసాపూర్ నుంచి బీజేపీ తరపున పోటీ- చేసి ఓడిపోయారు. ఆ తరువాత 2006 ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ- చేసి ఓటమిని చవిచూశారు. 2006 నుంచి 2010 వరకు భీమవరం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. అలాగే 2012 నుంచి 2018 వరకు ఏపీ బీజేపీ అధికార ప్రతినిధిగా ఉన్నారు. అలాగే 2014లో ఉమ్మడి ఏపీ ఎన్నికల మేనిఫెస్టో ముసాయిదా కమిటీ- సభ్యుడిగా ఉన్నారు. 2018 నుంచి 2021 వరకు బీజేపీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడిగా పాక సత్యనారాయణ పనిచేశారు. ప్రస్తుతం ఆయన బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ- చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఇక.. విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి కూటమి ప్రభుత్వం పాక సత్యనారాయణను నామినేట్ చేసింది. 2025, మే 6న ఆయన ఏకగ్రీవంగా ఎన్ని-కై-నట్లు- కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ క్రమంలో ఈరోజు రాజ్యసభ సభ్యుడిగా పాక సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు.

# తమిళంలో నుంచే కన్నడ పుట్టింది

### కమలహాసన్ వ్యాఖ్యలపై భగ్గుమన్న కన్నడిగులు
### కమల్‌కు కన్నడ చరిత్ర తెలియదంటూ సిఎం సిద్దరామయ్య విసుర్లు

**బెంగళూరు,మే 28(సమయజ్యోతి):**

తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. తాను నటించిన థగ్‌లైఫ్ సినిమా ఆడియో విడుదల సందర్భంగా చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'నా జీవితం, నా కుటుంబం తమిళ భాష' అని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలపై కన్నడిగులు మండిపడు తున్నారు. తాజాగా ఈ వివాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు.
ఈ మేరకు నటుడి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కన్నడ పుట్టుకకు తమిళంతో సంబంధం లేదని పేర్కొన్నారు. కన్నడకు సుదీర్ఘ చరిత్ర ఉందని వ్యాఖ్యానించారు. కమల్ హాసన్‌కు ఆ విషయాలన్నీ తెలియవంటూ ఎద్దేవా చేశారు. కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నైలో జరిగిన సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో కమల్‌హాసన్ మాట్లాడుతూ.. 'కన్నడం.. తమిళం నుంచి పుట్టింది' అని కామెంట్ చేశారు. ఇదే కార్యక్రమానికి కన్నడ
సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కూడా హాజరయ్యారు. ఆయన ఎదుటే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉయిరే, ఉరవే తమిళే (నా ప్రాణం, నా బంధుత్వం తమిళం) అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన కమల్ హాసన్ అనంతరం కన్నడ స్టార్ శివరాజ్ కుమార్‌ని ఉద్దేశించి మాట్లాడారు. 'శివరాజ్‌కుమార్ వేరే రాష్ట్రంలో నివసిస్తున్నా నా కుటుంబ సభ్యుడు. అందుకే ఆయన ఈ రోజు ఇక్కడ ఉన్నారు. అందుకే నా ప్రసంగం మొదలుపెట్టేటప్పుడు.. నా జీవితం, నా కుటుంబం తమిళ భాష అని చెప్పా.



మీ భాష (కన్న) తమిళ నుంచే పుట్టింది. ఆ విధంగా మీరు భాగస్వామి అయ్యారు' అని శివరాజ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నారు. అయితే తమిళం నుంచి కన్నడ పుట్టిందన్న కమల్ వ్యాఖ్యలపై కన్నడ సంఘాలు భగ్గుమన్నాయి. బెంగళూరులో థగ్‌లైఫ్ సినిమా బ్యానర్లను కొందరు ఆందోళనకారులు చించివేశారు. 'కర్ణాటకలో మీకు వ్యాపారం కావాలి.. కానీ కన్నడ భాషను అవమానిస్తారా?' అని ధ్వజమెత్తారు.

# గోదావరి వృధా జలాలు వాడుకుంటే తప్పేంటి

### చివరి రాష్ట్రం కవడంతోనే వాడుకోవాలని నిర్ణయం - బకచర్లపై బిఆర్‌ఎస్ అనవసర రాద్దాంతం

### నదుల అనుసంధానంతో తెలంగాణకు కూడా మేలు - కడప మహానాడు వేదికపై చంద్రబాబు వ్యాఖ్యలు

**కడప,మే 28(సమయజ్యోతి):**

వృధాగా సముద్రంలో కలిసిపోతున్న గోదావరి జలాలను వాడుకుంటే వచ్చే నష్టమేంటని సిఎం చంద్రబాబు అన్నారు. వృధా జలాలను వినియోగంలోకి తేవాలన్న లక్ష్యం మేరకు బనకచర్ల ప్రతిపాదనలు చేశామని, అయితే దీనిపై బిఆర్‌ఎస్ పార్టీ రాద్దాంతం చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏకగ్రీవంగా మరోసారి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మహానాడులో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో గంజాయిని పూర్తిగా నియంత్రిస్తామన్నారు. శాంతిభద్రతలను ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. తప్పు చేసినవారి పట్ల చండశాసనుడిలా ఉంటానని చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమకు ద్రోహం చేసిన పార్టీ వైసీపీ అని ఫైర్ అయ్యారు. రాయలసీమను ఎడారి కానివ్వమని, రాయలసీమను సస్యశ్యామలం చేస్తామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామని అన్నారు. అలాగే, 2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి చేస్తామని చంద్రబాబు తెలిపారు.బనకచర్ల వరకు నీరు



తేవాలన్నదే తమ లక్ష్యమన్నారు. నదుల అనుసంధానం పూర్తి చేస్తామని, నదీ జలాల వినియోగంలో ఏపీ చివరి రాష్ట్రమని, నదుల అనుసంధానంతో తెలంగాణకూ లాభమేనని చంద్రబాబు వివరించారు. ఈ అంశంలో బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. బనకచర్లతో తెలంగాణకు ఎలాంటి నష్టం జరగదని, సముద్రంలోకి పోయే నీటిని వాడుకుంటే తప్పేంటని చంద్రబాబు ప్రశ్నించారు. ఏపీ, తెలంగాణ తనకు రెండు కళ్లు వంటివి అని చంద్రబాబు పేర్కొన్నారు. ఇంతవరకు శక్తిమేర పార్టీని సమర్థంగా నడిపానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, నా బలం, బలగం.. టీ-డీపీ నాయకులు, కార్యకర్తలేనని పేర్కొన్నారు. ఇంతవరకు జరిగిన అన్ని మహానాడుల కంటే కడప మహానాడు ప్రత్యేకమన్నారు. తెలుగుజాతి ఉన్నంతవరకు టీడీపీ ఉంటుందని, రానున్న 40 ఏళ్లకు ప్రణాళికలు రూపొందించుకున్నామని స్పష్టం చేశారు. ఫ్యాక్షనిజం, నక్సలిజాన్ని తుదముట్టించిన పార్టీ టీడీపీ అన్నారు. గత ఐదేళ్లు ఏపీలో శాంతిభద్రతలు లేవని, వైసీపీ హయాంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబాయిని హత్య చేసి ఆ నింద మనపై మోపాలని చూశారని అయితే తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదన్నారు. తప్పు చేసిన వారిని ఎట్టిపరిస్థితిలోనూ వదిలిపెట్టేది లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.

# మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖ

### దండుగులను అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,మే 28(సమయజ్యోతి):**

మేడ్చల్ జిల్లాలోని షాపూర్‌నగర్‌లో మావోయిస్టు పేరుతో బెదిరింపు లేఖ కలకలం సృష్టించింది. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సోదరుడి కుటు-ంబాన్ని లేఖలో లక్ష్యంగా చేసుకున్నారు. రూ.50 లక్షలు ఇవ్వకపోతే కూన రవీందర్‌గౌడ్ కుమారుడు కూన రాఘవేందర్ గౌడ్‌ను చంపుతామని అందులో పేర్కొన్నారు. రెండు ఇళ్లను బాంబులతో పేల్చేస్తామని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి ముందు వస్తువులు ధ్వంసం చేసి అక్కడ లేఖను ఉంచారు. ఈ క్రమంలో జీడిమెట్ల పోలీసు స్టేషన్ పరిధిలో మావోయిస్టుల లేఖ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 21న మావోయిస్టుల పేరుతో నిందితులు లేఖ రాశారు. వారిని కూన రాఘవేందర్‌గౌడ్ ఇంట్లో అద్దెకు ఉంటున్న రాజు, అతడి స్నేహితుడిగా గుర్తించారు. నిందితుల వద్ద నాటుబాంబులు, 3 సెల్‌ఫోన్లు, 2 బెదిరింపు లేఖలను స్వాధీనం చేసుకున్నారు. నాటుబాంబులను వారు విజయనగరంలో కొనుగోలు చేసినట్లు తెలిసింది. కారుపై ఎరుపు రంగు టవల్‌లో లేఖ పెట్టి వెళ్లిపోయారు. ఘటన ఈ నెల 21న జరిగినట్లు- రాఘవేందర్‌గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల్లో ఓ వ్యక్తి మాస్క్ ధరించి వచ్చినట్లు- గుర్తించారు. తాజాగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు.

# 12 లక్షలు లంచం డిమాండ్

### ఆర్‌ఐ కృష్ణను అరెస్ట్ చేసిన ఎసిబి

**రంగారెడ్డి,మే 28(సమయజ్యోతి):**

లంచం తీసుకుంటున్న అధికారులు ఎంత మందిని అరెస్ట్ చేసినా.. అవినీతి చేసే వాళ్లలో మాత్రం ఏమాత్రం మార్పు రావడం లేదు. చిన్న పని పెద్ద పని అనే తేడా లేకుండా లంచం డిమాండ్ చేసే అధికారులు రోజురోజుకీ పెరిగిపోతున్నారు. తాజాగా అవినీతి నిరోధక శాఖ అధికారుల వలలో లంచగొండి అధికారి చిక్కాడు. పట్టాదార్ పాస్ పుస్తకంలో 7 గుంటల స్థలం నమోదుకు లంచం డిమాండ్ చేసిన ఇబ్రహీంపట్నం ఆర్‌ఐ కృష్ణని అధికారులు అరెస్ట్ చేశారు. రూ.12లక్షలు ఇస్తే భూమిని పాస్‌బుక్‌లో నమోదు చేస్తానని బాధితుడిని కృష్ణ బెదిరించాడు. ఆర్‌ఐతో మాట్లాడిన కాల్ రికార్డులను బాధితులు ఎసిబి అధికారులకు ఇచ్చారు. దీంతో ఆర్‌ఐ కృష్ణను ఎసిబి అధికారులు అరెస్ట్ చేశారు.

# బాసర ఆర్జీయూకెటిలో నోటిఫికేషన్ విడుదల

**బాసర,మే 28(సమయజ్యోతి):**

ఆర్జీయూకేటీ- బాసర, మహబూబ్ నగర్ సెంటర్ లలో ఆరు సంవత్సరాల సమీకృత విద్యా విధానంలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించుటకు అడ్మిషన్ నోటిఫికేషన్ ను వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ విడుదల చేశారు. గ్రామీణ పేద విద్యార్థులకు 2008వ సంవత్సరంలో ప్రారంభించిన ఈ విశ్వవిద్యాలయం సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యంగా ఏర్పాటయిందని, తదనుగుణంగా ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్నామని తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పేద విద్యార్థులు పొందుతున్నారని ఈ సందర్భంగా తెలిపారు. నోటిఫికేషన్ వివరాలు డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యూ. ఆర్ జి యు కే టి. ఏసి. ఇన్ వెబ్ సైట్ ను సందర్శించాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఓయస్డి ప్రొఫెసర్ మురళీ దర్శన్, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్, కో కన్వీనర్ డాక్టర్ దేవరాజు, అసోసియేట్ డీన్ డాక్టర్ విటల్, మంతపురి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల కళ్లుగప్పి రిమాండ్ ఖైదీ పరార్

**జగిత్యాల,మే 28(సమయజ్యోతి):**

పోలీసులను ఓ రిమాండ్ ఖైదీ బురడీ కొట్టించాడు. కోర్టు ఆవరణలో కుటుంబసభ్యులతో మాట్లాడుతూనే.. పోలీసుల కండ్లుగప్పి పరారయ్యాడు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలో చోటు చేసుకుంది. పరారీలో ఉన్న నిందితుడు కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబసభ్యులను వివరాలు అడిగి పలు ప్రాంతాల్లో వెతుకుతున్నారు. కస్టడీ నుంచి ఖైదీ తప్పించుకోవడం జగిత్యాల జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. జగిత్యాల సబ్ జైలులో పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన జున్ను ప్రసాద్ రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. గల్ఫ్ పంపిస్తానని మోసం చేసిన కేసుల్లో అరెస్ట్ అయి జగిత్యాల సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఇటీవలే అతడిపై కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. జగిత్యాల సబ్ జైలులో ఉన్న ప్రసాద్‌ను విచారణలో భాగంగా మంగళవారం కొడిమ్యాల పోలీసులు పీటీ- వారెంట్‌తో తీసుకెల్లి జగిత్యాల కోర్టులో హాజరుపర్చారు. కేసు పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడు ప్రసాద్‌కు రిమాండ్ విధించారు.

# సరిహద్దు రాష్ట్రాల్లో నేడు మాక్ డ్రిల్స్

### హర్యానాలో రాత్రికి బ్లాక్ అవుట్

**న్యూఢిల్లీ,మే 28(సమయజ్యోతి):**

సరిహద్దు రాష్ట్రాల్లో మరోమారు గురువారం మాక్ డ్రిల్స్ నిర్వహించ బోతున్నారు. పాక్‌తో యుద్ధం ఆగినా.. రెండు దేశాల మధ్య పరిస్థితులు మాత్రం నివురుగప్పిన నిప్పులాగే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే మాక్ డ్రిల్స్ మళ్లీ మొదలవ్వనున్నాయి. గురువారం పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న నాలుగు రాష్ట్రాల్లో మాక్ డ్రిల్స్ జరగనున్నాయి. గుజరాత్, రాజస్థాన్, పంజాబ్, జమ్మూకాశ్మీర్‌లలో అధికారులు సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నారు. హర్యానా ప్రభుత్వం కూడా రాష్ట్ర వ్యాప్తంగా ' ఆపరేషన్ షీల్డ్' పేరిట మాక్ డ్రిల్స్ నిర్వహించనుంది. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి మాక్ డ్రిల్ మొదలవుతుంది. మొత్తం 22 జిల్లాల్లో అధికారులు మాక్ డ్రిల్స్ నిర్వహించ నున్నారు. ఎమర్జెన్సీ పరిస్థితులకు సిద్ధంగా ఉండటం కోసం ఈ మాక్ డ్రిల్స్ జరగనున్నాయి. హర్యానాలోని కీలక ప్రాంతాల్లో రాత్రి 8 గంటల సమయంలో 15 నిమిషాల పాటు- బ్లాక్ అవుట్ ఉండనుంది. విద్యుత్ సరఫరా పూర్తి స్థాయిలో నిలిచిపోనుంది. అయితే, హాస్పిటల్స్, ఫైర్ స్టేషన్స్, పోలీస్ స్టేషన్స్‌కు ఇందులో మినహాయింపు ఉంది.పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదులకు, వారికి సాయం చేస్తున్న పాకిస్తాన్‌కు సరైన విధంగా బుద్ధి చెప్పడానికి భారత ప్రభుత్వం సిద్ధమైంది. భారత ప్రజలకు యుద్ధం జరగొచ్చంటూ హింట్ ఇచ్చేసింది. ఈ నేపథ్యంలోనే దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్స్ నిర్వహించింది. ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల ఏరివేత మొదలెట్టింది. మే 7వ తేదీన పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై ఎయిర్‌ఫోర్స్ దాడులు చేసింది. దాదాపు 100 మందికిపైగా ఉగ్రవాదులు చనిపోయారు. ఉగ్రవాదుల్ని చంపటంతో పాకిస్తాన్ తట్టు-కోలేకపోయింది. యుద్ధానికి కాలు దువ్వింది. 3 రోజుల పాటు- యుద్ధం జరిగింది. రెండు దేశాల మధ్య జరిగిన ఈ యుద్ధంలో పాక్ దారుణంగా దెబ్బతింది. చివరకు కాళ్ల బేరానికి వచ్చింది.

# లిఫ్టులో ఇరుక్కున్న కుమారుడు

### తట్టుకోలేక గుండెపోటుతో తండ్రి మృతి

**భోపాల్,మే 28(సమయజ్యోతి):**

మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో దారుణ సంఘటన చోటు చేసుకుంది. కుమారుడు లిఫ్ట్‌లోఇరుక్కుపోవడంతో తనని కాపాడుకోలేననే భయంతో తండ్రి గుండెపోటుతో మృతి చెందారు. భోపాల్‌లోని జత్కేడి ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో రిషిరాజ్ భట్నాగర్(51) తన భార్య, పిల్లలతో నివసిస్తున్నారు. సోమవారం కుమారుడిని వెతుక్కుంటూ కిందకు వచ్చారు. కుమారుడు కనిపించడంతో అతన్ని ఇంటికి వెళ్లమని సూచించగా.. ఎనిమిదేళ్ల పిల్లాడు లిఫ్ట్(ం÷బిష) ఎక్కాడు. వెంటనే పవర్‌కట్ కావడంతో లిఫ్ట్‌లో ఆ పిల్లాడు ఇరుక్కుపోయాడు. దీంతో రిషిరాజ్ తీవ్ర ఆందోళనకు గురి కావడంతో అయనకు గుండెపోటు వచ్చింది. కొన్ని నిమిషాల్లో పవర్ రావడంతో పిల్లాడు సురక్షితంగా బయటకు వచ్చాడు. అయితే అప్పటికే పడిపోయిన రిషిరాజ్‌ను అపార్ట్‌మెంట్ వాసులు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రిషిరాజ్‌ను పరీక్షించిన వైద్యులు ఆయన మృతి చెందినట్లు- నిర్ధారించారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

# వివాహేతర సంబంధంతో ఆత్మహత్య

**గద్వాల,మే 28(సమయజ్యోతి):**

వివాహేతర సంబంధం ఆత్మహత్యకు దారితీసింది. ఈ కారణంగా ఒకరు ఆత్మహత్య చేసుకోగా, మరొకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న సంఘటన జోగులాంబ గద్వాల్ జిల్లా రాజోలిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలికి చెందిన మహిళ (32)కు భర్త, కుమార్తె ఉన్నారు. ఇదే గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పుల్లన్నతో మహిళకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ నెల 12న ఇద్దరూ గ్రామం విడిచి వెళ్లిపోయారు. ఈ ఘటనపై అప్పట్లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది.కుమార్తెను చూడాలనిపించి మహిళ.. ఈనెల 25న గ్రామానికి వచ్చి ఇష్టపూర్వకంగానే అతనితో వెళ్లినట్లు- పోలీసుల ఎదుట చెప్పింది. దీంతో ఇద్దరినీ పోలీసులు ఇళ్లకు పంపించారు. ఈ క్రమంలో రెండు కుటుంబాల మధ్య గొడవలు జరగడంతో 27న పుల్లన్న ఎలుకల మందు తాగడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

## జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు
### - కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**



జిల్లాలో యాసంగి సీజన్ కు సంబంధించి దాన్యం కొనుగోలు రికార్డు స్థాయిలో కొనసాగుతున్నాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో యాసంగి సీజన్ వద్ల సేకరణ కోసం మొత్తం 242 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ నెల 28-5-2025 వరకు జిల్లాలోని 37,223 మంది రైతుల నుంచి రూ.578 కోట్ల విలువైన 2,49,372మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. వీటిలో 2,16,258 మెట్రిక్ టన్నుల ధాన్యం వివరాలు ఆన్లైన్ చేశామని, 34,479 మంది రైతుల ఖాతాలో 447 కోట్ల రూపాయలు జమ అయ్యాయని వెల్లడించారు. మిగతా రైతుల బ్యాంకు ఖాతాలో త్వరలో డబ్బులు జమ కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. ధాన్యం సేకరణ తుది దశకు వచ్చిందని, జిల్లాలోని 133 కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు వెల్లడించారు. చివరి గింజ వరకు దాన్యం సేకరిస్తామని స్పష్టం చేశారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. తడిసిన ధాన్యం సైతం సేకరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.గత మూడు రబీ సీజన్ లలో ధాన్యం సేకరణ వివరాలురబీ సీజన్ (2022- 2023) 28-05-2023 రోజు వరకు జిల్లాలో 1,64,044 మెట్రిక్ టన్నుల ధాన్యం..

రబీ సీజన్ (2023- 2024) 28-05-2024 రోజు వరకు 2,49,514 మెట్రిక్ టన్నుల ధాన్యం..

ఈ రబీ సీజన్ (2024- 2025) 28- 05-2025 ఈ రోజు వరకు 2,49,372 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు వెల్లడించారు.

## కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ
### - పంపిణీలో పాల్గొన్న మక్తల్ శాసనసభ్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణపేట జిల్లా**

మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. అలాగే మండలంలోని 46 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది,ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది,మండల అధ్యక్షుడు రాజప్ప గౌడ, మండల యువజన అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్,కాంగ్రెస్ నాయకులు పల్లె సురేష్, సంతోష్ పాటిల్,విజప్ప గౌడ, విజయ్ గౌడ్, లింగప్ప, నారాయణ, లక్ష్మి నారాయణ, షేకప్ప గౌడ, సిద్రామ్,నల్లే నర్సప్ప తదితరులు పాల్గొన్నారు.



## మహిళా జీవనశైలిపై అవగాహన సదస్సు

**సమయజ్యోతి యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 28**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూరు మండలం సర్వేపల్లి గ్రామంలో బోస్కో సేవ కేంద్రం వారి సహకారంతో మహిళా జీవనశైలి ఆరోగ్యం పోషక ఆహారం మహిళాభివృద్ధి మహిళా సంక్షేమం కుటుంబ సంక్షేమంపై నీడ్స్ స్వచ్ఛంద సంస్థ,విలీడ్ సముక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్వేపల్లి గ్రామం మహిళలు ఎస్ హెచ్ జి లీడర్స్ అంగన్వాడీ టీచర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వెలీడ్ తెలంగాణ కోఆర్డినేటర్ జి మల్లేశ్వరి నీడ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కానుగంటి శ్రీశైలం కౌకుంట్ల మధుసూదన్ రెడ్డి,వి బి.కె లావణ్య, అంగన్వాడి టీచర్ పి. అండాలు, కే.చంద్రకళ, అరుణ,రంగమ్మ,లక్ష్మమ్మ,ఉప్పలమ్మ,మంజుల,ప్రీతి,లావణ్య,లక్ష్మి,శారద తదితరులు పాల్గొన్నారు.




## ఎఐ టెక్నాలజీతో ఎన్టీఆర్ ప్రసంగం
### మహానాడులో
### ఆకట్టుకున్న ప్రయోగం

**కడప,మే 28(సమయజ్యోతి):**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 102వ జయంతిని పురస్కరించుకుని .... రెండో రోజు కడపలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ మహానాడు వేదికపై ఎఐ ఎన్టిఆర్ ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసిన పథకాలు, సాధించిన అభివృద్ధి గురించి ఎఐ ఎన్టిఆర్ మాట్లాడారు. తాను ప్రారంభించిన పథకాలను గుర్తుచేస్తూ, చంద్రబాబు నాయకత్వంలో రూపుదిద్దుకున్న ప్రస్తుత సంక్షేమ పథకాలపై ప్రశంసలు కురిపించారు. ఈ ఎఐ ప్రసంగంతో ఎన్టిఆర్ అభిమానులు, మహానాడుకు హాజరైన ప్రతినిధులు, కార్యకర్తలు మరింత ఉత్తేజంగా మారారు.

# ఆఫ్రికన్ ప్రతినిధులను ఆకట్టుకున్న భూదాన్ పోచంపల్లి

**సమయజ్యోతి యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 28**

యాదాద్రి భువనగిరి జిల్లా సాంస్కృతిక వారసత్వం, ఇక్కత్ చీరల నేతకు ప్రపంచ ప్రసిద్ధి చెందిన భూదాన్ పోచంపల్లి గ్రామ చేనేత పార్క్ ఈసారి ఆఫ్రికన్ డెలిగేట్ మన్ననలు పొందింది.

కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో5 రోజుల పర్యటన లో భాగంగా బుధవారం ఆఫ్రికా ఖండంలో 15 మధ్య,పశ్చిమ ఆఫ్రికన్ దేశాలకు చెందిన 30 మంది సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్ లు పోచంపల్లి విలేజ్ పార్క్ ను సందర్శించి, స్థానిక సంస్కృతి,కళలతో,మ్యూజిక్ తో మమేకమయ్యారు.

ప్రత్యేకమైన ఇక్కత్ చీరల తయారీ విధానాన్ని స్థానిక పార్కులో.పరిశీలించిన అతిథులు, నూలు వడకడం నుంచి రంగులు చొప్పించే క్లిష్టమైన ప్రక్రియలను చూసి ఆశ్చర్యచకితులయ్యారు. "ఒక్క చీరకు వారాలు తీసుకునే శ్రమ, డిజైన్ల సృజనాత్మకత కంటెస్టెంట్ లను మనస్సును హత్తుకుంది. చీరలపై భిన్న డిజైన్లను గమనించిన అతిథులు, కొందరు స్వయంగా రాట్నంతో నూలు వడికే ప్రయత్నం చేశారు.

అనంతరం గ్రామంలో చీరల తయారీని పరిశీలించారు. కొంతమంది చీరల షాపింగ్ చేశారు.అనంతరం రామోజీ ఫిలిం సిటీ నీ సందర్శించారు.ఆఫ్రికన్ కంటెంట్ క్రియేటర్ ల హైదరాబాద్ పర్యటన కార్యక్రమాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సమన్వయం చేస్తుంది.

దక్షిణాఫ్రికాకు ప్రాతినిధ్యం.దక్షిణాది మూలాలు%-% శతాబ్దాలు గడిచిన మూలాలు మరువని యోవానీ నాయుడు

%-% పర్యటనలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న దక్షిణాఫ్రికా కంటెంట్ క్రియేటర్ యోవానీ నాయుడు యోవానీ నాయుడు అనే యువతి కంటెంట్ క్రియేటర్ గా దక్షిణాఫ్రికా దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. భారతదేశ పర్యటన లో భాగంగా హైదరాబాద్ వచ్చారు.పేరులోనే కాదు.ముఖ కవళికల్లో అచ్చు తెలుగుదనం,భారతీయత ఉట్టిపడుతుంది.యువతి తండ్రి తెలుగు వ్యక్తి కాగా తల్లి తమిళనాడు.వారి పూర్వీకులు శతాబ్దాల క్రితం దక్షిణాఫ్రికా వలస వెళ్ళారు.దక్షిణాఫ్రికా దేశంలోని దర్బన్ నివాసి.తాను ఆరో తరానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.తెలుగు,తమిళనాడు భాషలు రాకున్నా సంస్కృతి , సంప్రదాలయకు దూరం కాలేదు.కట్టు బొట్టు,సంప్రదాయ దుస్తుల్లో ఉంటూ .స్థానిక భారతీయ రాలు లాగే కనిపిస్తుంది.నాయుడు సైంటిస్ట్ గా పని చేస్తున్న వెస్టన్,ట్రెడిషన్ సంగీతాన్ని మేళవిస్తూ మ్యూజిక్, కల్చర్, లాంగ్వేజ్ ను ప్రమోటింగ్ చేస్తుంది.భౌతికంగా భారత్ కు దూరమైన మానసికంగా ఎప్పటికీ దగ్గరగానే ఉన్నామని చెబుతుంది.తల్లిదండ్రులు అందరూ అకౌంటెంట్ లు.వారి ప్రోత్సాహం తో 5 సంవత్సరాల నుంచే తనకు సంగీతంపై మక్కువ కలిగిందన్నారు. శ్రేయా ఘోషల్,కె ఎస్.చిత్ర, అనిరుధ్,రహమాన్ లు తనకు ఇష్టమన్నారు.తెలుగు పాటలు చక్కగా పాడే

యోవానీ నాయుడు.టాలీవుడ్, కోలీ వుడ్ లకు గ్రేట్ ఫ్యాన్ అంటూ దక్షిణాఫ్రికా కు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందన్నారు.ఆఫ్రికన్ ప్రతినిధుల సందర్శన కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో.శేఖర్ రెడ్డి,సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మామిండ్ల దశరథం, జిల్లా పౌర సంబంధాల అధికారి శ్రీనివాస్, స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







## మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థిక సహాయం

**నాగర్ కర్నూల్,మే 28, సమయజ్యోతి**

రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో ఐదు రోజుల క్రితం లకుమల్ల దుర్గమ్మ చనిపోయిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకురి ప్రభాకర్ రెడ్డి గారు మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ స్థానిక నాయకుల ద్వారా కుటుంబానికి 3000-00 ఆర్థిక సాహయం అందించారు. మూడు రోజుల క్రితం చనిపోయిన కల్వకోలు నారాయణ కూతురు కల్వకోలు కవిత అనారోగ్యంతో చనిపోవడం జరిగింది విషయం స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి గారు మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ స్థానిక నాయకుల ద్వారా 3000-00 వేల రూపాయలు ఆర్థిక అందించారు,%a% మరియు గ్రామ మాజీ ఉపసర్పంచ్ అజీజ్ 1000-00 ఆర్థిక సాహయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లి కేడి అంబాజీ, మాజీ ఉపసర్పంచ్ అజీజ్, మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎం.డి ఆరిఫ్, నాయకులు ఏ రవీందర్ గౌడ్,వద్దే రాజు, లకుమల్ల మల్లేష్, చింతకాయల లక్ష్మణ్, కే మల్లేష్, కే శ్రీశైలం, ఎం.డి. అంజాత్, మిడత రమేష్, పులిజాల విష్ణు, పురం వేణు, కే జంగయ్య, ఎండి ముజ్జు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



## సుగుణక్క సోషల్ మీడియా కోఆర్డినేటర్ కుమారుడి జన్మదిన వేడుకల్లో ఆత్రం సుగుణక్క దంపతులు

**జన్నారం 28 మే( సమయజ్యోతి )**

సుగుణక్క సోషల్ మీడియా కోఆర్డినేటర్ సంతోష్ జాదవ్ కుమారుడి జన్మదిన వేడుకలు ఉట్నూర్ మండల కేంద్రంలోని సుగుణక్క క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా జన్మదినం జరుపుకుంటున్న నాగచైతన్య జాదవ్ తో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క దంపతులు కేక్ కట్ చేపించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో అభిషేక్,గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పథకం స్వచ్ఛ భారత్ మిషన్ పై
### - పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ సృజన
### వీడియో కాన్ఫరెన్స్

**సమయజ్యోతి యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మే 28**

యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధి హామీ పథకం స్వచ్ఛ భారత్ మిషన్ పై కార్యక్రమాల అమలుపై పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ సృజన,వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.సమీక్షలో ముఖ్యంగా పరిగణనలోకి తీసుకున్న అంశాలు : ఉపాధి హామీ పథకంలో సగటు వేతనాలు,సమయానికి వేతనాల చెల్లింపు పరిస్థితులు ఇప్పటికే ప్రారంభమైన పనుల పురోగతి,వాటి పూర్తీకరణ సామాజిక తనిఖీ నివేదికల సమర్పణ ఉపాధి హామీ పథకం క్రింద నూతనంగా నిర్మించాల్సిన గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాల పనుల గుర్తింపు ప్రక్రియ మొదలగు వాటిపై సమీక్ష నిర్వహించినారు.ఈ సమీక్షలో జిల్లా పరిషత్ సీఈఓ,శోభారాణి,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డి,జిల్లా పంచాయతీ అధికారి సునంద, పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





## గిరిజనులే తొలి స్వాతంత్ర్య సమరయోధులు పుస్తకావిష్కరణ 30న

**హైదరాబాద్: సమయజ్యోతి**

దేశ స్వాతంత్ర్యం కోసం నిరంతరం పోరాడిన గిరిజనుల చరిత్రను క్రోడీకరిస్తూ ప్రచురించిన 'గిరిజనులే తొలిస్వాతంత్ర్య సమరయోధులు' అనే పుస్తకాన్ని ఈ నెల 30న (శుక్రవారం) సాయంత్రం ఆవిష్కరించనున్నట్లు తెలంగాణ వనవాసీ కళ్యాణ పరిషత్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. హైదరాబాద్ శివార్లలోని నాదర్‌గుల్ అశోక్‌నగర్‌లో కాలనీలోని వైదేహి కౌశలంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, ఏపీ ప్రభుత్వ మాజీ కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌లు విశిష్ట అతిథులుగా పాల్గొంటారని తెలిపింది. అఖిల భారత కళ్యాణ ఆశ్రమ ప్రశిక్షణ జట్టు సదస్యులు కొరిగింజ రామచంద్రయ్య పుస్తకాన్ని పరిచయం చేస్తారని వెల్లడించింది. వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి నిర్వహిస్తున్న ఏకోపాధ్యాయ పాఠశాలల ఆచార్యుల శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఈ పుస్తకావిష్కరణ జరుగుతుందని పేర్కొంది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వనవాసీ కళ్యాణ పరిషత్ కోరింది.

# రాజకీయ,సినీ రంగాల్లో రాణించిన ఏకైక నేత

## ఎన్టీఆర్‌కు నివాళితో రెండోరోజు మహానాడు ప్రారంభం

## వేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు పుష్పాంజలి

కడప,మే28(సమయజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు నివాళితో టీడీపీ మహానాడు రెండవ రోజు ప్రారంభమైంది. స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మహానాడు వేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ముఖ్యనేతలు నివాళులర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. మహానాడు తొలిరోజు కీలక అంశాలపై చర్చించుకున్నా మన్నారు. పార్టీ బలోపేతం, ప్రజలకు మేలు చేసేలా చర్చలు జరిగాయన్నారు. తెలుగుజాతి ఆరాధించే మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ జయంతి అంటే తెలుగుజాతికి పండగ రోజు అని అన్నారు. ఒకే వ్యక్తి రెండు రంగాల్లో రారాజుగా రాణించడం చరిత్రలో చూడలేదన్నారు. ఎన్టీఆర్ అంటే పేదవాడికి భరోసా.. రైతులకు నేస్తం అని వెల్లడించారు. ఎన్టీఆర్ రూపొందించిన పసుపు జెండా శాశ్వతంగా ఉంటుందని స్పష్టం చేశారు. 2024 ప్రజల తీర్పుతో విధ్వంసం నుంచి అభివృద్ధి వైపు వెళు న్నామని అన్నారు. పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇదిలావుంటే నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘన నివాళి అర్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. 'యుగపురుషుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, తెలుగు వారి ఆరాధ్య దైవం, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు, సంక్షేమానికి కొత్త బాట చూపిన సంఘ సంస్కర్త, 'అన్న' నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. పేద ప్రజలకు కూడు, గూడు, గుడ్డ అనే మూడు అవసరాలను తీర్చడమే తన జీవితాశయంగా భావించిన ధీరోదాత్తుడు అన్న ఎన్టీఆర్. 'సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు' అనే నినాదంతో ప్రజాస్వామ్యానికి కొత్త అర్థం చెప్పిన దార్శనికుడు ఆయన. అన్నగా ఆడబిడ్డలకు ఆస్తి హక్కు ఇచ్చినా, మండల వ్యవస్థతో పాలనారంగాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లినా, పక్కా ఇళ్ల నిర్మాణంతో పేదలకు అండగా నిలిచినా, కిలో రెండు రూపాయలకే బియ్యాన్ని అందించి పేదల ఆకలి తీర్చినా ... ఏది చేసినా ఆయన మనసులో ఉన్నది ఒక్కటే... 'నా తెలుగు జాతి సగౌరవంగా తలెత్తుకు నిలబడాలి' అనే




సంకల్పమే. చరిత్రలో స్థానం సంపాదించుకోవడం కాదు... చరిత్రనే సృష్టించిన చిరస్మరణీయుడు అన్న ఎన్టీఆర్. ఈనాటికీ తెలుగుదేశం ఉజ్వలంగా ప్రకాశిస్తున్నదంటే అది ఆయన ఆశీర్వాదబలమే. ఆ మహనీయుడి సంకల్పాన్ని నెరవేర్చేందుకు అహర్నిశలూ కష్టపడుతూనే ఉన్నాం.... సమసమాజాన్ని సాధించే దిశగా సాగుతున్నాం. అనితరసాధ్యమైన ఎన్నో పనులు చేసిన అన్న నందమూరి తారకరామారావుకు మరొక్కమారు ఘన నివాళి అర్పిస్తున్నాను.' అని చంద్రబాబు పోస్టులో పేర్కొన్నారు.

# ఎన్టీఆర్‌కు టిడిపి నేతల ఘననివాళి

## రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది ప్రత్యేక ముద్ర

## తీర్మానాన్ని ప్రవేశ పెట్టిన అశోక గజపతి

కడప,మే28(సమయజ్యోతి): సాటిలేని చరిత్ర ఎన్టీఆర్‌దని.. ఆయన నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలని తెదేపా సీనియర్ నేత అశోక్‌గజపతి రాజు అన్నారు. ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా మహానాడులో నేతలు ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రతినిధుల సభ ప్రారంభమైంది. యుగపురుషుడికి నివాళి తీర్మానాన్ని అశోక్‌గజపతిరాజు ప్రవేశపెట్టగా.. గోరంట్ల బుచ్చయ్య చౌదరి, చినరాజప్ప బలపరిచారు. ఎన్టీఆర్‌తో కలిసి రాజకీయ ప్రయాణం నా అదృష్టం. తెలుగు జాతి ఉన్నంత వరకు తెదేపా కొనసాగుతూనే ఉంటుంది. ఎన్నో ఒడుదొడుకులు ఎదురైనా చంద్రబాబు భయపడలేదు. తెదేపా కుటుంబ పెద్దగా చంద్రబాబు నాయకత్వాన్ని ముందుకు తీసుకువెళ్లాలని అశోక్‌గజపతి రాజు అన్నారు.
తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని మహోన్నత శిఖరంపై నిలబెట్టిన వ్యక్తి ఎన్టీఆర్. తెలుగు జాతి చరిత్రను తిరగరాసి వెలుగులు నింపిన మహనీయుడు ఆయన అని మంత్రి పయ్యావుల కేశవ్ నివాళి అర్పించారు. సినీ రంగంలో రారాజుగా విరజిల్లుతూ రాజకీయాల్లో తనకంటూ ఓ ముద్ర వేసుకున్న వ్యక్తి ఎన్టీఆర్ అని మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు అన్నారు. పేదవాడి ఆకలి తీర్చడానికి కృషి చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఈ మేరకు దివంగత నేతకు ఆయన నివాళి అర్పించారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ ఆదర్శ నేత అని ఆయన ఎప్పుడూ పేదల సంక్షేమం కోసం తపించారని అన్నారు. అలాంటి ఆశయాలను నాయకులు కొనసాగించాలన్నారు. తెలుగుజాతికి ఇవాళ పర్వదినమని అన్నారు. రైతు కుటుంబంలో పుట్టి ఎన్టీఆర్ అసాధారణ ప్రతిభ చూపారని కొనియడారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలల్లోనే అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత ఆయనదేనన్నారు. బడుగు, బలహీనవర్గాలు, మహిళల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ కృషి చేశారన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలన్నారు. కొందరికే పరిమితమైన అధికారాన్ని సామాన్యుల వద్దకు తీసుకువచ్చారన్నారు. తెలుగు జాతికి సేవ చేయాలని సినీ రంగాన్ని విడిచి పెట్టి ఎన్టీఆర్ రాజకీయంలోకి వచ్చారనిమంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సినీ రంగంలో తెలుగు జాతికి ఎన్టీఆర్ మంచి పేరు తెచ్చారని అచ్చెన్నాయుడు అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా అచ్చెన్నాయుడు, పలువురు టీడీపీ నేతలు నివాళర్పించారు. అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాజకీయలోకి వచ్చిన తర్వాత ప్రజల్లో చైతన్యం తెచ్చారని తెలిపారు. ఆనాడు జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలను ఏకం చేసి పోరాటం చేసిన ఘనత ఎన్టీఆర్‌దని గుర్తుచేశారు.బడుగు బలహీన వర్గాలకు అవకాశం ఇచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్ అని వెల్లడించారు. వెనుకబడిన, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ కృషి చేశారని కొనియాడారు. వికేంద్రీకరణ, ఫెడరల్ వ్యవస్థ బలోపేతం కోసం పనిచేశారన్నారు. నేషనల్ ఫ్రంట్‌తో కేంద్రంలో ప్రత్యామ్నాయం తీసుకువచ్చారన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు ఎన్టీఆర్ పెద్దపీట వేశారని, కిలో బియ్యం రూ.2కే ఇచ్చారని కొనియాడారు. రైతు రుణాలు రద్దు, రూ.50కే హార్స్ పవర్ కరెంట్ అందజేసిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు.



# ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ నివాళి

## ఘాట్ వద్ద పలువురు శ్రద్ధాంజలి

హైదరాబాద్,మే28(సమయజ్యోతి): ఎన్టీఆర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్‌లు నివాళి అర్పించారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను వారు గుర్తుచేసుకున్నారు. ప్రముఖుల రాక సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు- చేశారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద నందమూరి రామకృష్ణ, సినీ దర్శకుడు వైవీఎస్ చౌదరి నివాళి అర్పించారు. నందమూరి అభిమానులు, తెదేపా నేతలు అక్కడికి తరలివచ్చారు. తండ్రికి నివాళి సందర్భంగా తనయుడు రామకృష్ణ ఉద్వేగానికి లోనయ్యారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు శత జయంతి పురస్కరించుకుని పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్ వద్ద మాజీ టిడిపి నేతలు శ్రద్ధాంజలి ఘటించారు. ప్రపంచ ఖ్యాతి గడించిన ఏకైక తెలుగు బిడ్డ ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చేలా కృషి చేస్తామన్నారు. రాజకీయాల్లో, సినిమాల్లో ఆయనకు తారాస్థాయిలో అభిమానులున్నారు. మరోవైపు ఎన్టీఆర్ జయంతి వేళ ఆయన అభిమానులు,



తెదేపా కార్యకర్తలు ఎన్టీఆర్ ఘాట్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఆయన సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఎన్టీఆర్ అంటే ఓ ప్రభంజనం అని.. ఆయనో సంచలనం అని అన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలుగు దేశం పార్టీ స్థాపించి దేశ రాజకీయాల్లో తెలుగు వారి సత్తా చాటిన రాజకీయ యోధుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. తెలుగు జాతి చరిత్ర ఉన్నంత కాలం ఎన్టీఆర్ చరిత్ర నిలిచిపోతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

# ఎపిలో పెరుగుతున్న కరోనా కేసులు

## మరో ఇద్దరికి పాజిటివ్‌గా గుర్తింపు

విజయవాడ,మే28(సమయజ్యోతి): కరోనా వైరస్ మరోసారి కలవరపెడుతోంది.. ప్రపంచవ్యాప్తంగా విజృంభించి.. ఎన్నో లక్షలమంది ప్రాణాలు తీసిన ఈ వైరస్.. మరోసారి విరుచుకుపడుతోంది.. అయితే ఈ కొత్త వేరియంట్ డేంజర్కాదని వైద్యులు అంటున్నా, జాగ్రత్తగా ఉండాల్సిందేనని సూచిస్తున్నారు. దేశవ్యాప్తంగా క్రమంగా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది.. ఇప్పటికే పాజిటివ్ కేసుల సంఖ్య వెయ్యి దాటిపోయినట్టు- అధికారిక లెక్కలే చెబుతున్నాయి.. అయతే, ఏపీలోనూ కోవిడ్ 19 కేసులు వెలుగు చూస్తున్నాయి.. రాష్ట్రంలో తాజాగా, మరో మూడు కరోనా పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రిలో పరీక్షల అనంతరం ఏలూరుకు చెందిన భార్యాభర్తలకు కరోనా సోకినట్లుగా తేల్చారు వైద్యులు.. మరోవైపు, తెనాలికి చెందిన 83 ఏళ్ల వృద్ధుడు కరోనా బారినపడ్డారు. వృద్ధుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఇద్దరికి కరోనా నిర్ధారణ కాగా, దేశవ్యాప్తంగా కేసులు వెయ్యి దాటినట్టు- అధికారులు వెల్లడించారు. అయితే, కరోనా బారినపడకుండా.. ప్రజలు తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు వైద్యులు..

# బంగాళాఖతంలో బలపడిన అల్పపీడనం

విశాఖపట్నం,మే28(సమయజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడిందని వాతావరణ శాఖ తెలిపింది. ఏపీలో పూర్తిగా నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడింది. ఇది ఉత్తర దిశగా కదులుతూ రాబోయే 24 గంటల్లో వాయుగుండంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. దీని ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో ఉత్తర కోస్తాలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. ఈ నెల 26న మహబూబ్‌నగర్‌లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఇవి ఆదిలాబాద్ వరకు విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# ఎన్టీఆర్‌ది అజరామర చరిత్ర

## నివాళి అర్పించిన పవన్ కళ్యాణ్

అమరావతి,మే28(సమయజ్యోతి): దివంగత స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్టీఆర్ చరిత్ర అజరామరం అని అన్నారు. త్రికరణ శుద్ధితో చేసే ఏ కార్యమైనా సత్ఫలాన్ని ఇస్తుందని తాను విశ్వసిస్తానని.. అటువంటి త్రికరణ శుద్ధితో కార్యాచరణ చేసిన వ్యక్తి స్వర్గీయ నందమూరి తారకరామారావు అని అన్నారు. మనసు, మాట, కర్మ మూడు అంశాలు సమన్వయం చేసుకొంటూ పని చేయడం ఆయనలో తాను గమనించానని, అందుకే వేషం వేసినా, రాజకీయం ఆచరించినా, ప్రజాసేవ చేసినా ఎన్టీఆర్ సత్ఫలితాలను సాధించారని కొనియాడారు. నటుడిగా, రాజకీయ నేతగా, పరిపాలనాదక్షునిగా.. చరిత్ర పుటలు నుంచి చెరిపివేయలేని చరిత్ర ఆయనదని.. ఈరోజు ఆ మహామనిషి, కళా ఋషి జయంతి సందర్భంగా ఆయనకు పుష్పాంజలి అర్పిస్తున్నానని పవన్ కళ్యాణ్ అన్నారు.

# ఒత్తడి అధిగమించాలంటే యోగా తప్పనిసరి

## ఎందరో వచ్చి నేర్చుకుని వెళుతున్నారు

## విశాఖలో అంతర్జాతీయ యోగా నిర్వహణ

## యోగాపై మంచి పాటరాస్తే బహుమతి ఇస్తానన్న బాబు

కడప,మే28(సమయజ్యోతి):



అభివృద్ధి చెందిన దేశాల్లోనూ యోగా వారి జీవితాల్లో భాగమైందని తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఎంతోమంది మన దేశానికి వచ్చి యోగా నేర్చుకుని తమ దేశాల్లో అమలు చేస్తున్నారని చెప్పారు. కడపలో రెండో రోజు మహానాడులో సీఎం మాట్లాడారు. ఒత్తిడిని అధిగమిం చాలంటే యోగా తప్పనిసరి. మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా నెలగా నిర్వహిస్తున్నాం. విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ నుంచి భీమునిపట్నం వరకు 25కి.మీ పరిధిలో 5 లక్షల మందితో యోగా చేయబోతున్నాం. ఒకే ప్రాంతంలో 5లక్షల మందితో ఇలా చేయడం గిన్నిస్ రికార్డు కాబోతోంది. ఆరోజు రాష్ట్రం మొత్తం 2 కోట్ల మంది యోగా చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నాం. కనీసం 20 లక్షల మంది యోగా సర్టిఫికేషన్లు తీసుకోవాలి. ఏకాగ్రత పెంచుకునేందుకు అందరూ చేయాలి. యోగాపై మంచి పాట రాస్తే బహుమతి ఇస్తాం అని చంద్రబాబు పేర్కొన్నారు. ఇకపోతే విశాఖ యోగాకు ప్రధాని మోడీ రాబోతున్నారని అన్నారు. దీనిని ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్నామని అన్నారు.

# విద్యుత్ సంస్కరణలతో ప్రజలకు మేలు

## దేశంలో సంస్కరణలు ప్రవేశ పెట్టిన ఘనత బాబుదే-మహానాడులో విద్యుత్ సంస్కరణలపై గొట్టిపాటి తీర్మానం

కడప,మే28(సమయజ్యోతి): దేశంలో మొట్టమొదటి సారిగా విద్యుత్ సంస్కరణలు అమలు చేసింది సీఎం చంద్రబాబు అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులపై మహానాడులో మంత్రి గొట్టిపాటి తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1998లో విద్యుత్ రంగ సంస్కరణలను ప్రవేశ పెట్టిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ యే.. ఏపీను మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన నేత కూడా చంద్రబాబేనని పేర్కొన్నారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేశాడని ఆరోపించారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలు పెంచలేదు.. కానీ, వైసీపీ హాయాంలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని అన్నారు. అయితే, పారిశ్రామికవేత్తలను రాష్ట్రం నుంచి తరిమికొట్టిన చరిత్ర హీనుడు జగన్ మోహన్ రెడ్డి అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించాడు. తన అనుయాయులను దోచిపెట్టి విద్యుత్ రంగంపై రూ.1.29 లక్ష కోట్లు-భారం మోపిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి.. 17 మంది సీఎంలు రూ. 20 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రంగా మార్చితే.. అందులో 15 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఘనత చంద్రబాబుదే అన్నారు. ప్రధాన మంత్రి కార్యక్రమంలో పెట్టుబడిదారులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి ఆకట్టుకున్న ఒకే నాయకుడు చంద్రబాబు.. 72 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా మా ప్రభుత్వం పని చేస్తుంది.. రైతులకు పగటి పూటే నాణ్యమైన ఉచిత విద్యుత్ ను మా ప్రభుత్వం అందిస్తుందని చెప్పుకొచ్చారు.

# కొన్ని రోజులు క్రికెట్ గురించి ఆలోచించడం మానేస్తా

## లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్



లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ ఈ సీజన్?లో పెద్దగా ఆకట్టుకోలేదు. తాజాగా బెంగళూరుతో మ్యాచ్?లో సెంచరీ మినహా, పంత్? చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్? ఆడలేదు. భారీ అంచనాలతో దిగిన పంత్ 14 మ్యాచ్?ల్లో 24.45 సగటుతో కేవలం 269 పరుగులే చేసి, అభిమానులను తీవ్ర నిరాశ పర్చాడు. ఇక లఖ్?నవూ మ్యాచ్?లు ముగిశాయి. వచ్చే నెలలో టీమ్ఇండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ నేపథ్యంలో రిషభ్ పంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.కొన్ని రోజులు క్రికెట్ గురించి ఆలోచించడం మానేస్తానని అన్నాడు. కాస్త బ్రేక్ తీసుకొని, ఇంగ్లాండ్?తో ఐదు టెస్టుల సిరీస్? కోసం మళ్లీ ప్రాక్టీస్ మొదలు పెడతానని చెప్పాడు. కాగా, ఈ సిరీస్?కు బీసీసీఐ ఇటీవల భారత జట్టును ప్రకటించింది. ఈ జట్టుకు శుభ్?మన్ గిల్ కెప్టెన్?, పంత్ వైస్ కెప్టెన్?గా ఎంపికయ్యాడు. ఈ సిరీస్ జూన్ 13 నుంచి ఆగస్టు 04 వరకు జరగనుంది.'ఐపీఎల్ టోర్నీ త్వరలోనే ముగుస్తుంది. ఆ తర్వాత టీమ్ఇండియా, ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నేను కొన్ని రోజులు క్రికెట్ గురించి ఆలోచించను. ఆ తర్వాత ఇంగ్లాండ్ టెస్టు సిరీస్?కు ప్రిపేర్ అవుతాను. ప్రతి మ్యాచ్‌లోనూ బాగా ఆడాలనే అనుకుంటాను. కానీ, అన్నిసార్లు మనం అనుకున్నట్లు జరగదు. బెంగళూరుతో మ్యాచ్‌లో నాకు మంచి ప్రారంభం దక్కింది. దీన్ని భారీ ఇన్నింగ్స్?గా మార్చాలి అనుకున్నా. నేను ఇప్పటికీ ఉత్తమ ప్లేయర్ల నుంచి నేర్చుకుంటూనే ఉంటున్నాను' అని పంత్ ఆర్సీబీ మ్యాచ్ అనంతరం మాట్లాడాడు.ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనున్న భారత జట్టు : శుభ్‌మన్ గిల్ (కెప్టెన్). రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్

# మనుసు గెలుచుకున్న పంత్..

ఐపీఎల్ 2025 లీగ్ దశలో చివరి మ్యాచ్ ఉత్కంఠభరితంగా ముగిసింది. లక్నోలో జితేష్ శర్మ ఆర్‌సిబిని టాప్-2కి తీసుకెళ్లాడు. 33 బంతుల్లో 85 పరుగులు చేసిన అతని ఇన్నింగ్స్ మొత్తం మ్యాచ్ గమనాన్నే మార్చేసింది. కానీ అంతకు ముందు ఒక చిన్న చిలిపి సన్నివేశం అందరి దృష్టిని ఆకర్షించింది. లక్నో సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేష్ రాఠి నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో అతనిని మన్కడ్ చేయడానికి ప్రయత్నించాడు. కానీ కెప్టెన్ రిషబ్ పంత్ తరువాత అప్పీల్‌ను ఉపసంహరించుకున్నాడు. దిగ్వేష్ రతి జితేష్ శర్మను మన్కడేట్ చేశాడు. రిషబ్ పంత్ అప్పీల్‌ను విత్ డ్రా చేసుకున్నాడు కానీ విరాట్ కోహ్లీ ఈ చర్యపై చాలా సీరియస్ అయ్యాడు. క్వాలిఫయర్ 1 చేరుకోవడానికి ఆర్‌సిబికి రికార్డు ఛేజింగ్ అవసరం. వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్, స్టాండ్-ఇన్ కెప్టెన్ జితేష్ శర్మ జట్టును ఈ లక్ష్యం వైపు నడిపించాడు. అతను పూర్తి ఫామ్‌లో ఆడుతూ ఎకానా స్టేడియంలో రన్ రేట్‌ను 10 కంటే తక్కువగా తీసుకువచ్చాడు. మ్యాచ్‌ను మలుపు తిప్పడానికి చివరి ప్రయత్నంగా, %యూ+% బౌలర్ దిగ్వేష్ రాఠి 17వ ఓవర్‌లో నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో రనౌట్‌కు ప్రయత్నించాడు. జితేష్ క్రీజు వెలుపల బాగా ఉన్నప్పుడు తన ఆట ప్రారంభమైంది. కానీ రీప్లేలలో రతి తన బౌలింగ్ యాక్షన్ పూర్తి చేసినట్లు తేలింది. కాబట్టి రనౌట్ చెల్లదు. %యూ+% కెప్టెన్ రిషబ్ పంత్ కూడా క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి అప్పీల్‌ను ఉపసంహరించుకున్నాడు. అయితే, థర్డ్ అంపైర్ నాటౌట్ నిర్ణయం తీసుకున్న తర్వాత, జితేష్ ఒక నిట్టూర్పుతో పంత్‌ను కౌగిలించుకున్నాడు. అదే సమయంలో, పెవిలియన్‌లో దిగ్వేష్ చేసిన ఈ చర్యను చూసి విరాట్ కోహ్లీ కోపంతో ఊగిపోయాడు. అతను పట్టుకున్న బాటిల్‌ను గ్లాసుపైకి విసిరేశాడు. దిగ్వేష్ రతి మన్కడ్ ప్రయత్నం క్రికెట్ క్రీడా స్ఫూర్తిపై చర్చకు దారితీసింది. అతను ఇప్పటికే %ఖూా% 2025లో ఒక మ్యాచ్ కోసం సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. అతని 'నోట్‌బుక్ సెలబ్రేషన్'పై కూడా వివాదంలో చిక్కుకున్నాడు. కెప్టెన్ రిషబ్ పంత్ అప్పీల్‌ను ఉపసంహరించుకోవడం ద్వారా క్రీడా స్ఫూర్తికి ఒక ఉదాహరణగా నిలిచాడు. ఈ మ్యాచ్ గురించి చెప్పాలంటే, టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్, కెప్టెన్ రిషబ్ పంత్ తుఫాను సెంచరీ ఇన్నింగ్స్ కారణంగా 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. పంత్ తన ఐపీఎల్ కెరీర్‌లో రెండవ సెంచరీని సాధించాడు. 61 బంతుల్లో 11 ఫోర్లు, 8 అద్భుతమైన సిక్సర్లతో అజేయంగా 118 పరుగులు చేశాడు.లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు త్వరిత ఆరంభాన్ని ఇచ్చారు. కోహ్లీ 54 పరుగులతో అర్ధ సెంచరీ చేశాడు. దీని తర్వాత, తప్పిపోయిన మన్కడ్‌ను పూర్తిగా సద్వినియోగం చేసుకుని, జితేష్ శర్మ %=జదీ%కి విజయాన్ని అందించాడు. స్టాండ్-ఇన్ కెప్టెన్ కేవలం 33 బంతుల్లో అజేయంగా 85 పరుగులు చేశాడు. జట్టు ఇంకా 8 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. ఇలా చేయడం ద్వారా అతను మ్యాచ్ ఫలితాన్ని మార్చాడు. మయాంక్ అగర్వాల్ అతనికి మంచి మద్దతు ఇచ్చి 41 పరుగులు చేశాడు. ఆర్‌సిబి ఈ లక్ష్యాన్ని 6 వికెట్లు మిగిలి ఉండగా, 8 బంతులు ముందుగానే సాధించింది.



# క్వాలిఫయర్-1లో గెలవాలంటే 2 మార్పులు చేయండి

## ఆర్సీబీ మాజీ హెడ్ కోచ్ సంజయ్ బంగర్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో లీగ్ మ్యాచ్‌లు ముగిశాయి. ప్లేఆఫ్స్ మే 29 నుంచి ప్రారంభమవుతున్నాయి. క్వాలిఫయర్-1లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు ముల్లన్‌పూర్‌లో తలపడనున్నాయి. మంగళవారం రాత్రి ఆర్సీబీ లక్నో జట్టును 6 వికెట్ల తేడాతో ఓడించి క్వాలిఫయర్-1లో తమ స్థానాన్ని సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో క్వాలిఫయర్-1కి ముందు ఆర్సీబీ వారి ప్లేయింగ్ ఎలెవన్‌లో రెండు కీలక మార్పులు చేయాలని ఆర్సీబీ మాజీ హెడ్ కోచ్ సంజయ్ బంగర్ జట్టుకు సలహా ఇచ్చారు. స్టార్ స్పోర్ట్స్‌లో జరిగిన చర్చ సందర్భంగా సంజయ్ బంగర్ మాట్లాడుతూ.. ఆర్సీబీ ప్లేయింగ్ ఎలెవన్‌లో నువాన్ తుషారాను కొనసాగించాలని సలహా ఇచ్చారు. దీనితో పాటు లియామ్ లివింగ్‌స్టోన్, రొమారియో షెపర్డ్ స్థానంలో జోష్ హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్‌లను తిరిగి తీసుకురావాలని ఆయన సిఫార్సు చేశారు. ఆర్సీబీకి వ్యతిరేకంగా బలమైన పంజాబ్ కింగ్స్ జట్టు ఉందని.. వారు ఈ సీజన్లో ఆరు లేదు ఏడు సార్లు 200 పరుగుల మార్కును దాటిందని అన్నారు. విదేశీ బ్యాటర్‌గా ఆడుతున్న లివింగ్‌స్టోన్ ఈ సీజన్‌లో పరుగులు సాధించలేకపోతున్నాడని.. కాబట్టి ఆర్సీబీ వారి బౌలింగ్ ను పూర్తిగా బలోపేతం చేసుకోవాలని సూచించాడు. ఈ కలయికను తయారు చేయవచ్చని తాను భావిస్తున్నానన్నారు.ఆర్సీబీ జట్టులోకి జోష్ హేజిల్‌వుడ్, టిమ్ డేవిడ్ లాంటి మ్యాచ్ విన్నర్ ఆటగాళ్లు క్వాలిఫయర్-1లో తిరిగి వస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. వారిద్దరు జట్టులో చేరితే ఆర్సీబీ మరింత బలంగా మారనుంది. ఐపీఎల్ 2025లో భాగంగా 70వ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు లక్నో సూపర్ జెయింట్స్ జట్టును 6 వికెట్ల తేడాతో ఓడించింది. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ ఐపీఎల్ చరిత్రలో అతిపెద్ద లక్ష్యాన్ని ఛేదించింది. దీనితో పాటు ఆర్సీబీ ప్రత్యర్థి జట్ల సొంత మైదానాల్లో 7 మ్యాచ్‌లను గెలిచిన మొదటి జట్టుగా కూడా నిలిచింది.




# టికెట్ల కోసం హెచ్‌సీఏ సెక్రటరీ బెదిరింపులు

## హెచ్ సీఏ వర్సెస్ సన్ రైజర్స్ వివాదం..


## అక్రమాలపై విజిలెన్స్ విచారణ పూర్తి

సన్ రైజర్స్ హైదరాబాద్, హెచ్ సీఏ జట్ల మధ్య జరిగిన వివాదం మరో మలుపు తిరిగింది. ఈ వివాదంపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విజిలెన్స్ విచారణలో విస్తుపోయే నిజాలు తెలిశాయి. హెచ్‌సీఏ అక్రమాలపై సంచలన విషయాలు బయటపడ్డాయని సమాచారం. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అక్రమాలపై విజిలెన్స్ విచారణ పూర్తయిందని, ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ అదనపు టికెట్ల కేటాయింపు వ్యవహారంలో విచారణ జరిగిన విషయం తెలిసిందే. హెచ్‌సీఏ సెక్రటరీ జగన్మోహన్ రావు సన్ రైజర్స్ ఫ్రాంచైజీ పై ఒత్తిడి తీసుకొని వచ్చినట్లు నిర్ధారణ అయినట్లు తెలుస్తోంది. టికెట్ల కోసం ఎస్ఆర్‌హెచ్ యజమాన్యాన్ని ఇబ్బందులకు గురిచేసినట్లు సమాచారం. నిజానికి ఇప్పటికే ప్రతి మ్యాచ్ కు సంబంధించి పది శాతం టికెట్లను ఎస్ఆర్‌హెచ్ ఫ్రీగా ఇస్తోంది. మరో 10 శాతం టికెట్లు కావాలని యాజమాన్యంపై సెక్రటరీ ఒత్తిడి తెచ్చినట్లు ఎస్ఆర్‌హెచ్ ఆరోపించింది.. ఇక నిబంధనలకు మించి ఫ్రీగా 10 శాతం టికెట్లు అదనంగా ఇచ్చే ప్రసక్తి లేదని ఎస్ఆర్‌హెచ్ యజమాన్యం తేల్చి చెప్పగా, ఓపెన్ మార్కెట్లో కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని జగన్మోహన్ రావు డిమాండ్ చేశారని తెలుస్తోంది. హెచ్‌సీఏ ద్వారా రిక్వెస్ట్ పెడితే టికెట్లు ఇచ్చేందుకు ఒప్పుకుందని తెలుస్తోంది. తనకు వ్యక్తిగతంగా 10% టికెట్లు కావాలని జగన్మోహన్ డిమాండ్ చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఎస్ఆర్‌హెచ్ టికెట్లు ఇవ్వకపోవడంతో మ్యాచ్‌ల సందర్భంగా ఫ్రాంచైజీని సెక్రటరీ.. ఇబ్బందుల గురిచేశారు . లక్నో మ్యాచ్ సందర్భంగా వీఐపీ గ్యాలరీలకు తాళాలు కూడా వేశారు. ఎస్ఆర్‌హెచ్‌ను హెచ్ సీఏ పెద్దలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నట్లుగా విజిలెన్స్ నివేదికలో నిర్ధారణ అయింది. కాగా.. హెచ్‌సీఏపై చర్యలకు విజిలెన్స్ ఆదేశించగా, తాజాగా విచారణ పూర్తయి, నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. పాసుల విషయంలో హెచ్ సీఏ ఇబ్బందులు పెడుతున్నట్లు ఫ్రాంచైజీ వర్గాలు ఆరోపణలు చేశాయి. ఇందుకు సంబంధించిన ఒక మెయిల్ కూడా బహిర్గతమైంది. అలాగే, పాసుల కోసం హెచ్?సీఏ తమను బెదిరింపులకు గురి చేసిందని %ూ=ఎ% యాజమాన్యం సంచలన ఆరోపించింది. పాసులు ఇవ్వకపోతే స్టేడియంలోని కొన్ని బాక్సులకు తాళాలు వేసి ఇబ్బందులు పెట్టారని పేర్కొంది.. ఇలాగైతే తమ వల్ల కాదని.. తాము వేరే చోటుకు వెళ్లిపోతామని హెచ్?సీఏకి సన్ రైజర్స్ హైదరాబాద్ మేనేజ్మెంట్? లేఖ రాసింది. దీంతో ప్రభుత్వం వేగంగా స్పందించి, నష్ట నివారణ చర్యలకు దిగింది. విజిలెన్స్ విచారణకు ఆదేశించగా, తాజాగా విచారణ పూర్తై, నివేదికను ప్రభుత్వానికి అందడంలో పలు విషయాలు బహిర్గతం అయ్యాయి..



# ముంబయి జట్టులోకి బెయిర్ స్టో

2025 ఐపీఎల్ ప్లేఆఫ్స్ మ్యాచ్?లపై క్లారిటీ వచ్చేసింది. క్వాలిఫయర్? 1లో పంజాబ్- ఆర్సీబీ, ఎలిమినేటర్? మ్యాచ్?లో గుజరాత్- ముంబయి తలపడనున్నాయి. నాలుగు జట్లు ఛాంపియన్?గా నిలవడమే లక్ష్యంగా ప్లేఆఫ్స్? బరిలో దిగనున్నాయి. ఈ నేపథ్యంలో ముంబయి ఇండియన్స్?కు కాస్త ఊరటనిచ్చే వార్త.ప్లేఆఫ్స్ పోరు?లో ముంబయి జట్టులో టీ20 స్టార్ ప్లేయర్ బరిలో దిగనున్నాడు. ఆల్?రౌండర్? విల్ జాక్స్? స్థానాన్ని ఇంగ్లాండ్ ప్లేయర్ బెయిర్ స్టో భర్తీ చేయనున్నాడు. ఇప్పటికే ముంబయి క్యాంప్?లో చేరిన బెయిర్ స్టో, నెట్స్?లో తీవ్రంగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ముంబయి తమ సోషల్ మీడియా అకౌంట్?లో పోస్ట్ చేసింది. మే 30న గుజరాత్?తో జరగనున్న ఎలిమినేటర్ మ్యాచ్?లో బెయిర్ స్టో బరిలో దిగడం పక్కా! ఇది ముంబయికి కలిసొచ్చే అంశం. దీంతో ముంబయి ఫ్యాన్స్? ఫుల్ ఖుషి అవుతున్నారు.సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మతో కలిసి బెయిర్ స్టో ఓపెనింగ్ చేసే ఛాన్స్ ఉంది. తొలి బంతి నుంచే హిట్టింగ్ ప్రారంభించే రోహిత్?తో బెయిర్ స్టో జతకట్టనుండడం అభిమానుల్లో అంచనాలు పెంచేస్తోంది. అటు రోహిత్- ఇటు బెయిర్ స్టో ధనాధన్ ఇన్నింగ్స్?తో జట్టుకు మంచి ఆరంభం ఇవ్వాలని ముంబయి ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. కాగా, గతేడాది జరిగిన మెగా వేలంలో బెయిర్? స్టో అన్?సోల్డ్?గా మిగిలి పోయాడు. వేలంలో అతడిని ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు. తాజాగా ఈ టోర్నీలో ఆడే ఛాన్స్ దక్కింది. విల్ జాక్స్?కు రిప్లేస్?మెంట్?గా ముంబయి బెయిర్ స్టోను తీసుకుంది. అతడు రూ. 5.25 కోట్లకు ముంబయి జట్టుతో చేరాడు.కాగా, ముల్లాన్?పుర్ వేదికగా మే 30న గుజరాత్- ముంబయి మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్?లో నెగ్గిన జట్టు క్వాలిఫయర్ 2కు అర్హత సాధిస్తుంది. ఓడిన టీమ్ టోర్నీ నుంచి ఎలిమినేట్ అవుతుంది.




# 58 మందిలో వైభవ్ సూర్యవంశీదే అగ్రస్థానం

ఐపీఎల్ 2025 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ సంచలన ప్రదర్శనతో క్రికెట్ ప్రపంచాన్ని అబ్బురపరిచాడు. కేవలం 14 ఏళ్ల వయసులో గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్‌లో అతను చేసిన శతకం ఎన్నో రికార్డులను బద్దలు కొట్టింది. ముఖ్యంగా, తన శతకంలో అతను బౌండరీల ద్వారా సాధించిన పరుగుల శాతం ప్రపంచంలోనే అత్యధికంగా నిలిచి, 58 మంది సెంచరీ హీరోల జాబితాలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. గుజరాత్ టైటాన్స్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వైభవ్ సూర్యవంశీ కేవలం 38 బంతుల్లో 101 పరుగులు (7 ఫోర్లు, 11 సిక్సర్లతో) సాధించి, ఆర్ఆర్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అతని ఈ మెరుపు ఇన్నింగ్స్‌లో 94 పరుగులు కేవలం బౌండరీల ద్వారానే రావడం విశేషం. అంటే, తన శతకంలో 93% పరుగులు బౌండరీల ద్వారానే సాధించాడు. ఇది ఐపీఎల్ చరిత్రలో ఏ బ్యాట్స్‌మెన్ సెంచరీలోనైనా బౌండరీల ద్వారా సాధించిన అత్యధిక పరుగుల శాతంగా మారింది.ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు 58 మంది బ్యాట్స్‌మెన్ సెంచరీలు సాధించారు. ఈ 58 మందిలో వైభవ్ సూర్యవంశీ తన శతకంలో అత్యధిక బౌండరీ పర్సంటేజీతో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ రికార్డును సాధించడం ద్వారా అతను తన సహచర ఆటగాడు యశస్వి జైస్వాల్ రికార్డును బద్దలు కొట్టాడు.



## స్పిరిట్ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవడం సరైనదేనా

### సందీప్ వంగా ఎందుకింతగా రియాక్ట్ అయ్యారు

అర్జున్ రెడ్డి సినిమాతో ఓవర్ నైట్ స్టార్ డైరెక్టర్ అనిపించుకున్న సందీప్ రెడ్డి వంగా అనూహ్యంగా వార్తల్లోకి వచ్చాడు. నిజానికి స్పిరిట్ సినిమా నుంచి దీపికా తప్పుకుందనే వార్త ముందు వెలుగులోకి వచ్చింది. దానికి దీపికా పెట్టిన కొన్ని కండిషన్స్ కారణమని కూడా అన్నారు. దీపికా పెట్టిన కండిషన్స్ నచ్చకపోవడంతో ఆమెను ప్రాజెక్టు నుంచి తప్పోమని కోరారని, దాంతో ఆమె వెళ్లిపోయిందని బయటకు తెలిసింది. అంతేకాదు, అనిమల్ సినిమాలో సెకండ్ హీరోయిన్ లాంటి పాత్రలో బోల్డ్ క్యారెక్టర్‌లో నటించిన తృప్తి డిమ్రి స్పిరిట్‌లో హీరోయిన్ అంటూ సందీప్ రెడ్డి ప్రకటించాడు. అయితే అనూహ్యంగా ఈ వార్తలు వచ్చిన తర్వాత బాలీవుడ్‌లో స్పిరిట్ ఒక ఏ రేటెడ్ సినిమా అని, ఎక్కువగా బోల్డ్ సీన్స్, లిప్ లాక్‌లు ఉండడంతోనే దీపికా నటించలేనని బయటకు వచ్చిందని బాలీవుడ్ మీడియా పోర్టల్స్‌లో ప్రచారం మొదలైంది. దీంతో ఈ విషయం మీద ఫైర్ అవుతూ సందీప్ రెడ్డి ట్వీట్ చేశాడు.





సినిమా కథ చెప్పి మిమ్మల్ని సినిమాలోకి ఆహ్వానించినప్పుడే ఒక సైన్ చేయని నాన్ డిస్‌క్లోజర్ అగ్రిమెంట్‌లోకి మీరు అడుగుపెట్టినట్లే, కానీ మీరు ఒక యంగ్ యాక్టర్‌ని నాశనం చేయాలనే ఉద్దేశంతో ఆ సినిమా కథ బయటికి చెప్తున్నారని తెలిసింది. అక్కడే మీ క్యారెక్టర్ ఏంటో బయటపడుతుంది. ఇంకా ఈ ఫేక్ ఫెమినిజం ముసుగుతో ఏం చేయాలనుకుంటు న్నారు? సరే, ఈసారి కథ మొత్తం చెప్పండి, నాకు ఏమీ ఫరక్ పడదు అంటూ ఆయన రాసుకొచ్చాడు. అయితే నిజానికి దీపికా పడుకోనే గతంలో ఎప్పుడూ వివాదాల జోలికి వెళ్లలేదు. ఆమె పలువురు హీరోలతో డేటింగ్ చేస్తుందనే వార్తలు వచ్చినా సరే, వాటిని ఖండించలేదు సరికదా, తర్వాత ఒక స్టార్ హీరోని వివాహం చేసుకొని రిలేషన్‌లోకి అడుగు పెట్టింది. ఆమెను వెనకేసుకొస్తూ ఇప్పుడు బాలీవుడ్‌లో ఆర్టికల్స్ రావడంతో దాన్ని పిఆర్ స్టంట్ అంటూ సందీప్ రెడ్డి వంగాతో సహా చాలామంది అభివర్ణిస్తున్నారు. అయితే ఇక్కడ తప్పు ఎవరిది అనే ప్రస్తావన వస్తే, ఎవరిదీ అని కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. ప్రాజెక్టు నుంచి బయటకు వచ్చిన వారు ఎవరూ సినిమా మీద ఇలాంటి విషపు ప్రచారాలు చేయించలేదు. తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న సందీప్ రెడ్డి వంగా ఇమేజ్ మరికొంత డామేజ్ అయ్యే అవకాశం ఉంటుంది.



## తదుపరి సినిమాలపై మహేశ్ టీమ్ ఫోకస్

### పలువురు దర్శకులను లైన్‌లో పెట్టినట్లు టాక్

గుంటూరు కారం సినిమా తర్వాత మహేష్ బాబు ప్రస్తుతం రాజమౌళి దర్శకత్వంలో సినిమా చేస్తున్నారు. ఇప్పటికీ ఈ సినిమా టైటిల్ ఫిక్స్ చేయలేదు. ప్రస్తుతానికి పలు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమాకి సమ్మర్ బ్రేక్ ఇచ్చారు. ఎప్పటిలాగే మహేష్ బాబు వెకేషన్‌కి వెళ్లిపోయాడు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ షెడ్యూల్ ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. అయితే ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు పూర్తవుతుంది, సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుంది అనే విషయం మీద ఎవరికీ క్లారిటీ- లేదు. అయినప్పటికీ ఈ సినిమా పూర్తయిన తర్వాత మహేష్ బాబు ఎవరితో సినిమా చేయాలనే విషయం మీద ఆయన టీం ప్లానింగ్ రెడీ చేస్తోంది. నిజానికి ఈ సినిమా పూర్తి అయిన వెంటనే ఆయన ముగ్గురు దర్శకులను లైన్‌లో పెట్టారు. ముందుగా సందీప్ రెడ్డి డైరెక్షన్‌లో ఒక సినిమా చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు- చెబుతున్నారు. ఒకవేళ అప్పటికే సందీప్ రెడ్డి సిద్ధంగా లేకపోతే, నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సినిమా సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఎందుకంటే కల్కి సినిమా తర్వాత ఆ సినిమా బాగా నచ్చడంతో మహేష్ బాబు స్వయంగా ఆయనతో సినిమా చేయడానికి ఆసక్తి చూపాడు. వైజయంతి మూవీస్‌తో అనుబంధం కారణంగా నాగ్ అశ్విన్ కూడా మహేష్ తో సినిమా చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ఆ సమయానికి ఆయన కూడా అందుబాటులో లేకపోతే.. అప్పుడు బుచ్చిబాబు డైరెక్షన్‌లో సినిమా చేసే అవకాశం ఉంది. ప్రస్తుతానికి బుచ్చిబాబు రామ్ చరణ్ హీరోగా 'పెద్ది' అనే సినిమా చేస్తున్నాడు. అయితే మహేష్ కోసం తాను ఇప్పటికే స్క్రిప్ట్ సిద్ధం చేసుకుంటు-న్నానని గతంలో కూడా ఆయన వెల్లడించారు. కాబట్టి రాజమౌళి సినిమా తర్వాత వెంటనే ఈ ముగ్గురిలో ఎవరో ఒకరితో ఒక సినిమా ప్లాన్ చేసే అవకాశం ఉంది.



## హరిహర వీరమల్లులో అదిపోతున్న సాంగ్స్


పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, దర్శకులు క్రిష్ జాగర్లమూడి అలాగే జ్యోతి కృష్ణలు తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'హరిహర వీరమల్లు'. నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీ ఎప్పుడో రావాల్సింది.. కానీ ఎన్నో ఇబ్బందులు ఎదురుకొని ఫైనల్‌గా ఈ జూన్ 12న గ్రాండ్ గా పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ కాబోతుంది. ఇక విడుదల సమయం దగ్గర పడుతుండడంతో, ఒక్కో అప్ డేట్ వదులుతున్నారు మూవీ మేకర్స్. కాగా ఇప్పటికే మూడు పాటలు రిలీజ్ కాగా, తాజాగా సినిమా నుంచి నాలుగో సాంగ్ కూడా విడుదలైంది. ఇక ఈ సాంగ్ లో నిధి లుక్ అదిరిపోయింది. లిరిక్స్ బ్యాగ్రౌండ్ స్మూత్‌గా కిక్కిచ్చేలా ఉందని చెప్పాలి. కీరవాణి మంచి ట్యూన్‌ని అందించగా శ్రీహర్ష ఈమని ఇచ్చిన సాహిత్యం కూడా బాగుంది. ఇక ఈ సాంగ్ లో లిప్సిక భాష్యం గొంతు, బాగా ప్లస్ అయ్యిందని చెప్పాలి. అలాగే సాంగ్ లో విజువల్స్ కూడా ఒకింత ఆశ్చర్యకరంగా ఉన్నాయి. సాంగ్ మూడ్ కి తగ్గట్టుగా సెట్ చేసిన సెట్టింగ్స్ విశేషంగా ఆకట్టు-కుంటు-న్నాయి. ఇక నిధి అగర్వాల్ అయితే మెయిన్ ఎసెట్ అని చెప్పవచ్చు. తన గ్లామర్ ఇంకా తన డాన్స్ మూమెంట్స్ సాంగ్ లో చాలా బాగున్నాయి. మొత్తానికి నాలుగో పాట కూడా అదిరిపోయింది.




## రామ్ చరణ్‌తో త్రివిక్రమ్ మూవీ

గుంటూరు కారం' సినిమా తర్వాత త్రివిక్రమ్ ఎవరితో సినిమా చేస్తాడు అనే విషయం మీద చాలా చర్చలు జరిగాయి. మొదట ఈ మాటల మాంత్రికుడు అల్లు అర్జున్‌కి కథ చెప్పాడు, దాదాపుగా అది ఫిక్స్ అయిపోయింది అనుకున్న తరుణంలో, అల్లు అర్జున్‌కి, కథ నచ్చకపోవడంతో ఆయన అట్లీతో సినిమా చేసేందుకు వెళ్లారు. ఇప్పుడు త్రివిక్రమ్ ఇతర హీరోలతో సినిమాలు చేసేందుకు ప్లానింగ్ చేసి, చివరికి వెంకటేష్ హీరోగా ఒక సినిమా ఫైనల్ చేశారు. ఇందులో హిరోయిన్‌గా రుక్మిని వసంత్ ని కూడా ఫిక్స్ చేశాడు. అయితే ఇప్పుడు ఈ మూవీకి సంబంధించిన మరో షాకింగ్ న్యూస్ వైరల్ అవుతుంది. ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం రామ్ చరణ్‌ను సంప్రదించగా, ఆ పాత్రలో నటించేందుకు చరణ్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఇక త్వరలోనే ఆ సినిమా పట్టాలెక్కనున్నది. ఇక ఇప్పుడు మరో వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాని ప్రకారం రామ్ చరణ్ తర్వాత సినిమా కూడా త్రివిక్రమ్ శ్రీనివాస్‌తోనే ఉండబోతోంది. ప్రస్తుతానికి రామ్ చరణ్ 16వ సినిమాగా 'పెద్ది' రూపొందుతోంది. ఈ సినిమా పూర్తియిన వెంటనే ఆయన వెంకటేష్ సినిమాలో నటించబోతున్నాడు. ఆ సినిమా పూర్తి అయిన వెంటనే త్రివిక్రమ్, రామ్ చరణ్ కాంబినేషన్‌లో ఒక మంచి పాన్ ఇండియా సబ్జెక్ట్ రూపొందిస్తున్నారని తెలుస్తోంది. ఆ రకంగా రామ్ చరణ్ బ్యాక్ టు-బ్యాక్ ప్రాజెక్ట్స్ గురూజీ తోనే చేయబోతున్నాడు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఇప్పటివరకు త్రివిక్రమ్ ఏ సినిమా చేసినా సితార ఎంటర్-టైన్‌మెంట్స్ లేదా హారిక హాసినితోనే చేసేవాడు. కానీ ఇప్పుడు రామ్ చరణ్‌తో చేయబోయే సినిమాకి కొత్త బ్యానర్ ఒకటి రంగంలోకి దిగబోతున్నట్లుగా తెలుస్తోంది.






## మిరాయ్ టీజర్ అదుర్స్

హనుమాన్' లాంటి భారీ హిట్ అందుకున్నా తేజ సజ్జ మళ్ళీ అదే తరహాలో 'మిరాయ్' వంటి భారీ పాన్ వరల్డ్ చిత్రంతో వస్తున్నాడు. యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కిస్తున్న ఈ షూటింగ్‌కి, కొంచెం ఎక్కువ సమయం తీసుకుంటున్నప్పటికీ ఆ మధ్య వచ్చిన గ్లింప్స్ అందరికీ షాకిచ్చింది. ఒక్కో పోస్టర్ మాత్రం మూవీ అంచనాలు బాగా పెంచేసింది. ఇక ఈ రోజె అవై-టె-డ్ టీ-జర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. టీజర్ ఊహించని రీతిలో ఉందని చెప్పాలి. ఒక్క మాటలో చెప్పాలంటే మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఉంది. ఇండియన్ సినిమా దగ్గర ఎన్నో భారీ సినిమాలు వస్తున్నాయి కానీ కంటెంట్ ఉంటే దానికి తగ్గట్టుగా కావాల్సిన ప్రామిసింగ్ విజువల్స్ కూడా చాలా మెయిన్. ఇక 'మిరాయ్' దానికి అతీతంగా ఉందని చెప్పడంలో సందేహం లేదు. స్టన్నింగ్ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఒక హాలీవుడ్ సినిమా చూస్తున్న ఫీల్ వచ్చింది. ముఖ్యంగా మంచు మనోజ్.. అదరకొట్టాడు. సాహస సన్నివేశాల్లో తేజ ఎక్కడా కూడా అసలు కాంప్రమైజ్ అయినట్టే కనిపించడం లేదు. అలాగే ఇండియన్ సినిమాకు ఒక సరికొత్త అవుట్ ఆఫ్ ది బాక్స్ సినిమాగా ఇవ్వబోతున్నట్లు- తెలుస్తుంది. ఇక లాస్ట్ షాట్‌లో రాముని రాకపై చూపించిన విజువల్ వర్ణనాతీతం.. మొత్తానికి 'మిరాయ్' తెలుగు ఇండస్ట్రీని మరో మెట్టు- ఎక్కించేలా కనిపిస్తుంది.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685